నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
సంపుటి 10 | సంచిక 285
సోమవారం | 14 ఆగస్టు 2017 | విజయవాడ
| పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళ, తిథి : సప్తమి సా. 6.01 నక్షత్రం : భరణి తె. 3.14, వర్జ్యం మ. 1.35 నుంచి 3.06 వరకు
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు; దుర్ముహూర్తం: మ. 12.31 నుంచి 1.22 వరకు తిరిగి మ. 3.04 నుంచి 3.55 వరకు సూర్యోదయం: ఉ. 6.02 గం; సూర్యాస్తమయం: సా. 6.39 గం.

హిమాచల్‌లో విషాదం

● విరిగిపడిన కొండచరియలు ● 46 మంది దుర్మరణం

● ఒక బస్సు లోయలో పడి కొట్టుకుపోయింది ● మరో బస్సు మీద శిథిలాలు పడటంతో ధ్వంసం
● సహాయక చర్యల్లో ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ● 21వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ తాత్కాలికంగా నిలిపివేత
● మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ● సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం: ప్రధాని మోడీ





మండి: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. హిమాచల్‌ప్రదేశ్ రవాణాశాఖకు చెందిన రెండు బస్సులపై కొండచరియలు విరిగి పడటంతో ఒక బస్సు లోయలో పడి కొట్టుకుపోగా మరో బస్సుమీద శిథిలాలు పడటంతో తీవ్రంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో 46 మంది మృతి చెందారు. మృత దేహాలను వెలికితీసారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. మనాలి నుంచి కత్రా, మనాలి నుంచి చంబా ప్రాం తాలకు వెళ్తున్న రెండు బస్సులను శనివారం రాత్రి టీ తాగేందుకు జాతీయరహదారిపై నిలిపి ఉంచారు. అదే సమయంలో బస్సులపై కొండచరియలు విరిగి పడ్డాయి. దాంతో ఓ బస్సు పక్కనే ఉన్న లోయలో 800 మీటర్ల లోతులో పడిపోయింది. ఇంకో బస్సుపై పూర్తిగా శిథిలాలు పడ్డాయి. ఒక్కో బస్సులో 30 నుంచి 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, స్థానిక అధికారులు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎనిమిది మృతదేహాలను వెలికి తీశారు. ప్రమాదం కారణంగా 21వ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ విషయాన్ని మండి డివ్యూటీ కమిషనర్ సందీప్ కదమ్ ధ్రువీకరించారు. మండి ఘటన చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ ప్రమాదంలో గాయపడిన వారు వెంటనే కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. అవసరమైన సహాయాన్ని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నాం అని ప్రధాని మోడీ ట్విటర్ ద్వారా పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానన్నారు. హిమాచల్ ప్రభుత్వం, స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. అసోంలో ఎడతెరిపిలేనివర్షాల కారణంగా

మిగతా 6లో



అమరావతి కీర్తిని చాటుదాం

● ప్రజలకు సిఎం చంద్రబాబు పిలుపు ● పోలవరం ప్రగతి దాయకం ● సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం ● రేపు పురుషోత్తపట్నం ఎత్తిపోతల ప్రారంభం రానున్న మూడు నెలల్లో 28 సాగునీటి పథకాలకు శ్రీకారం ● టెలి కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు ప్రకటన

విజయవాడ, సూర్య బ్యూరో : రాజధాని అమరావతి కీర్తిని రాష్ట్రం నలు దిక్కులా చాటుదామని ప్రజలకు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలను అందించే అమరావతి మనందరికీ గర్వకారణమని, రాష్ట్రం నలు మూలలా సాగునీటితో సస్యశ్యామలం చేసే పోలవరం మనకు ప్రగతిదాయకమని సిఎం పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సందేశాన్ని అందించారు. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లోని వారికి దక్కవలసిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమరావతి నగరంలో నిర్మిస్తున్న ప్రపంచ స్థాయి ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయాల ముఖ ద్వారంలో 13 జిల్లాల సంస్కృతీ, సంప్రదాయ వారసత్వాలను ప్రతిబింబించేలా ఐకనిక్ టవర్‌ను నిర్మించేలా రాజధాని నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఏ) కార్యాచరణ సిద్ధం

మిగతా 6లో

ఎవరినీ వదలం

● గోరఖ్‌పూర్ ఘటనపై ప్రత్యేక విచారణ కమిటీ ● మేము ఈ అంశంపై సీరియస్‌గానే ఉన్నాం ● ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నాం ● తప్పు తేలితే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు ● కేంద్రం తరపున అవసరమైన సాయం అందించేందుకు సిద్ధం ● సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు ● పరిస్థితులను సమీక్షించేందుకు వైద్య బృందం ఏర్పాటు ● మీడియా సమావేశంలో ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యానాథ్



6లో

నంద్యాలలో టీడీపీ జెండా ఎగురవేస్తాం

● టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మారెడ్డి తరపున ప్రచారం ● రాయలసీమను రతనాలసీమగా మార్చిన ఘనత సిఎం చంద్రబాబుదే ● నంద్యాల సభలో మంత్రి శిద్దా రాఘవరావు ప్రచారం

8లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

ఒక్క ఛాన్స్ ఇవ్వండి

● నవరత్నాలతో మీ జీవితాల్లో వెలుగు నింపుతా ● నంద్యాల రోడ్ షోలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి
● చంద్రబాబు వల్లే అక్కచెల్లెమ్మల కళ్లల్లో కన్నీళ్లు ● మా పార్టీ పోటీని తట్టుకోలేక బాబు, లోకేష్ రోడ్లపైకి వస్తున్నారు ● అభివృద్ధి అంటే రోడ్ల విస్తరణ కాదు అదేంటో నేను చేసి చూపిస్తా



నంద్యాల, మేజర్‌న్యూస్ : తమ పార్టీకి ఓటు వేసి ఒక్కఛాన్స్ ఇస్తే మీ జీవితాల్లో నవరత్నాలతో వెలుగు నింపుతానని నంద్యాల ఓటర్లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కోరారు. ఒక్క అవకాశం ఇస్తే తన నాన్న మాదిరిగా మంచి పనులు చేసి అందరి గుండెల్లో ముద్ర వేసుకుంటానని పేర్కొన్నారు. బిల్డింగ్‌లు కూల్చేయడం, రోడ్లు తవ్వడం అభివృద్ధి కాదు, రైతుల, పేదల ముఖాల్లో

మిగతా 6లో

పొంచివున్న ఉగ్ర ముప్పు

● దేశ రాజధానిలో హై అలర్ట్ ● నిఘా నీడలో పంద్రాగస్ట్ వేడుకలు

● భాగ్యనగరంలో భారీ బందోబస్తు ● డ్రోన్ దాడులు జరిగే అవకాశం ఉంది ● కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాల ముందస్తు హెచ్చరిక

హైదరాబాద్,(న్యూస్ నెట్‌వర్క్) : దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. భారత 70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కశ్మీర్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. ఇటీవల అక్కడక్కడా గ్రనేడ్ దాడి ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జమ్మూకశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్‌పీ వైద్ తెలిపారు. గ్రనేడ్ దాడులు ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నప్పటికీ ఆగస్టు 15 వేడుకలు ప్రశాంతంగా సాగేలా, పెద్ద ఎత్తున వేడుకల్లో ప్రజలు హాజరయ్యేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు చెప్పారు. జమ్మూకశ్మీర్ పోషియాన్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున జవాన్లపై కాల్పులకు తెగబడ్డ ముగ్గురు ఉగ్రవాదులను భారత భద్రత బలగాలు మట్టు బెట్టాయి. అంతకు ముందు ఉగ్రవాదుల జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతిచెందారు. ఇక భారత సరిహద్దు ఎల్‌ఓసీ వెంబడి

మిగతా 6లో



అంతే ఇంతే!



ఓటర్లను ఆకర్షించడానికట...

రిజర్వేషన్ల కోసం బడుగుల పోరుబాట

తెలుగు రాష్ట్రాల్లో బీసీలకు రాజ్యాధికారం కోసం పోరాటం

● జనాభా దామాషా ప్రకారం పెంచాలని డిమాండ్ ● ఆందోళనకు కదం తొక్కుతున్న బీసీ సంఘాలు ● బీసీల ఉద్యమానికి విపక్షాల మద్దతు ● తెలంగాణలో 1.90 కోట్ల బీసీలు ● విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల కోసం పోరాటానికి సంసిద్ధం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బడుగులు పోరుబాట పట్టారు. [illegible]

మిగతా 6లో

పోలవరంపై విచారణకు సిద్ధం

ఆనాడు పోలవరానికి అడ్డుపడింది చంద్రబాబే

● ప్రాజెక్టును అడ్డుకొన్నానని తేలితే రాజకీయ సన్యాసం
● లేదని తేలితే మీరు చేసే ఆరోపణలు తప్పు అని ఒప్పుకొంటే చాలు
● నేను అడ్డుపతున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం
● సీఎం చంద్రబాబుకు కేవీపీ రామచంద్రరావు బహిరంగ లేఖ

2లో



సూర్య
హైదరాబాద్
సోమవారం
14 ఆగస్టు 2017



జగన్ వల్లే వైసీపీ ఓటమిపాలవుతుంది

ఏపీ మంత్రి కళా వెంకట్రావు

శ్రీకాకుళం, మేజర్‌న్యూస్:జగన్ భాష, ప్రవర్తన కారణంగా నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ ఓటమిపాలు కానుందని ఏపీ మంత్రి కళా వెంకట్రావు జోస్యం చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవెల్లి సూర్యనారాయణస్వామి ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో కళా వెంకట్రావు మాట్లాడుతూ, జగన్ ఎప్పటికీ నాయకుడు కాలేడని, అందుకు కారణం ఆయన ప్రవర్తన, మాటతీరు, బాడీ లాంగ్వేజ్, ఆయన చేసే పనులు, గతంలో జగన్ చేసిన అవినీతి పనులేనని అన్నారు. జైలు జీవితం గడిపినప్పటికీ జగన్ జీవితంలో ఎటువంటి మార్పు రాలేదని, పరివర్తన చెందలేదని, జగన్ లాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరాడని అన్నారు. వైసీపీ పెద్దలు, పార్టీ కార్యకర్తలు జగన్‌ని అసహ్యించుకునే పరిస్థితులు ఈ రోజు ఉన్నాయని విమర్శించారు.

రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం పని చేసే వ్యక్తి జగన్ కాదని, నాడు తన తండ్రి నీడలో లక్ష కోట్లు దోచుకున్న జగన్ కు అధికారం వస్తే మరింత అవినీతికి పాల్పడతాడని ఆరోపించారు. ఈ ఉపఎన్నికల్లో జగన్ని ఓడించేందుకు ప్రత్యేకమైన చర్యలు ఏవీ అక్కర్లేదని, ఆయన గురించి ప్రజలందరికీ తెలుసని, అభివృద్ధి మంత్రంతోనే నంద్యాల ఉపఎన్నికల్లో టీడీపీ గెలుపు సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు

నష్టనివారణ చర్యల్లో టీఆర్ఎస్ నాయకత్వం

- నేరెళ్ల ఘటనతో ఆత్మరక్షణలో అధికార పార్టీ
- రంగంలోకి దిగిన మంత్రి కేటీఆర్
- బాధితులకు దన్నుగా ఉంటామని భరోసా
- ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్న విపక్షాలు
- నేడు గవర్నర్ నరసింహన్‌ను కలువాలని నిర్ణయం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : నేరెళ్ల ఘటనతో ఆత్మరక్షణలో పడిన అధికారపార్టీ, నష్టనివారణ చర్యలు చేపట్టింది. నేరెళ్ల ఘటన బాధితులకు అండగా ఉంటామని రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ ప్రకటించిన 24 గంటల వ్యవధిలోనే ఈఘటనకు బాధ్యులైన ఎస్ఐని డీజీపీ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. నేరెళ్లలో చోటు చేసుకున్న లారీ ప్రమాద ఘటనను ఆధారంగా చేసుకుని, మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఇసుక తరలింపుపై గత రెండు నెలలుగా విపక్షాలన్నీ ఏకమై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయి. నేరెళ్లలో చోటు చేసుకున్న పరిణామాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకొస్తూండడంతో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని చేయాలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, నేరెళ్ల బాధితులకు దన్నుగా ఛలో సిరిసిల్ల కార్యక్రమం నిర్వహించగా, టీడీపీ, బీజేపీలు కూడా బాధితులకు బాసటగా నిలిచాయి. వామపక్షపార్టీలు కూడా నేరెళ్ల బాధితుల్ని పరామర్శించి సంఘీభావాన్ని తెలియజేశాయి. విపక్షాలన్నీ ఏకమై, అధికార పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేయడంతో అధికారపార్టీ నాయకత్వం అప్రమత్తమయింది. మంత్రి కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి విపక్షాల ఎత్తుగడలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. నేరెళ్ల బాధితుల్ని ఆయన పరామర్శించి, బాసటగా ఉంటామని హామీ ఇచ్చి ఈ వివాదాని ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నాన్ని చేశారు. ఎస్పీ విశ్వజిత్ ఆదేశాలతోనే పోలీసులు తమను అకారణంగా వేధించారని విపక్షాలు నిర్వహించిన పలు సమావేశాల్లో బాధితులు పేర్కొనడంతో సర్కార్‌పై విమర్శలు పెరిగాయి. నేరెళ్లఘటనపై ప్రధానపార్టీలన్నీ ఫోకస్ చేయడంతో టీఆర్ఎస్ నాయకత్వం దిగిరాక తప్పలేదు. ఇప్పటికే ఒక ఎస్ఐని సస్పెండ్ చేసినప్పటికీ, బాధితులు తమ స్వరాన్ని ఇంకా పెంచుతుండటంతో, ఈవ్యవహారం నుంచి బయటపడేందుకు అధికార పార్టీ ఎలా వ్యవహరిస్తుందో అన్నది చర్చనీయాంశంగా మారింది. బాధితుల పక్షాన నిలుస్తోన్న ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వతీరును ఎండగడుతూ నేడు గవర్నర్ నర్సింహన్ కలిసి వినతిపత్రాన్ని అందజేయాలని నిర్ణయించారు. నేరెళ్లలో చోటు చేసుకున్న ఘటన దురదృష్టకరమే అయినప్పటికీ, చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించినా సహించేదిలేదని సర్కార్ పెద్దలు హెచ్చరికలు చేస్తున్నారు.

ఒకవైపు హెచ్చరికల ద్వారా తామెక్కడ తగ్గలేదన్న సంకేతాలను పంపిస్తూనే, మరోవైపు బాధితులకు అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం ద్వారా ఈవివాదానికి ముగింపు పలకాలని టీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్రాంతం కావడంతో నేరెళ్ల ఘటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది.

వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, బాలకృష్ణ



రంగారెడ్డి, మేజర్‌న్యూస్:మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి కూతురు వివాహం వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. ఆదివారంనాడు మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి కూతురు వివాహం శంషాబాద్‌లోని కేవీఎస్‌సీ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ వివాహానికి సీఎం చంద్రబాబు, బాలకృష్ణ, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా శాఖల ముఖ్య అధికారులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

టీఆర్ఎస్ వర్సెస్ టీ-జాక్

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కలిసి పనిచేసిన టీఆర్ఎస్, టీ-జాక్ మధ్య పోరు పతాకస్థాయికి చేరుకుంది. తెలంగాణ కోసం అందర్నీ ఏకం చేయడంలో కీలకపాత్ర పోషించిన టీ-జాక్, ఎన్నికల అనంతరం టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత క్రమేపీ ఆపార్టీకి దూరమైన విషయం తెలిసిందే. టీ-జాక్ చైర్మన్ కోదండరామ్‌ను లక్ష్యంగా చేసుకుని అధికారపార్టీ నేతలు, మంత్రులు తరుచూ విమర్శలు చేస్తూ వస్తున్నారు. అయితే తాజా టీ-జాక్‌తో టీఆర్ఎస్ ప్రత్యక్ష యుద్ధానికి రెడీ అవుతోంది. కోదండరామ్ చేస్తున్న అమరుల స్ఫూర్తి యాత్రపై టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. ఎక్కడికక్కడ అమరవీరులస్ఫూర్తి యాత్రను అడ్డుకోవాలని నిర్ణయించారు. అమరవీరుల స్ఫూర్తియాత్రను నిజామాబాద్ లో టీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడం పట్ల టీజాక్ నేతలు మండిపడుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గులాబీదళపతి చెప్పినట్లు నడ్చుకుని ఇతర పార్టీల చేత విమర్శలు మూటగట్టుకున్న టీజాక్ నాయకత్వం, ఇప్పుడు స్వతంత్రంగా వ్యవహరిస్తుండడం అధికారపార్టీ కెంతమాత్రం రుచించడం లేదు. దాంతో ప్రధానప్రతిపక్షం కాంగ్రెస్ కనుసన్నల్లో టీ-జాక్ నాయకత్వం పనిచేస్తోందంటూ ఆపార్టీ నేతలు విమర్శిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలపై ఆచి తూచి

- స్ఫూర్తియాత్రను అడ్డుకున్న టీఆర్ఎస్ శ్రేణులు
- టీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పిస్తున్న టీ-జాక్ నేతలు
- ఇన్నాళ్లూ ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు చేసిన కోదండ
- కోదండను కాంగ్రెస్ ఏజెంటన్న టీఆర్ఎస్ నేతలు, మంత్రులు
- రాజకీయంగా ప్రత్యక్షంగా తలపడేందుకు రెడీ అవుతున్న టీ-జాక్

స్పందించిన టీ జాక్ నాయకత్వం, ఇటీవల దూకుడును పెంచింది. ప్రతిపక్షాల కంటే ఎక్కువగా ప్రభుత్వ విధానాల్ని ప్రజల్లో ఎండగడుబడుతూ వస్తోంది. ఇన్నాళ్లూ టీ-జాక్ చైర్మన్ చైర్మన్ కోదండరామ్‌పై టీఆర్ఎస్ నేతలు నేరుగా విమర్శలు చేయగా, కోదండరామ్ మాత్రం ప్రభుత్వ విధానాల్ని మాత్రమే ప్రశ్నిస్తూ వచ్చారు. ఇటీవల గులాబీదళపతిపై టీ-జాక్ నేతలు సైతం నేరుగా విమర్శలు గుప్పించడం హాట్ టాఫిక్‌గా మారింది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీఆర్ఎస్ కీలక నేతల నియోజకవర్గాలని లక్ష్యంగా చేసుకుని కోదండరామ్ అమరవీరుల స్ఫూర్తియాత్ర నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న



గజ్వేల్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తోన్న సిద్దిపేట, రాష్ట్ర మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోకవర్గాల్లో కోదండరామ్ అమరవీరుల స్ఫూర్తియాత్రను పూర్తి చేశారు. టీఆర్ఎస్ అగ్రనేతల నియోజకవర్గాల్లో నిర్వహించిన అమరుల స్ఫూర్తియాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో, తాజాగా నిజామాబాద్ జిల్లాలో ప్రారంభించిన స్ఫూర్తి యాత్రను టీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో, శాంతిభద్రతల సాకుతో పోలీసులు కోదండరామ్‌ను అరెస్టు చేశారు. పోలీసుల సహకారం ప్రభుత్వం తమ స్ఫూర్తియాత్రను అడ్డుకునే ప్రయత్నం చేసినా, తాము యాత్రలను నిర్వహించి తీరుతామని కోదండరామ్ తేల్చిచెబుతున్నారు. ఇప్పటి వరకూ చాటుమాటుగా తలపడ్డ టీఆర్ఎస్, టీ-జాక్‌లిక ప్రత్యక్షంగా తలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చంద్రబాబు కుయుక్తులు

వైసీపీ నేత పెద్దిరెడ్డి




చిత్తూరు, మేజర్‌న్యూస్:నంద్యాల ఉప ఎన్నికలో సీఎం చంద్రబాబునాయుడు కుయుక్తులు పన్నుతున్నారంటూ వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికలో ఓట్లు రాబట్టుకునేందుకే చంద్రబాబు అభివృద్ధి హామీలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నిక లేకపోతే నంద్యాల నియోజకవర్గంలో ఒక్క పని కూడా చంద్రబాబు చేసేవారు కాదని అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పథకం ప్రకారమే నంద్యాలలో అవినీతి డబ్బు పంపిణీ జరుగుతోందని ఆయన విమర్శించారు. చంద్రబాబు హయాంలో రాయలసీమకు పూర్తిస్థాయిలో అన్యాయం జరుగుతోందన్నారు. రెయిన్ గన్స్‌తో పంటలను కాపాడామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ ధనాన్ని పథకాల పేరుతో ఎలా దోచుకోవాలో తెలిసిన వ్యక్తి చంద్రబాబు అని ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబు కుట్రలను ప్రజలు గమనించాలని, ప్రత్యేక హోదాను గాలికొదిలేసిన వ్యక్తి ఆయన అని విమర్శించారు. వైసీపీపై కొన్ని న్యూస్ చానెళ్లు, వార్తాపత్రికలు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నాయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బొట్టుబిళ్లల పంపిణీపై ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. డబ్బులు పంచుతున్నారంటూ అసత్య ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. జగన్ ఫొటోతో కూడిన బొట్టు బిళ్లల పంపిణీ మాత్రమే చేశామని తెలిపారు. ప్రలోభాలకు లొంగకపోవడం వల్లే టీడీపీ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. అసత్య ప్రచారం చేసిన మీడియా, ప్రతిక క్షమాపణ చెప్పాలని, లేదంటే ఈ విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్తామని పెద్దిరెడ్డి స్పష్టం చేశారు.

పోలవరంపై విచారణకు సిద్ధం

- ఆనాడు పోలవరానికి అడ్డుపడింది చంద్రబాబే
- ప్రాజెక్టును అడ్డుకొన్నానని తేలితే రాజకీయ సన్యాసం
- లేదని తేలితే మీరు చేసే ఆరోపణలు తప్పుఅని ఒప్పుకొంటే చాలు
- సీఎంకు కేవీపీ రామచంద్రరావు బహిరంగ లేఖ

విజయవాడ, మేజర్ న్యూస్: పోలవరం ప్రాజెక్టును తాను అడ్డుకొంటున్నానని మీరు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎంకు ఓ బహిరంగ లేఖ రాశారు. 'మీరు, మీ భజన బృందం పదే పదే ప్రచారం చేస్తున్నట్లుగా ఆ పోలవరం ఆపడానికి నేను కుట్ర చేస్తున్నట్లైతే మరో మూడు సంవత్సరాలు ఉన్న నారాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకొని శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలగుతాను' అని ఆయన తెలిపారు. ఈ విషయంలో మీరు విచారణ కమిటీ వేస్తే నేను అక్కడకు రావడానికి సిద్ధమని, నిజం అని తేలకపోతే మీరు నాపై చేసిన ఆరోపణలు తప్పు అని చెపితే చాలు అని బాబుకు ఆయన సూచించారు. రాజీనామా చేయనక్కరలేదని అన్నారు. ఇంకా ఆ లేఖలో ఈ విధంగా పేర్కొన్నారు.

'పోలవరం ఆంధ్ర ప్రదేశ్‌కు జీవనాడి అని ఇప్పటికైనా మీరు గుర్తించినందుకు- ఇలా మీరు గుర్తించేలా చేయగలగడంలో నా పాత్ర కూడా ఉన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉన్నది. పోలవరం ప్రాధాన్యతను మీరు ముఖ్యమంత్రిగా పని చేసిన 1995, 2004 మధ్యనే గుర్తించి ఉంటే ఈ రోజు ఆంధ్ర ప్రదేశ్ పరిస్థితి వేరుగా ఉండేది కదా అన్న బాధ కూడా ఉన్నది. అధికారంలో ఉన్న ఆ రోజులలో కార్పొరేట్ ప్రభుత్వాన్ని నడిపిన మీరు పొలాలను, సాగునీటిని, రైతులను మరచిపోయి పోలవరాన్ని తుంగలో తొక్కారు. కానీ, రాష్ట్రానికి రావలసిన ఎన్నో ప్రయోజనాలను పణంగా పెట్టి పోలవరం నిర్మాణ బాధ్యత మీ చేతులలోకి తీసుకోగానే ఏమైందో ఏమో గాని - పోలవరం మీ చిరకాల స్వప్నం అంటూ ఆంధ్రులపై మెరుపు దాడి ప్రారంభించి- పోలవరం కల సాకారం చేసే అవకాశం మీకు వచ్చినందుకు ధన్యుడను అయ్యానంటూ- ఆనందబాష్పాల పేరుతో మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను అయోమయానికి గురి చేయడంతో పాటు నేను కూడా పోలవరానికి అడ్డు పడుతున్నానంటూ పదే పదే ప్రకటిస్తుండడంతో పోలవరానికి 1981లో జరిగిన శంకుస్థాపన దగ్గర నుంచి పోలవరం నిర్మాణాన్ని కేంద్రం నుండి మీ చేతులలోకి తీసుకొనే వరకు జరిగిన వాస్తవాలను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. పోలవరానికి వివిధ అనుమతులు సాధించడంలో నా పాత్రను గురించి కూడా తెలుపుతూ మీకు గత జనవరిలో రెండు లేఖలు రాసాను. ఆ లేఖలలోనే మీ భజన బృందం నేను పోలవరం నిర్మాణానికి అడ్డు పడుతున్నానని చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని కోరాను. కానీ మీ తప్పులను ప్రశ్నించినవారిపై పదే పదే ఆరోపణలు చేసి ప్రజల దృష్టిని మరలించి పబ్బం గడుపుకోవడం మీకు అలవాటే కనుక మీరు నా లేఖలపై స్పందించలేదు. మళ్ళీ ఈ మధ్య పోలవరాన్ని త్వరగా పూర్తి చేసి జాతికి అంకితం చేద్దామని మీరు ప్రయత్నాలు చేస్తుంటే నాతో సహా కొంత మంది పోలవరాన్ని ఆపడానికి కుట్రలు చేస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రితో సహా మీ వందిమాగధ బృందం పదే పదే పాత ఆరోపణలు చేయడం దానికి అడపా దడపా మీరు వంత పాడడంతో పాటూ జూలై 25న ఢిల్లీలో పత్రికలతో మాట్లాడుతూ పోలవరం విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించడమే తప్పు అంటూ వెదజల్లిన విషవ్యాఖ్యలను నిజమేమోనని నమ్మి కొందరు తటస్థంగా ఆలోచించవలసిన జర్నలిస్ట్ మిత్రులు కూడా నేను పోలవరానికి నిజంగానే అడ్డు పడుతున్నానన్నట్లు మాట్లాడడంతో సామాన్య ప్రజలు కూడా మీ మాటల వల్ల మోసపోయే అవకాశం ఉందని భావించి సుదీర్ఘమే అయినా విపులంగా నాకు మరోసారి ఈ లేఖ రాయక తప్పడం లేదు. పోలవరం నిర్మాణ కల మీరు సాకారం చేద్దామని కష్టపడుతుంటే నేను అడ్డు పడుతున్నాననే మీ ఆరోపణలు ఖండించి పోలవరం నిర్మాణంలో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలనేదే నా కోరిక తప్ప పోలవరం విషయంలో మిమ్మల్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టాలనేది నా ఉద్దేశ్యం కాదు. 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పోలవరం నిర్మాణానికి కావలసిన అన్ని అనుమతులు తీసుకువచ్చిన తరువాత విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించిన తరువాత ఇంకా ముఖ్యంగా పోలవరం నిర్మాణాన్ని కేంద్రం మీ చేతులలో పెట్టిన తరువాత, మీకు పోలవరంపై హఠాత్తుగా ఆసక్తి పెరిగి పోలవరం నా కల అంటూ మిమ్మల్ని మీరే మోసం



చేసుకోవడంతో పాటు, జనాన్ని కూడా మాయ చేయాలని చూసారు. ఇక 2004కు ముందు కూడా పోలవరం గురించి కలలు కన్నారు అని నిరూపించుకోవడానికి మీ దగ్గర ఏమి సాక్ష్యాలు ఉన్నాయో తెలియదు గాని ఆ రోజులలో మీరు పోలవరానికి అడ్డు పడ్డారని చెప్పడానికి కొన్ని సాక్ష్యాలు (కొందరు ప్రత్యక్ష సాక్షులు ఇప్పటికే దివంగతులు అయినప్పటికీ) ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. ఇంకా 2004కు ముందు మీరు ఎన్డీయే ప్రభుత్వ పరిరక్షకుడిగా ఉంటూ దేశ ప్రధానులను, రాష్ట్రపతులను ఎన్నిక చేస్తూ ఉన్న రోజులలో పోలవరం నిర్మాణానికి అడ్డు పడకుండా సహకరించి పోలవరాన్ని పూర్తి చేసి ఉంటే ఈ రోజు పోలవరంతో కూడిన ఆంధ్ర ప్రదేశ్‌ను ఎలా ఉండేదో ఊహించుకుంటేనే ఒళ్లు పులకరిస్తున్నది. వాస్తవానికి ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్ట్ విషయంలో మీరు చేసింది ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్ట్‌గా చలామణిలో ఉన్న పోలవరం ప్రాజెక్ట్‌ను పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా మార్చడమే కదా! ఇక ఇప్పుడు పోలవరం మీ చేతికి వచ్చిన తరువాత కాంట్రాక్టర్లను, సబ్ కాంట్రాక్టర్‌లను సైతం మీకు నచ్చిన వారిని ముఖ్యమంత్రి స్థాయిలో మీ టేబుల్ ఎదురుగా కూర్చోపెట్టుకొని వాళ్లకు నచ్చినట్లు ఏ విధమైన ప్రాతిపదికా లేకుండా వారు నచ్చి, మెచ్చి, ఇచ్చగించే రేట్లకు వాళ్లకు కాంట్రాక్టులు అప్పగించడంలో చేతికి ఎముకే లేనట్లు వ్యవహరిస్తూ దానగుణంలో శిబి చక్రవర్తిని మరిపిస్తున్నారని సామాన్య ప్రజలు చెవులు కొరుక్కొంటున్నారు. రాష్ట్ర విభజన జరిగి మూడు సంవత్సరాలు అయింది. అదే విధంగా విభజన సమయంలో ఆంధ్రకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని, ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి అన్ని విధాలా సహాయపడతామని మోడీ, మీరు తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రజలకు వాగ్దానాలు చేసి కూడా మూడు ఏళ్లు పైగా గడిచాయి. అవినీతికి, బంధుప్రీతికి ఆమడ దూరంలో ఉంటూ, నిరంతరం ప్రజా సేవే శ్వాసగా బ్రతుకుతున్నానని చెప్పుకొనే మోడీ, ఇక భార్య పిల్లలను సైతం పట్టించుకోకుండా రోజుకు ఇరవై గంటలకు పైగా రాష్ట్ర ప్రజలు సంక్షేమానికి వెచ్చిస్తూ అవినీతిని రూపుమాపడానికే అవతరించానని, రాష్ట్రంలో అవినీతిని అబ్రకదబ్ర అని మాయం చేశానని చెప్పుకొంటున్న మీరు ఈ మూడేళ్లలో ఆంధ్ర ప్రదేశ్‌కు చేసింది ఏమిటి? కనీసం కాంగ్రెస్ విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ఇచ్చిన హామీలలో కనీసం కొన్ని అయినా మోడీ నెరవేర్చారా? మీరు సాధించగలిగారా? ఒకసారి ఆత్మావలోకనం చేసుకోండి. ముఖ్యంగా పోలవరం విషయంలో మీరు సాధించింది ఏమిటి? పోలవరం ముంపు మండలాలను ఆంధ్ర ప్రదేశ్‌లో కలపడం మీరు సాధించిన ఘనతగా మీరు మీ భజన బృందం ప్రచారం చేసుకోవడం, దానికి సాక్ష్యంగా పోలవరం ముంపు మండలాలకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను జారీ చేయడానికి యూపీఏ ప్రభుత్వం నిరాకరించింది అని చెప్పడం వాస్తవాలకు మసిపూయడం కాదా? వాస్తవానికి 2014 మార్చి 2న యూపీఏ కాబినెట్‌లో ముంపు మండలాలకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీ చేయాలని అనుకున్నప్పుడు అప్పటికే రాష్ట్రపతి ఆమోదం పొందిన విభజన బిల్లులో రాజ్యాంగపు ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్ర సరిహద్దులను మార్చుతూ మార్పులు చేయాలంటే అప్పటికి రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉన్నప్పటికీ శాసనసభ రద్దు కానందున ఉనికిలో ఉన్న రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకోవలసి ఉంటుందని, కానీ అప్పుడు రాష్ట్రంలో శాసనసభను సమావేశపరిచి శాసనసభ అభిప్రాయాన్ని తీసుకొనే పరిస్థితులు లేని కారణంగా ఆర్డినెన్స్ జారీ చేయడానికి న్యాయ శాఖ అంగీకరించకపోవడం వల్లే ఆర్డినెన్స్ జారీ చేయడానికి నిరాకరించి ముంపు మండలాలను ఆంధ్ర ప్రదేశ్‌లో కలిపే ప్రతిపాదనను యూపీఏ ప్రభుత్వం ఆమోదించింది. దీనికి సంబంధించిన బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాలలో పెట్టవలసిందిగా సూచించిందని తెలిసి కూడా యూపీఏ ప్రభుత్వం ముంపు మండలాలను ఆంధ్రలో కలపలేదని చెప్పి మీరు మేమే దాన్ని సాధించామని చెప్పుకోవడం చూస్తే ముచ్చటగా ఉంది. అబద్ధాలను అందంగా చెప్పగలిగే ఈ ప్రజ్ఞ మీకు మాత్రమే సొంతం కదా! వాస్తవానికి మీరు ఎన్నికలలో గెలిచి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు ఢిల్లీలో కేంద్ర మంత్రులందరిని కలిసినప్పుడు మీతో కలసి కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ వారి వద్దకు వచ్చి విభజన చట్టంలో పేర్కొన్నవి అమలు చేయండని వారిని కోరిన విషయం మరచిపోయారా? దానిలో భాగంగానే హోమ్ శాఖ మంత్రి రాజనాధ్ సింగ్‌ను కలసినప్పుడు అప్పటికి ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ రద్దు అయ్యి రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉన్నందున రాజ్యాంగపు ఆర్టికల్ 3 ప్రకారం శాసనసభ హక్కులన్నీ పార్లమెంట్‌కు సంక్రమిస్తాయని, కాబట్టి ఇప్పుడు పోలవరం ముంపు మండలాల ఆర్డినెన్స్ జారీ చేయవచ్చునని, ఒకవేళ జూన్ 2 లోపు ఆర్డినెన్సు జారీ చేయకుంటే, జూన్ 2న తెలంగాణ ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పుడు యూపీఏ కాబినెట్‌కు మార్చి 2న ఆర్డినెన్స్ జారీ చేయడానికి ఏర్పడిన అవరోధం ఇప్పుడు ప్రభుత్వానికి కూడా ఏర్పడుతుందని తెలిపినది నిజం కాదా? కేంద్రం చేపడుతున్న జాతీయ ప్రాజెక్ట్‌లు నత్తనడకన నడుస్తున్నాయని అనే నెపంతో రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదాతో పాటు పలు విభజన హామీలను తాకట్టు పెట్టి పోలవరం నిర్మాణాన్ని మీ చేతులలోకి తీసుకొన్నారు. కేంద్రం పెట్టిన పలు షరతులను ఒప్పుకొని ఈ ప్రాజెక్ట్‌ను మీ చేతులలోకి తీసుకొన్నారంటేనే మీకు రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలు ముఖ్యమని రుజువు అవడం లేదా? కేంద్రం ఆ రహస్యం బయటపెడుతుందేమో అనే భయంతోనే పోలవరం గురించి ఎవరు మాట్లాడినా మీరు ఎదురుదాడి చేస్తున్నారు- చేయిస్తున్నారు, ఇక పట్టిసీమ ద్వారా డెల్టాకు జరిగిన మేలును చూసిన తరువాత తట్టుకోలేక హృదయం ద్రవించి అదే విధంగా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఉత్తరాంధ్ర జిల్లాలకు కూడా పురుషోత్తపట్నం ద్వారా మేలు చేయాలనీ మీరు సంకల్పించడం పలు అనుమానాలకు తావు ఇస్తున్నది. కాబట్టి పోలవరం విషయంలో నేను మీకు బహిరంగంగా చేస్తున్న సవాల్ ఇదే. గత శాసనసభ సమావేశాలలో ప్రతిపక్ష నాయకుడు మంత్రివర్గ సహచరుడిపై అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి ఆరోపణలు చేసినప్పుడు ఆరోపణలు నిరూపిస్తే మీ మంత్రివర్గ సహచరుడు, నిరూపించలేకపోతే ప్రతిపక్ష నాయకుడు రాజకీయాల నుంచి వైదొలగడానికి ఒప్పుకొంటేనే ఎంక్వయిరీ వేస్తానని చెప్పిన మీ వ్యాఖ్యలను స్ఫూర్తిగా తీసుకొని మిమ్మల్ని నేను చాలెంజ్ చేస్తున్నాను. మీరు, మీ భజన బృందం పదేపదే ప్రచారం చేస్తున్నట్లుగా ఆ పోలవరం ఆపడానికి నేను కుట్ర చేస్తున్నట్లయితే మరో మూడు సంవత్సరాలు ఉన్న నా రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకొని శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలగుతా. ఈ విషయంలో మీరు విచారణ కమిటీ వేస్తే నేను అక్కడకు రావడానికి సిద్ధం. నిజం అని తేలకపోతే మీరు నాపై చేసిన ఆరోపణలు తప్పు అని చెపితే చాలు. రాజీనామా చేయనక్కరలేదు. మీకు నైతికత ఉంటే ఈ చాలెంజ్‌కు ఒప్పుకోండి. లేదా నాపై మీరు చేసిన ఆరోపణలు అన్నీ అబద్ధమేనని, అలాగే గత రెండు లేఖలతో పాటు ఈ లేఖలో నేను పేర్కొంటున్నవి అన్ని వాస్తవాలేనని ప్రజలు తెలుసుకొంటారు.

ప్రజాస్వామ్యంలో ఎవరూ శాశ్వతంగా అధికారాన్ని అంటిపెట్టుకొని ఉండలేరు. రేపు 2019లో ఎన్నికల తరువాత రాష్ట్రంలో, కేంద్రంలో ఎవరు ఉంటారో తెలియదు. కాబట్టి స్వప్రయోజనాలు వదిలిపెట్టి రాష్ట్ర ప్రయోజనాల గురించి కొద్దిగా ఆలోచించి పోలవరం పూర్తి అయ్యే వరకు ఖర్చు అయ్యే ప్రతి రూపాయి కేంద్రమే భరించేలా ఒక ఆదేశాన్ని కేంద్రం నుండి సాధించడానికి ప్రయత్నించండి.

రాష్ట్ర ప్రజల హక్కులను సాధించడంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చేలా కేంద్రంపై ఒత్తిడి చేయండి' అని ఆ లేఖలో కేవీపీ పేర్కొన్నారు.

నంద్యాలను రెఫరెండంగా స్వీకరించే దమ్ముందా

వైసీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ



హైదరాబాద్, మేజర్‌న్యూస్:మూడేళ్ల పాలనకు రిఫరెండంగా నంద్యాల ఉపఎన్నికను స్వీకరించే దమ్ము టీడీపీ నేతలకు ఉందా అని వైసీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ సవాలు విసిరారు. టీడీపీ నేతలు నంద్యాల ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రోడ్ల విస్తరణ పేరుతో భవనాలను కూల్చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రానికి ఏం చేశారో చెప్పే శక్తి సీఎం చంద్రబాబు నాయుడికిగానీ, టీడీపీ నేతలకుగానీ లేదు. నా పాలన చూచసి ఓటేయమని చంద్రబాబు కూడా అడగలేకపోతున్నారు. మీ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేయడం సరికాదు. టీడీపీ తాటాకుచప్పుళ్లకు భయపడే ప్రసక్తేలేదు అని పద్మ అన్నారు.

నంద్యాలలో వైఎస్ జగన్ రోడ్‌షో



నంద్యాల, మేజర్‌న్యూస్:ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఐదో రోజు రోడ్ షో ఆదివారం నంద్యాల పట్టణంలో ప్రారంభమైంది. శ్రీనివాస సెంటర్, వెంకప్ప అంగడిల మీదుగా బాలాజీ కాంప్లెక్స్, పైప్‌లైన్ రోడ్, సింగ్ కాలనీ, ఫరూక్‌నగర్, చౌరస్తా వరకు రోడ్‌షో కొనసాగింది. అక్కడి నుంచి ఫరూక్ నగర్, ఎన్ఆర్ఎస్ మూర్తి హాస్పిటల్, స్కావెంజర్స్, బాల్కొండహాల్, సంచిబట్టల సందు మీదుగా రోడ్‌షో కొనసాగింది. వెంకటేశ్వర దేవాలయం సెంటర్, గుడిపాటిగడ్డ సెంటర్, మేడం వారి వీధి, జుమ్మా మసీదు, గాంధీచౌక్‌ల మీదుగా కల్పనా సెంటర్, ఫళాని కూల్‌డ్రింక్స్ సందు, ముల్లాన్‌పేటతోపాటు బైర్మల్‌వీధి, మున్సిపల్ హైస్కూల్ సెంటర్, చాంద్‌బాడ మీదుగా రోడ్ షో నిర్వహించారు

నిరూపిస్తే ఉప ఎన్నిక నుంచి తప్పుకుంటాం

శిల్పా మోహన్‌రెడ్డి తనయుడి వెల్లడి



నంద్యాల, మేజర్‌న్యూస్: ధైర్యం, నిజాయితీ ఉంటే తాము డబ్బు పంచామని ఆరోపిస్తున్న వీడియోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాలని శిల్పామోహన్‌రెడ్డి కుమారుడు రవిచంద్ర కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు. వీడియోలో డబ్బు పంచినట్లు నిరూపిస్తే తన తండ్రి శిల్పామోహన్ రెడ్డి ఎన్నికల నుంచి తప్పుకుంటారని సవాలు విసిరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఓటర్లను మభ్యపెడుతోందని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచేందుకు తెలుగుదేశం రూ.200 కోట్లు ఖర్చు చేస్తోందని అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. తెలుగుదేశం నీచ రాజకీయాలు చేస్తోందని, ఇటువంటి రాజకీయాలు ఎక్కడా చూడలేదన్నారు. మొదటి నుంచి డబ్బు పంచే అలవాటు టీడీపీకి ఉందన్నారు. ఓటుకు రూ. 5వేలు ఇవ్వడానికి వెనుకాడట్లేదని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలకు వెళ్లకుండా ఉండేందుకు ఒక్కో మహిళకు రూ.300 ఇస్తున్నారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరకడంతో రాత్రికి రాత్రి అమరావతికి మకాం మార్చారని ఎద్దేవా చేశారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు వైసీపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

స్వాతంత్ర్యదిన వేడుకలకు ముస్తాబవుతున్న గోల్కొండ కోట

- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్
- గోల్కొండ కోటను అధీనంలోకి తీసుకున్న పోలీసులు
- బాంబు, డాగ్‌స్క్వాడ్స్‌తో తనిఖీలు... వీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోట సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పంద్రాగస్టు వేడుకలకు శరవేగంగా ఏర్పాట్లు జరగుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లను చేస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్ వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు ఇప్పటికే గోల్కొండ కోటను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. గోల్కొండ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. బాంబు స్క్వాడ్స్, పోలీసు జాగిలాలతో తనిఖీలు చేస్తున్నారు. గోల్కొండ కోటకు సుమారు రెండు కిలోమీటర్ల మేర పోలీసులు నిఘా పెట్టారు. స్వాతంత్ర్య వేడుకుల కోసం దాదాపు 5వేల మంది పోలీసులు కోటలో మోహరించారు. డీసీపీలు, ఏసీపీలు, సీఐలతోపాటు ఎస్సైలు, కానిస్టేబుల్స్, హోంగార్డులో బందోబస్తులో పాల్గొంటున్నారు. కేవలం హైదరాబాద్ పోలీసులే కాకుండా, ఇతర జిల్లాల్లోని పోలీసు సిబ్బందిని భద్రత నిమిత్తం హైదరాబాద్‌కు రప్పించారు. వేడుకల్లో పాల్గొనే వీఐపీలు, వీవీఐపీలు , మంత్రులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. త్రివర్ణ పతాకావిష్కరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులిప్పటికే రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. గోల్కొండ కోటను రంగు, రంగుల విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. రాత్రిపూట విద్యుత్‌దీపాలు జిగేల్‌మంటూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్‌దీపాల వెలుగుల్లో గోల్కొండ కోట కాంతులీనుతోంది. కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనే విద్యార్థుల కోసం ప్రత్యేక గ్యాలరీని పోలీసులు ఏర్పాటు చేశారు. వీఐపీలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖాకీ వనంలో కబ్జా మొక్కలు



- భూ వివాదంలో అదనపు డిసిపి అత్యుత్సాహం
- బాధితులపైనే కేసులు నమోదు చేసిన వైనం
- చెక్కులపై బలవంతంగా సంతకాలు
- సిపిని ఆశ్రయించిన బాధితులు
- నలుగురు పోలీసులపై కేసు నమోదు



నెలకు వేలకు వేలు వేతనాలందుకుంటూనే ఖాకీలు కాసుల కక్కుర్తితో దిగజారుతున్నారు. ఒంటిచేత్తో శాంతిభద్రతలు కాపాడాల్సిన వారు రెండు చేతులా ఆర్జించేందుకు అర్రులు చాస్తున్నారు. బాధితులకు భరోసా ఇవ్వాల్సిన వారే అమాయకులను బాధ పెడుతున్నారు. బాధితులే బంధువులుగా, బాధ్యతలే బంధాలుగా మెలగాల్సిన పోలీసులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సామాన్యుల బెంబేలెత్తిస్తున్నారు.

(హైదరాబాద్,న్యూస్ నెట్‌వర్క్): ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులే.. భక్షకులుగా తయారవుతున్నారు. అధికారం ఉందికదా అని అవినీతితో చెలరేగిపోతూ అందినకాడికి దండుకుంటున్నారు. భూ వివాదంలో తల దూర్చిన నలుగురు పోలీసులపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. పోలీసు కేసు నమోదైన వారిలో అదపసే డిసిపి ఉండటం గమనార్హం. భూ వివాదంలో స్వామి భక్తిని చాటుకునే యత్నంలో సిఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు సైతం కేసులో ఇరుక్కుని తల పట్టుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ప్రాంతంలో రెండు ఎకరాల భూమిపై రెండేళ్లుగా క్రయవిక్రయాల్లో వివాదం కొనసాగుతోంది. పోలీసుల కథనం ప్రకారం మొదట ఈ భూమిని ముజీబ్ అనే వ్యక్తి కొనుగోలు చేసి రూ.10లక్షలు అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నాడు. సకాలంలో డబ్బు కట్టలేకపోయాడు. దీంతో ఆ భూమిని అబూబకర్, అబ్దుల్లా, రాచకొండ అదనపు డీసీపీ పులిందర్ రెడ్డి కుమార్తె ఐశ్వర్య రెడ్డిలు రూ.1.10 కోట్లుకు కొనుగోలు చేసి అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నారు. వీరు కూడా నిర్దేశించిన సమయంలో డబ్బులు కట్టలేకపోయారు. మరికొంత సమయం కావాలని వారు భూ యజమానులను కోరారు. ఇంతలో భూమి యమజమానులు..రూ.2 కోట్లుకు గంగాధర్ రెడ్డి, రవీంద్రరెడ్డిలకు ఆ స్థలాన్ని విక్రయించారు. దీంతో ముందస్తుగా అగ్రిమెంట్ రాయించుకున్న ఐశ్వర్యరెడ్డి రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూ యజమానులు, దానిని కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో బాధితులు గంగాధర్‌రెడ్డి, రవీంద్రరెడ్డిలు సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్యాను కలిసి తమపై అక్రమంగా కేసులు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. అదనపు డిసిపి పులిందర్‌రెడ్డి తన సిబ్బందితో బెదిరింపులకు గురిచేసి తమ వద్ద బలవంతంగా చెక్కులపై సంతకాలు చేయించుకున్నారని వివరించారు. దీంతో తీవ్రంగా స్పందించిన సిపి సందీప్ శాండిల్యా వెంటనే మాదాపూర్ ఏసీపీ రమణకుమార్‌ను పిలిపించారు. ఈక్రమంలో భూ వివాదంపై విచారణ చేపట్టి అందుకు భాద్యులన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో ఎసిపి రమణకుమార్ రాచొకొండ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్‌లతోపాటు ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కేసులు నమోదు చేయాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశించారు. దీంతో ఈ భూవివాదం ఘటనలో ముగ్గురు పోలీసు అధికారులతోపాటు ఎనిమిది మందిపై రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వారిపై ఐపిసి 448, 365, 342, 384, 147, 506/ 149 సెక్షన్స్ కింద కేసు నమోదుచేశారు. కేవలం తమ ఉన్నతాధికారి అదేశాలు పాటించినందుకు తమపై కేసులు నమోదయ్యాయని ఈ కేసులో ఇరుక్కున సిఐ, ఎస్ఐ తదితరులు వాపోతున్నారు. ఉన్నత హోదాలో ఉంటూ ఇలాంటి భూ వివాదాల్లో కేసుల పాలైన సంఘటన ఇటు పోలీసు వర్గాలు, ప్రజల్లో చర్చనీయాశంగా మారింది.

పోలీసు జులుం ప్రదర్శించి భూ వివాదంలో కీలక పాత్ర వహించిన ఖాకీలకు తగిన శాస్తి జరిగిం దంటూ పోలీసుశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవైపు పోలీసు శాఖ ఖ్యాతిని పెంచేందుకు ఉన్నతాధికారులు శ్రమిస్తున్న సమయంలో అదే శాఖలో ఉన్న కలుపు మొక్కలను ఏరేసేందుకు ఉన్నతాధికారులు తీరుపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

నూతన పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తున్న వామపక్షాలు

- ప్రభుత్వ హామీలపైనే రెండు రాష్ట్రాల్లో పోరాటం?
- రైతు, విద్యార్థి, నిరుద్యోగం, అంశాలపై దశల వారిగా ఉద్యమాలు?
- భవిష్యత్తులో సీపీఎం, సీపీఐల విలీనం ఉంటుందన్న ఆయా పార్టీల నేతలు
- 2019లో కలిసే పోటీ చేస్తామంటున్న ఆయా పార్టీల నేతలు

హైదరాబాద్, మేజర్ న్యూస్: నూతన ఉద్యమాలకు శ్రీకారం చుట్టే దిశగా వామ పక్ష పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఒక వైపు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూనే, మరోవైపు కార్మిక, రైతు, విద్యార్థి, నిరుద్యోగం తదితర అంశాలపై దశల వారిగా ఉద్యమాలను చేపట్టేందుకు లెఫ్ట్ పార్టీలు కసరత్తు మొదలెట్టాయి. అటు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ఇటు తెలంగాణ సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపైనే పోరాటం చేయాలనే కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నాయి. ఏపీలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోన్న వామపక్షాలకు అక్కడి ప్రజల మద్దతు లభిస్తుండగా... తెలంగాణలో మాత్రం అంతంత మాత్రంగానే ప్రజలు స్పందిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో జీహెచ్‌ఎంసీ కార్మికుల ఉద్యమంలో... వామపక్షాలకు, కార్మికుల మధ్యన ఉన్న బలమైన బంధాన్ని తెంపేలా సీఎం కేసీఆర్ వేసిన ఎత్తుగడతో లెఫ్ట్ కూటమికి తెలంగాణలో తొలి ఎదురు దెబ్బ తగిలింది. ఇక నాటి నుంచి లెఫ్ట్ పార్టీలు కొంత ఆందోళన చెందిన మాట వాస్తవమనే చెప్పాలి. కార్మికుల బలమే కమ్యూనిస్టులకు కొండంత అండ. అలాంటిది కార్మికుల బంధాన్ని ఎడబాపేందుకు సీఎం కేసీఆర్ వేసిన ఎత్తుగడ ఫలించిందనే చెప్పాలి. సీఎం ఆదేశానుసారం ఉద్యమంలో పాల్గొన్న కార్మికులపై వేటు... ప్రభుత్వానికి మద్దతు తెలిపిన జీహెచ్‌ఎంసీ కార్మికులకు వేతనాల పెంపు వంటి ప్రభుత్వ నిర్ణయాలతో లెఫ్ట్ నేతలు ఖంగు తిన్నారు. దీంతో వామపక్షాలు అంతర్మథనంలో పడ్డాయి. గత కొంత కాలంగా సీపీయం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి ప్రతిపక్షాల మద్దతుతో తెలంగాణ రాష్ట్రంలో పాదయాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా నేతల పాదయాత్రకు కాంగ్రెస్, టీడీపీ నేతలు మద్దతు ప్రకటించినా ప్రజల్లో పెద్దగా స్పందన రాలేదు. దీంతో లెఫ్ట్ పార్టీల నేతల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సీపీఎం, సీపీఐ విలీనం చేసే దిశగా ఆయా పార్టీల నేతలు ప్రకటనలు వెలిబుచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి లెఫ్ట్ పార్టీల విలీనం జరిగే అవకాశం ఉందని సురవరం సుధాకర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన తెలుగుదేశం పార్టీకి, తెలంగాణలో స్థానం లేకుండా చేసి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిద్దర లేకుండా చేసిన ఘనుడు కేసీఆర్. ఇక మరో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలోని ముఖ్యనేతలకు గులాబీ కండువాలను కప్పి, ఆ పార్టీలో కలకలం సృష్టించారు. ఒకవైపు ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో వివిధ పార్టీల నేతలకు గులాబీ రంగు రుద్దుతూనే, మరోవైపు వామపక్ష పార్టీలను నిలువరిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వామ పక్ష పార్టీలు దూకుడు తగ్గింది. దళితులకు 3 ఎకరాల సాగుభూమి పంపిణి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్య, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం పథకం తదితర పథకాలేవీ పూర్తి స్థాయిలో అమలుకావడం లేదు. ఈ అంశాలపై పోరాటం చేయాల్సిన వామపక్షాలు నేడు మౌనంగా ఉంటూనే సమయం కోసం వేచి చూస్తున్నాయి. ఒక రకంగా కేసీఆర్ పాలన వామ పక్ష పార్టీలకు మింగుడుపడటం లేదు. కార్మిక, కర్శకుల సమస్యల పై నిత్యం ప్రభుత్వంతో ఉద్యమించే ఆయా పార్టీలు తమ తమ బలాలను పెంపొందిచుకోవడానికి ఆత్మరక్షణలో పడ్డాయి. సాధారణ ఎన్నికలల్లో ఏదో ఒక ప్రధాన రాజకీయ పార్టీతో జత కట్టి 4, 5 సీట్లతో సర్దుకునే వామ పక్షాలు , వరంగల్ లోకసభ ఉప ఎన్నికలో లోక్‌సత్తాతో కలిసి వామ పక్షాల కూటమి అభ్యర్థిగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌ను బరిలోకి దించి, తమ బలాన్ని నిరూపించు కోవాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. అధికారంలో ఉన్న పార్టీలను తూర్పారబట్టే వామ పక్ష పార్టీలు, తిరిగి సాధారణ ఎన్నికల్లో అయా పార్టీలతో జతక డతారనే అపవాదు ప్రజల్లో బలంగా ఉంది. 2019లోవచ్చే ఎన్నికల నాటికి రెండు రాష్ట్రాలల్లో తమ బలాన్ని పెంపొందించుకోవడానికి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు లెఫ్ట్ కూటమి కార్యాచరణ రూపొందిస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టండి

పార్టీ అధికారప్రతినిధులకు కుంతియా సూచన

హైదరాబాద్, మేజర్‌న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల్ని పార్టీ అధికార ప్రతినిధులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి కుంతియా సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై లోతైన అధ్యయనం చేయాలన్న ఆయన, విమర్శలు సూటిగా, గట్టిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా కమిటీ చైర్మన్, టీ-పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి అధ్యక్షతన జరిగిన అధికార ప్రతినిధులతో సమావేశానికి కుంతియా, టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సి.ఎల్.పి నేత జానారెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్క, ఏఐసిసి అధికార ప్రతినిధి మధుయాష్కి, ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుంతియా మాట్లాడుతూ అధికార ప్రతినిధుల పాత్ర చాల కీలకమయిందని, టిఆర్ ఎస్ అవలంభిస్తున్న విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. టివీ చర్చల్లో పాల్గొన్న సమయంలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై లోతైన విశ్లేషణ ద్వారా ప్రజల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఏఐసిసి పత్రికా సమావేశాలను అనుసరించాలని, ప్రతి క్షణం సమాచారం తెలుసుకోవాలని ఆయన వివరించారు. అధికార ప్రతినిధులు ఎంత ఎక్కవ కష్టపడితే పార్టీకి అంత లాభం జరుగుందని చెప్పారు.

ప్రభుత్వంపై కుంతియా విమర్శలు అర్థం లేనివి

ఎంపీ బూర నర్సయ్య



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ కుంతియా చేసిన విమర్శలు అర్థంపర్థం లేనివని భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కుంతియా తెలుసుకుని మాట్లాడితే హుందాగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం వల్ల తెలంగాణ సమాజానికి చులకన అవుతారన్నారు. యావత్ తెలంగాణ సమాజాన్ని ఒక కుటుంబంగా భావించి ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయాన్ని కుంతియా గమనించాలన్నారు. రాష్టంలో 40 లక్షల కుటుంబాలకు చెందిన వారికి రూ.1000, రూ.1500 చొప్పున పెన్షన్లు ఇస్తున్న విషయాన్ని ఆయన ఈసందర్భంగా గుర్తు చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచినీళ్లు ఇస్తున్నామన్న నర్సయ్య, మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేసుకున్న విషయాల్ని కేంద్ర ప్రభుత్వం మెచ్చుకుని ఆదర్శంగా తీసుకున్న విషయం తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

అక్షరం

4

సోమవారం 14 ఆగస్టు 2017

ఆంధ్ర వాల్మీకి వాసుదాసు సుందరకాండ ఎందుకు చదవాలి?

లంకలో రాక్షస స్త్రీలను చూసిన హనుమ

– వనం జ్వాలా నరసింహారావు, ఫోన్ :8008137012



ఒకరితో ఒకరు పరాచికాలాడుతూ, ఎదుటివారిపై పూలో, రాళ్లో వేస్తూ, మద్యపాన ప్రభావంతో దేహాన్ని మరిచి మాట్లాడుతూ, ఇతరులను బెదిరిస్తున్న రాక్షసులను హనుమంతుడు చూసాడు. రొమ్ములు తెర్చి వెల్లికిల నిద్రపోయేవారిని, స్త్రీల శరీరంపైన కాలు, చేయి వేసి ప్రక్కకు తిరిగి పడుకున్నవారిని, భర్తలకు గంధం, మనోహరమైన ఇతర లేపాలను పూస్తున్న వారిని, మొగుడిమీద కోపంతో వారు పలుకరించలేదని నిట్టూర్పులు విడుస్తూ, నొచ్చుకుంటున్నవారిని, భర్తలను రతికై ప్రార్ధిస్తున్న స్త్రీలను హనుమంతుడు చూసాడు. ఘీంకరిస్తున్న ఏనుగులను, పెద్దలకు నమస్కరిస్తున్న పెద్దలను, వీరభటులను లంకలో చూసాడు హనుమ. గొప్పబుద్ధి కలవారిని, శాస్త్ర విశ్వాసం కలవారిని, మంచిపేర్లున్నవారిని, విశ్వప్రధానులను, అనేక ఆకారాలున్నవారిని, స్వగుణానురూపులను, అసమానరూపులను, అనేక గుణాలతో వెలుగుతున్నవారిని, వికార రూపాలున్న రాక్షసులను చూసాడు హనుమంతుడు. నిర్మల మనస్సున్న వారిని, పాతివ్రత్య మహిమ కలవారిని, భర్తలందు పరిశుద్ధమైన ప్రేమున్నవారిని, నక్షత్రాలవలె ప్రకాశిస్తున్నవారిని, ఇలాంటి రకరకాల స్త్రీలను అక్కడి భవంతులలో చూసాడు ఆంజనేయుడు.

ముగ్ధనాయికలను(సంపూర్ణమైన సిగ్గుతో వున్నవారు), మధ్యానాయి కలను (ప్రేమరసం ప్రధానంగా వున్నవారు), ప్రౌఢనాయికలను (ప్రియమైన భర్తలచే కౌగలింపబడినవారు), బాలనాయికలను (భర్తలను మోహింపచేసే విధం తెలిసినవారు), చక్కటి పూలు తురుముకున్న ఆడపక్షుల్లాంటి అందమైన స్త్రీలను, సంతోషంగా కనిపిస్తున్న స్త్రీలను, భర్తల అనుగ్రహానికి నోచుకున్న స్త్రీలను, వయస్సున్న స్త్రీలను, మారుతి చూసాడు. బంగరు మేడలలో కూర్చున్న స్త్రీలను, భర్తల వొడిలో వున్నవారిని, మగడి ఇష్టంతో అడిగిన పనులు చేస్తున్న స్త్రీలను, ధర్మ శాస్త్రాలు తెలిసి ధర్మకార్యాలు చేస్తున్న స్త్రీలను, కామావేశం వున్న స్త్రీలను, వికారమైన, విడ్డూరమైన, ఇంపైన చేష్టలు చేస్తున్న స్త్రీలను, పెళ్లై సంతోషంతో వున్న స్త్రీలను చూసాడు హనుమంతుడు.

అందంగా, బంగారం లాంటి చాయ కలవారిని, భర్త ఎడబాటుతో విరహ తాపం పొందుతూ పాలిపోయినవారిని, రతిక్రీడలలో ఆరితేరిన వారిని, పమిటలు జారి, రవికలు లేనివారిని, రతిశ్రమతో కరిగిన సువర్ణలను (కస్తూరి – కుంకుమపువ్వు లేపంతో చెంపలపైన, స్తనాలపైన చిత్రాలు వేయించు కున్న స్త్రీలు), గంధంపొడి వాసనగలవారిని, నిడుపాటి కళ్లు చెవులవరకూ వ్యాపించిన స్త్రీలను చూసాడు మారుతి. భర్తలవద్దకు తమంతట తామే పోయి, కౌగిలిలో చేరి ఆనందిస్తున్న వారిని, నడివయస్సులోని స్త్రీలను, వారి, వారి ఇళ్లల్లోనే తిరుగుతున్నవారిని (వేశ్యలు), తీగల్లాంటి మృదువైన దేహసంపద కలవారిని, విశేష ప్రేమకు స్థానమైన వారిని, రాక్షసుల పడకటిన్టి లోనూ, క్రీడా మందిరాల లోనూ హనుమంతుడు చూసాడు. లేతవయస్సులో వున్నవారిని, చంద్రబింబం లాంటి ముఖం కలవారిని, వంకరకనురెప్పల వెంట్రుకలున్న వారిని, ఆభరణాలు



ధరించిన వారిని, మెరుపు తీగల్లాంటి ఆడవారిని చూసాడాంజనేయుడు.

(సీతను వెతుకుతున్న హనుమంతుడు స్త్రీల ముఖ–నేత్రాలను చూడటానికి కారణముంది. వీరు దేవతాస్త్రీలా?మనుష్యులా?రాక్షస్యస స్త్రీలా? అని పరీక్ష చేయడం ఓ కారణం. ఆభరణ పరీక్ష, సీతాభరణ స్వరూపం నిర్ధారణ చేసుకోవటం కొరకే. సీతాదేవిని చూసినప్పుడు ఆమె సీతేనని నిర్ణయించడానికి ఆమె ఆభరణాలు ఓ ముఖ్య నిదర్శనమని మున్ముందు తెలుస్తుంది).

తను చూస్తున్న స్త్రీలలో, రాజవంశంలో పుట్టినదాని లాంటి దానిని, వారి లోనూ మిక్కిలి మనోహరంగా వున్నదానిని, అలాంటి వారిలోనూ భర్త సమీపంలో లేనప్పుడు పతివ్రతలు ఎలావుండాలో అలా వున్నలాంటి దానిని, తీగలాంటి దేహమున్నదానిని, స్వసంకల్పంతో అయోనిజగా పుట్టిన దానిని మాత్రం చూడలేకపోయాడు హనుమంతుడు. పతివ్రతల మార్గంలో, ధర్మ మార్గంలో స్థిరంగా వుంటున్న దానిని, భర్త ముఖం కనిపిస్తేనే ఆనందించే దానిని, భర్తను కలుసుకోవాలన్న పట్టుదల వున్నదానిని, అతిలోక సుందరిని, భర్త హృదయంలో చొరబడే దానిని, విరహతాపంతో, కన్నీటితో తడిసిన కంఠం కలదానిని, అందమైన కనురెప్పలున్నదానిని, చక్కటి కంఠధ్వని కలదానిని, శ్రేష్ఠమైన బంగారు పతకం మెడలో వున్నదానిని, వనసంచారం చేస్తున్న నెమలి లాంటి దానిని, పాడ్యమినాటి చంద్రుడి లాంటిదానిని, దుమ్ముతో కూడిన కొత్త బంగారపు కడ్డీలాంటి దానిని, పుండులో బాణం గుచ్చుకుంటే బాధపడే లాంటి దానిని, గాలికి చిందరవందరైన సన్నని మేఘంలాంటి దానిని (సీతాదేవని అర్థం) హనుమంతుడు చూడలేకపోయాడు. శ్రీరామచంద్రమూర్తి భార్య సీతాదేవిని తాను వెతికిన అన్ని రహస్య ప్రదేశాల్లో ఎక్కడా చూడలేక పోయి నందుకు హనుమంతుడు బాధపడ్డాడు ఆ సమయంలో.

రాక్షసుల ఇళ్లల్లో ఎంత వెతికినా, సీతాదేవిని చూడలేకపోయినందుకు చింతిస్తూ హనుమంతుడు తాను కోరిన రూపాన్ని ధరించి, మరింత [illegible]ంగా, శ్రద్ధగా తిరిగి వెతకనారంభించాడు. సింహాల కాపలాలో నిరపాయంగా వుండే వనంలాగా, క్రూరాతి క్రూర రాక్షసుల కాపలాలో సూర్యకాంతితో సమానమైన ప్రాకారంతో చుట్టబడి వున్న రావణ గృహాన్ని చూసాడు హనుమంతుడు. (ఇంతకు ముందే రావణాసురుడి ఇంట్లోకి హనుమంతుడు ప్రవేశించాడని చెప్పడం జరిగింది. మళ్లీ ఎందుకీ ప్రస్తావన అనుకోవచ్చు.

రావణ అంతఃపురంలో సీత వుందని అనుకొని అక్కడ వెతుకుదామను కున్నాడు. అయితే అప్పుడు జామురాత్రే అయినందున, అందరూ నిద్రపోనందున, వారు మేల్కొన్నప్పుడు వెతకడం కుదరదనుకుని బయటకు వస్తాడు. లంకాపురంలో కాసేపు గాలిస్తాడు. అందువల్లనే లంకాపుర స్త్రీల వర్ణన జరిగిందప్పుడు. ఇప్పుడు ఇంకాస్త పొద్దు పోయినందున తిరిగి రావణుడి ఇంట్లోకి వచ్చి వెతకడం మొదలెట్టాడు)

దేదీప్యమానంగా వెలుగుతున్న ఆ ఇంటిని చూసి ఆశ్చర్యంతో ముక్కుపై వేలుంచుకుని దాన్నే చూడసాగాడు హనుమంతుడు. అందమైన ఆ ఇంటి ద్వారాలకు వెండి, బంగారు, రత్నాలతో అలంకరించబడిన తోరణ సమూహాలున్నాయి. ఏనుగులెక్కిన మావటీలు, కష్ఠం తెలియని శూరులు, అతివేగంగా పోగలిగే గుర్రాలు, పులుల, సింహాల చర్మాలతో కప్పబడి దంతం, బంగారంతో ప్రకాశించే రథాల గుంపులు, వెలలేని రత్నాలతో నిండిన పెద్ద పీటలు, అతిరథులకు స్థావరమైన అసమాన రథాలు, హనుమంతుడి దృష్టిలో పడ్డాయక్కడ.

రకరకాల మృగాలతో, పక్షుల గుంపులతో నిండివున్న ఆ భవన పర్యవేక్షణ, భయమనేది ఎరుగని కాపలావారి చేతుల్లో వున్నది. మనస్సుకు ఆహ్లాదాన్నిచ్చే చక్కటి స్త్రీలున్నారక్కడ. బలసిన చకోర పక్షులతో సమానంగా వుండే కళ్లున్న స్త్రీల బంగారు ఆభరణాల రాపిడి ధ్వనులు సముద్ర ఘోషతో పోటీపడ్తున్నాయక్కడ. చందనం, అగరు ధూపాల వాసనలతో నిండి వుండి, మద్దెల ధ్వనులు మ్రోగుతుంటే, రాక్షసులతో ఎల్లప్పుడు పూజించబడుతూ, సముద్రాన్ని మరిపిస్తూన్న చందాన గంభీరంగా వున్నదా రావణ గృహం. ఆ ప్రాంతంలో వీధి–వీధీ, వాడ–వాడా, తోట–తోటా, దొడ్డి–దొడ్డీ, మేడ–మేడా, మూల–మూలా, గొంది–గొందీ, ఇదీ–అదీ అనేది లేకుండా వెతకసాగాడు సీతకోసం హనుమంతుడు.

ఇలా తిరుగుతూ: ప్రహస్తుడి, మహాపార్శ్వుడి, మేఘంతో సమానమైన కుంభకర్ణుడు, విభీషణుడు, మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలి, వజ్రదంష్ట్రుడు, శుకసారణులు, ఇంద్రజిత్, జంబుమాలి, సుమాలి, రస్మి, కేతువు, సూర్యశత్రువు, వజ్రకాయుడు మొదలైన వారి ఇళ్లకు వెళ్లి అక్కడ సీతాదేవికొరకు వెతుకుతాడు హనుమంతుడు. బలవంతులైన: ధూమాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, వికటుడు, వక్రుడు, శఠుడు, శుకనాశుడు, బ్రహ్మకరుడు, దంష్ట్రధ్వజుడు, గ్రీవుడు, యుద్ధోన్మత్త మత్తులు, రోమశుడు, విద్యుజ్జిహ్వుడు, ,హస్తిముఖేం ద్రుడు, జిహ్వుడు, శోణితాక్షుడు, పిశాచుడు, కరాళుడు మొదలైన వారు వుండే ఇళ్లంటిలో వరుస తప్పక సీతకొరకై వెతుకుతాడు హనుమంతుడు. అయినా ఫలితం కానరాలేదు.

ఉన్మాదక ద్రవ్యం



భౌతిక జగత్తునుండి
ఒక మాయా లోకం లోకి ...
అగాధం లోకి ...
అంధకారం లోకి ...
ఊగే.. తూగే.. రంగుల పల్లకి లోకి
శరీరాన్ని శిథిలం చేసుకుంటూ,
ఛిద్రం చేసుకుంటూపయనిస్తూ వారు!

సకల భోగాలున్నాయి
ఊహు ... చాలట్లేదు !
సమస్త సౌఖ్య సుఖాలున్నాయి
ఊహు ...దాహం తీరట్లేదు !
ఇహంలో లేనిదేదో కావాలి

కాళ్ళు నేలపై కాదు
మేఘాల్లో ఉండాలి ,
గాలిలో ధూళిలా, దూదిలా ఎగరాలి
ఖేచరమై సాగాలని ,
సమ్మోహన స్వర్గానికి
రాజులమై పోవాలని రాక్షసారాటం!

నగ్న దేహపు నరాలలోకి
అగ్ని డ్రగ్స్‌ని నింపి
దగ్ధ కాయ ధూపాన్ని చూసి
స్వర్గమనుకునే ఉన్మాద స్థితి !

పంచేంద్రియాలు పనిచేయవు
పంచభూతాలు పంచనుండవు
పంచభక్ష్య పరమాన్నమిక
మాదకద్రవ్యమే ..!!

అది కోటి స్వర్గాల
మాయా ద్వీపం !

డ్రగ్స్ అంటే మేలుకువలోనే
రంగుల స్వప్నాలు చూపించే జాదూ!
నేలకి నింగికి మధ్య వేలాడే
నీ దేహ పతంగ దారమే

మాదక ద్రవ్యం

నరనరాల్లో రుధిరం
నర్మదా వరదవుతుంది
కండరాలన్నీ
కాగితపు పడవలవుతాయి

మది పరాధీన మవుతుంది!
కళ్ళు కొంగ్రొత్త ప్రపంచం వైపు
కాళ్ళను లాక్కెళతాయి

దేహమేకాదు ఇంద్రియాలన్నీ
డ్రగ్స్ వలయంలో బంధీలవుతాయి
భ్రమ నుండి మతి భ్రమించే దాకా
డ్రగ్స్ రాకాసి ఈడ్చుకెళ్తూనే
ఉంటుంది!

అనివార్యంగా నీ దేహమిక
అన్యాక్రాంత మవుతుంది
మాదకద్రవ్యాల కోసం
మానవ మృగాలు యుద్ధం
ప్రకటిస్తాయి

నిన్ను నీవు,
నీ కుటుంబాన్ని, సమాజాన్ని
ఆఖరికి దేశాన్ని ధ్వంసం చేసే
మారణ హోమానికి సమిధల్ని
సమకూర్చుతూనే ఉంటావు !

ఈ డ్రగ్స్ దావాగ్ని
దేశాన్ని కాల్చక ముందే
విద్రోహుల్ని చెరసాలకి పంపాలి

తారలైన, నేతలైనా
తెగ బలిసిన సంపన్నులైనా
కాలకూట విషాన్ని పంచే, పెంచే
కసాయిల్ని శిక్షించాలి!
దేశాన్ని రక్షించాలి!!

–డా. సింహాచలం లక్ష్మణ్‌స్వామి



ఇది పేరుకే స్త్రీలను గౌరవించే 'దేశం'
నలుదిక్కుల పురుషుల ఆదిపత్య పైత్యం
పితృవాఖ్య పరిపాలనలో హింసోన్మాధం
కామానికి తప్పితే ' స్త్రీ ' నీ మాతృమూర్తిలా
చూడలేని 'మగపురుష'పురుగులు

స్త్రీలపై జరిగే దౌర్జన్యాల హింసకు
మగవాడి కన్నీటి కామసూత్ర 'క్రేం ' బోట్లు
స్కూలల్లో, కాలేజీ ల్లో,
యూనివర్సిటీల్లో, ఉద్యోగ ఆఫీసుల్లో,
రోడ్లపై , ఇండ్ల సందుల్లో , గొందుల్లో

ఎక్కడబడితే అక్కడ
మానవ 'మగ' మృగం '
మొరుగుతు కరుస్తుంది
బరితెగించి పొంద్రిళ్లుతుంది
వరసా వాయి లేకుండా

చిన్న పిల్లల దగ్గర నుండి పండుముసలి వరకు
స్త్రీలపై రోజు ...
మానభంగాలు , హత్యలు, నిత్యకృత్య,
వికృత పురుష ఆహంకారం తాండవిస్తుంది
పేరు గొప్ప ...ఊరు దిబ్బ అన్నట్లు

' స్త్రీల కోసం ఎన్ని చట్టాలు చేసిన
ఆవి....పురుషుల చుట్టాలే అయినట్టు
నిత్యం ' స్త్రీ ' లపై దాడులు
కళకళలాడుతూనే వున్నాయి....
' దేశం'లో పట్టపగలే ఇండ్లల్లో నుండి

' స్త్రీ ' బయటకు రావాలంటే
చస్తూ...బతకటమే...

(దేశంలో ప్రతినిత్యం
ఎక్కడో అక్కడ'స్త్రీ' లపై జరిగే
సంఘటనలకు)

– తంగిరాల సోని

బి.శశి 'డావించీ కోడ్'

మరో వంద తప్పక చదవాల్సిన కథానికలు -56

–డా॥ వేదగిరి రాంబాబు, 9391343916



కోరుకొండ సైనిక స్కూల్‌లో చిత్రకళా చార్యుడుగా పనిచేసిన బడుగు ధర్మా రావు గారు తనకి విద్యాబుద్ధులు నేర్పిన అమ్మమ్మ 'శశి' పేరుతో మంచి కథానికలు రాసారు. "సోమర్‌సెట్‌మామ్ 'కథ లెలా రాయాలి' చెప్పిన విషయస్ఫూర్తితో అలనాటి విశ్వవిద్యాలయ విద్యార్థులకు అందించాలనే విషయాన్ని పెద్దది చేసి ఈ కథానికను రాసాను" అన్నారు రచ యిత శశి 'డావించి కోడ్' గురించి చెబ్తూ. లియోనార్డో డావించ్ మంచి చిత్రకారుడు. ఆయన 'లాస్ట్ సప్పర్' చిత్రాన్ని ప్రారంభించి సంవత్సరకాలం గడిచినా పూర్తికాలేదు. 'జీసెస్ పన్నెండు మంది శిష్యుల్లో ఆరుగురి శిష్యుల స్కెచ్చెస్' పూర్తయ్యాయి.

యూదా స్కెచ్ ఎలా గీయాలో ఆయనకు అర్థం కాలేదు.

'లాస్ట్ సప్పర్' చిత్రానికి కొన్ని స్కెచ్చెస్ గీయడానికి శిష్యులతో జైలుకి వెళ్తాడు డావించీ. పెరిగిపోయిన గడ్డం, కనపడీ కనపడని వెకిలినవ్వు, ఎగుడుదిగుడు కను బొమలతో రాళ్ళు కొడుతున్న ఓ ఖైదీ డావించ్ దృష్టి నాకర్షిస్తాడు.

"మీ చిత్రం గీచుకోవచ్చా" అని అడిగితే "గీచుకోమంటా"డు ఆ ఖైదీ.

డావించి, ఆయన శిష్యులు ఆ ఖైదీ స్కెచ్ వేసారు.

అప్పుడంటాడు ఆ ఖైదీ లియోనార్డోతో డావించితో "నా చిత్రం ఒకసారి సెలిన్‌గారింట్లో కూర్చోబెట్టివేసారు సార్. అప్పుడు నన్ను గొప్పగా పొగిడి జీసస్ క్రీస్తుచిత్రానికి సరిపడిన ఆకారం అన్నారు. క్రీస్తుమోడల్‌గా తీసుకు న్నారు..." అంటూ గుర్తుచేసాడాఖైదీ. 'ఇప్పుడదే వ్యక్తిని అతి క్రూరుడైన ఇస్కర్, యోద్ యూదాస్కెచ్ కోసం వాడుకుం టున్నాడు' గుంభనంగా నవ్వుకున్నాడు డావించి – అంటూ రచయిత కథానికని ముగిస్తారు. చిత్రకళమీదా తెలుగులో మంచి కథానికలు వచ్చాయి. వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి బి.శశి కథానికలు.ఇంత చిన్నగా చెప్పిన ఈ కథానికలో ఎన్నిభావాలు! 2014లో మనల్ని విడిచి వెళ్ళిపోయిన బి. శశి కథానికలు పదిహేడింటిని ఓ సంపుటి గా తెచ్చారు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు – వైనతేయకథలు పేరుతో 2015లో. ఈ కథానిక ఆ సంపుటిలో చివరిది.

తక్కువనుకోకు!

మౌనం మాట్లాడటం మొదలెడితే
మాటకే బలమొస్తుంది!
తడబడిన అడుగులు నడక మొదలెడితే
పరుగుకే అలుపొస్తుంది!
తల దించిన కళ్ళు చూడటం మొదలెడితే
సూర్యబింబమే చిన్నబోతుంది!
వినయంగా వణికిన చేతులు పిడికిలెత్తితే
సమాజ గతినే మార్చేస్తుంది!
అణచబడ్డ మనసు ఎదురు తిరిగితే
పోరాటానికే ఊపిరందుతుంది!
చేతగాని తనమని వదిలేస్తే
చేతిరాతలే మార్చేస్తుంది!
ఒక్కోసారి గడ్డిపోచలే
కత్తిలా దూసుకుపోతాయి!
ఒక్కోసారి మిణుగురులే
మెరుపులై వెలుగుతాయి!
ఒక్కోసారి చెమట చుక్కలే
కెరటాలై ఎగిసిపడతాయి!
ఒక్కోసారి నరంలేని నాలుకే
నరాలు తెగదెంచుతుంది!

– వుట్టి గిరిధర్

జీవన వాహిని



జీవితమంటే ...
పొద్దు తిరుగుడు పువ్వున అద్దిన పచ్చదనం
ప్రకృతి జాలువార్చే శిశిర, వసంత ఋతువుల కేళి
మోహపు స్పర్శల ఉక్కిరిబిక్కిరయ్యే వెచ్చని ఊపిరి
గులాబి తోటల విచ్చుకుని విహారమాడే పరిమళం

జీవితమంటే ఒక్కొక్కప్పుడు ...
శరత్చంద్రుడి వెన్నెలలో మత్తెక్కించే మరుమల్లె
చెలికాడి ఒడిలో సేదతీరే ఆహ్లాదం

అది ఇంకోసారి...
పసికూనల జోలపాట
లేలేత స్పర్శలను పొదివి పట్టుకునే అమ్మ పొత్తిలి
మరోసారి...
వ్యధ నిండిన గుండె చప్పుడు
మసక బారిన మనిషితనాన్ని తుడిచి స్పృశించే

జీవన వాహిని

జీవితమంటే ...
జ్ఞాపకాల గాళ్ళ సందుల్లోంచి నడిచే అనుభూతుల నడక
ఎర్రగా విచ్చిన మందారపు గాయాల మధ్య నలిగే క్షణం
చాలా క్షణాలు బ్రతుకు నుంచి మృత్యువులోకి
మృత్యువు నుంచి బ్రతుకులోకి సాగే అంతర్వాహిని
నాలుగు గోడల మధ్య ఒదిగే శైశవం

జీవితమంటే...
నిర్వేద నైరాశ్యాల మధ్యనో గెలుపు
హర్షాతి రేఖల మధ్యలో ఆడే ఊగిసలాట
పొత్తిళ్ళ నుండి మృత్యు కుహరం దాకా
బ్రతుకునీడ్చే మెలో డ్రామా...

–వైష్ణవి శ్రీ

మాటల కరవు



మన మధ్య మాటల కరువొచ్చాక
పలకరింపులెక్కడివని..?
బాగున్నావా అని అడగలేంతగా దూరాన్ని
పెనవేసుకున్నాక
మాటల ప్రయాణం సాగేదెప్పుడని..?

ఈ పూట.. తోటలో మాటై పుష్పిద్దామని
నేననుకున్న ప్రతిసారి
ఎండమావై నువ్ ఎదురొస్తే
లేతచిగురు మాట తల వాలేస్తుంది..
ఇక మాట ఉపిరిని లోలోనే నాలోనే
ఉరి వేస్తానిక..

నాలోని అంతర్యుద్ధాన్ని జయించాక
నీకయి పుట్టిన మాటొకటి ఎదురుచూస్తూనేవుంది
ఇప్పటికి..
తొలి పలకరింపును వినిపించుకునే
స్థితిలో నీవు లేనపుడు పుట్టటమే దండగని మాట తనని
తాను చంపుకుంది..

కోపమో, అలకో, నేనంటే ద్వేషమో నాకు తెలియదు
నాపై నువ్ అరచిన ప్రతిసారి
కనుల వెనకే కన్నీరు..


గుండె భారమై నెలలు నిండని మాట కూలిపోయింది..

తప్పు నాపైవేసి మౌన రాజ్యాన్ని ఏలుతూ
ఒంటరి చెరసాలలో నీకు నీవే బంధీ అయ్యావుగా..
ఇప్పుడిదేంటో కొత్తగా
మాటల ఊట ఎండిపోయిందా అంటూ..
ఆ తోటలో మాటల బావి ఉంది చెరికొన్ని
మాటలను చేదుకుందాం అంటూ సరికొత్తగా..

–పాలకుర్తి నాగజ్యోతి

సి. వెంకటకృష్ణ 'జీవనతరంగాలు'


"మరొకరి జీవిత గాధని 'నేను' అంటూ చెప్పడంలో కొంత క్లిష్టత ఉంది.. సి.వి.ఆర్ గారి జీవిత చరిత్రన నేను అంటూ చెప్పాను" అంటూ ముందే మనకి వివరణ ఇస్తా రు రచయిత. సి.వి.ఆర్ గారి జీవితచరిత్ర 'జీవన తరం గాలు' మూడు ప్రకరణలలో చెప్పారు. మొదటిది కుటుం బ ప్రకరణం, దీంట్లో కుటుంబ బాధ్యతలు, పెళ్ళి గురించి చెప్పారు. రెండవ ప్రకరణంలో వ్యాపారం ఆటుపోట్లు, వ్యవసాయం, దేవాలయాల గురించి చెప్పా రు. మూడవది తత్వప్రకరణము. ముఖ్యమైన ప్రకరణం. జీవన విధానం, తప్పు–ఒప్పు, హృదయోల్లాస వ్యాపకాలు, సహకారం, బహుజన వాదం ఉన్నాయి. అందరూ చదివి, తమ జీవి తాన్ని ఎలా మలచుకోవాలో చెప్పే 'జీవన తరంగాలు' మంచి రచన. సి.వెంకటకృష్ణ రచయిత అయితే డా. కె. బాబూరావు సహ రచయిత. (సి.వి.ఆర్. జీవన తరంగాలు–సి.వెంక టకృష్ణ , వెల–రూ.150/, ప్రతులకు – కోట్‌లక్ బుక్స్, 73, మిథిలానగర్ కాలనీ, రోడ్‌నెం–12, బంజారాహిల్స్, హైద్రాబాద్–500 034. – వీఆర్బీ



శంకరనారాయణ 'కలం రేఖలు'

ప్రముఖ చిత్రకారుడు 'బాపు' గారి తమ్ముడు శంకర నారాయణ. ఈయన కూడా మంచి చిత్రకారుడు. పెన్సిల్ తో ఎంతోమంది ప్రముఖుల పోర్ట్రయిట్స్ గీసారు. హాస్యప్రముఖులు, సంగీత విద్వాంసుల పోర్ట్రయిట్స్ ఇంతకు ముందు పుస్తకాలుగా వచ్చాయి.

ఇప్పుడు నాటి నన్నయ్య నుంచి నేటి ఆధు నిక రచయితల వరకూ దాదాపు రెండు వందల మంది సాహితీ ప్రము ఖుల పెన్సిల్ పోర్ట్రయిట్స్ 'కలం రేఖలు' పుస్తకంలో దర్శన మిస్తాయి. ఒకేచోట ఇంతమంది సాహితీ వేత్తల రేఖా చిత్రా లు కనిపించడం విశేషం. ఇవన్నీ మనకు ఎప్పుడో ఒకప్పుడు అవసరమయ్యేవే! ఈ పెన్సిల్ రేఖల కింద కలం గీతలూ కనిపిస్తాయి. బొమ్మల కింద పరిచయ వ్యాక్యాల్ని ముళ్ళపూడి వెంకటరమణగారి శ్రీమతి శ్రీదేవిగారు క్లుప్తంగా రాసిన వాళ్ళెవరో తెలియజెప్పే వాక్యాలు ఆ బొమ్మలకి ప్రత్యేక విలువనిస్తాయి. ఇది అందరూ తప్పక తమ లైబ్రరీల్లో ఉంచుకోవలసిన పుస్తకం. జీవితం ఉట్టిపడేట్లు పెన్సిల్ పోర్ట్రయిట్స్‌ని తీర్చి దిద్దిన శంకరనారాయణగారు అభినందనీయులు. ఇది ఒక వినూత్న ప్రయోగం. (కలం రేఖలు – ఎస్. శంకర నారాయణ. వెల–రూ.200/, ప్రతులకు నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్, సుల్తాన్ బజార్, కోఠి, హైద్రాబాద్.) – వీఆర్బీ





ఈ యాప్ అంటే నకిలీలకు హడల్

న్యూయార్క్ : నకిలీలను గుర్తు పట్టే పటిష్టమైన వ్యవస్థను భారత సంతతి పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆల్గోరిథమ్స్‌ను వినియోగించే కొత్త సిస్టమ్‌ను రూపొందించారు. దీనిని ఉపయోగించి ఎంట్రుపి అనే స్మార్ట్ ఫోన్ యాప్‌ను వారు రూపొందించారు. బట్టలు, తోలు వస్తువులు, పిల్స్, ఎలక్ట్రానిక్స్, ఆట బొమ్మలు, చెప్పుల్లో నకిలీలను తక్షణమే గుర్తు పట్టేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ వస్తువులకు సంబంధించిన 30 లక్షల బొమ్మలను ఈ వ్యవస్థలో ఉంచారు. వీటి ఆధారంగా వస్తువుల్లో అసలు, నకిలీలను ఈ యాప్ గుర్తిస్తుంది. న్యూయార్క్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ లక్ష్మీనారాయణన్ సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ, తాము రూపొందించిన సిస్టమ్ వస్తువుల లక్షణాలను 98 శాతం వరకు కచ్చితంగా నిర్ధారిస్తుందని తెలిపారు. ఈ సిస్టమ్‌ను ఈ నెల 14న కెనడాలోని నోవా స్కోటియాలో జరిగే నాలెడ్జ్ డిస్కవరీ అండ్ డేటా మైనింగ్‌పై వార్షిక సమావేశంలో ప్రదర్శిస్తామని ఆయన తెలియజేశారు. ఆశ్లేష్ శర్మ, విద్యుత్ శ్రీనివాసన్, సుబ్రహ్మణ్యం స్థాపించిన స్టార్టప్ కంపెనీ ఎంట్రుపీ ఇంక్ ఈ సిస్టమ్‌ను మార్కెటింగ్ చేస్తోంది. ఎంట్రుపీతో నకిలీలను కనిపెట్టడం చాలా సులువు. తనిఖీ చేయాలనుకుంటున్న వస్తువుపై ఎంట్రుపీ యాప్ ఉన్న సెల్‌ఫోన్ లేదా ట్యాబ్‌ను ఉంచాలి. ఆ వస్తువు బొమ్మలను తీసుకునేందుకు ఈ యాప్ ఇచ్చే సూచనలను పాటించాలి. అనంతరం దీనిలోని ఆర్టిఫిషియల్ ఆల్గోరిథమ్ ఈ బొమ్మలను విశ్లేషిస్తుంది. ఆ వస్తువు అసలైనదా, నకిలీదా అనే విషయాన్ని తెలియజేస్తుంది.



మొబైల్ వినియోగదారులకు శుభవార్త

గణనీయంగా తగ్గనున్న కాల్ చార్జీలు

న్యూఢిల్లీ : ఏడాది క్రితం మొబైల్ కాల్ చార్జీలు గణనీయంగా తగ్గిన తరువాత ఇప్పుడు మరోమారు కాల్ చార్జీలు మరింత చవక కానున్నాయి. మొబైల్ ఆపరేటర్లు చెల్లించే ఇంటర్ కనెక్ట్ కాల్ చార్జీలను తగ్గించాలని టెలికమ్ రెగ్యులేటరీ అథారిటీ (ట్రాయ్) నిర్ణయించింది. ప్రస్తుతం ఇంటర్ కనెక్ట్ యూసేజ్ చార్జీలు (ఐయుసి) నిమిషానికి 14 పైసలుగా ఉంది. దీనిని 10 పైసలు కంటే తక్కువగా చేయాలని ట్రాయ్ నిర్ణయించినట్లు సమాచారం. టెలికమ్ రంగంలోకి జియో ప్రవేశించిన తరువాత ఐయుసి చార్జీల విషయమై విపరీతమైన చర్చ జరిగింది. జియో ఉచిత కాల్స్ ఆఫర్‌తో ఇంటర్ కనెక్ట్ పేరిట ఇతర కంపెనీలు పెద్ద మొత్తంలో చార్జ్ చేశాయి. దీనితో ఐయుసి చార్జీలు తగ్గించాలని ట్రాయ్ డిమాండ్ చేసింది. ఎయిర్‌టెల్, ఐడియా, వొడాఫోన్, తదితర కంపెనీలు ఐయుసి పేరుతో వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. అంతే కాదు. ఈ చార్జీలను మరింత పెంచాలని కూడా అవి డిమాండ్ చేస్తున్నాయి. ఎయిర్‌టెల్ గత సంవత్సరం ఐయుసి ద్వారా ఏకంగా రూ. 10,279 కోట్లు ఆర్జించింది. అంతే కాదు. ప్రస్తుతం నిమిషానికి 15 పైసలుగా ఉన్న ఐయుసిని 30 పైసలకు పెంచాలని ఎయిర్‌టెల్ డిమాండ్ కూడా చేస్తోంది. ఈ నేపథ్యంలో ట్రాయ్ ప్రత్యర్థి కంపెనీలకు



షాకిస్తూ జియో ప్రతిపాదనకు వోటు వేసింది. ఐయుసి చార్జీలను మరింత తగ్గించడం ద్వారా వినియోగదారులపై పడే భారాన్ని తగ్గించాలని ట్రాయ్ యోచిస్తోంది. ఈ మేరకు ఇంటర్ కనెక్టివ్ కాల్స్‌పై చార్జీలను 15 పైసల నుంచి పది పైసల దిగువకు తగ్గించాలని సంస్థ నిర్ణయించింది. త్వరలోనే ఇది అమలులోకి రానున్నదని తెలుస్తోంది. అదే జరిగితే వాయిస్ కాల్స్ రేట్లు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

అన్ని ఆపరేటర్ల టారిఫ్‌లూ ఒకే చోట

ఇది ఇలా ఉండగా, మీరు ఎయిర్‌టెల్‌కు సంబంధించిన టారిఫ్ వివరాలను తెలుసుకోవాలంటే సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లడం తప్పనిసరి. ఒకవేళ మీరు మరొక నెట్‌వర్క్‌కు సంబంధించిన వివరాలు కావాలంటే ఆ వెబ్‌సైట్‌లోకీ వెళ్లవలసిన పరిస్థితి. అలా కాకుండా అన్ని నెట్‌వర్క్‌ల టారిఫ్ వివరాలు ఒకే చోట ఉంటే? సరిగ్గా ఇదే ఆలోచన చేస్తోంది టెలికమ్ నియంత్రణ సంస్థ ట్రాయ్. ఇకపై అన్ని టెలికమ్ నెట్‌వర్క్‌లకు సంబంధించిన టారిఫ్ వివరాలను తమ వెబ్‌సైట్‌లో లభ్యమయ్యే విధంగా ట్రాయ్ ఏర్పాట్లు చేస్తోంది. దీని వల్ల పారదర్శకత పెరుగుతుందని ట్రాయ్ చైర్మన్ ఆర్ఎస్ శర్మ తెలియజేశారు. ఇది ఎయిర్‌లైన్స్, బస్సుల ధరలను ఒక్క చోట తెలుసుకుంటున్నట్లుగా టెలికమ్ టారిఫ్‌ల వివరాలను కూడా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని ఆయన సూచించారు. ఈ మేరకు టెలికమ్ ఆపరేటర్లకు టారిఫ్ వివరాలను సమర్పించాలని సంస్థ సూచించింది. ప్రస్తుతం ఆయా టెలికమ్ కంపెనీలు వివిధ సర్కిళ్లలో వివిధ రకాల టారిఫ్ ఓచర్లను అమలు చేస్తున్నాయి. ఇవి సుమారు 24 వేలు వరకు ఉన్నట్లు సమాచారం. కాగా, కొందరు ఆపరేటర్లు ఎంపిక చేసిన వ్యక్తులకు ప్రత్యేకంగా ఆఫర్లను ప్రకటిస్తున్నారని జియో గతంలో ఆరోపించింది. టారిఫ్‌లను బహిరంగంగా ప్రకటించాలని జియో సూచించింది.

ఆండ్రాయిడ్ ఫోన్ వేగం పెంచే కొత్త యాప్



న్యూఢిల్లీ : ఆండ్రాయిడ్ డివైస్‌లను వాడుతున్న యూజర్ల కోసం 'ఫీనిక్స్ లింగ్ క్లీన్' పేరిట కొత్త యాప్ ఒకటి తాజాగా విడుదలైంది. ఈ యాప్‌ను యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆండ్రాయి డ్ 4.1 ఆపైన వెర్షన్ ఉన్న డివైస్ లలో ఈ యాప్ ఇన్‌స్టాల్ అవుతు ంది. ఈ యాప్ ద్వారా యూజర్లు తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో పేరుకుపోయిన జంక్ ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోవచ్చు. అదే విధంగా బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అయ్యే యాప్స్‌ను క్లీన్ చేయ వచ్చు. దీనితో డివైస్‌లో స్టోరేజ్ స్పేస్ ఆదా కావడమే కాదు, ఫోన్ వేగంగా పని చేస్తుంది. ఇందులో ఉన్న యాప్ లాక్ ఫీచర్ ద్వారా డివైస్‌లోని యాప్స్‌ను లాక్, అన్‌లాక్ చేసుకోవచ్చు. దీనితో ఇతరులు ఫోన్‌ను తీసుకున్నా యాప్స్‌ను ఓపెన్ చేయలేరు.

సంస్కరణల పిపాసి మోడీ 2019 వరకూ వాటి జోలికి వెళ్లకపోవచ్చు

ఇకపై ప్రజాకర్షక విధానాలే



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ తన రూటు మార్చనున్నారు. సంస్కరణలతో సంచలనాలు రేపిన ప్రధానిగా ఆయన ప్రజలకు సుపరిచితుడు. నల్ల ధనంపై పోరు పేరుతో పెద్ద నోట్ల చలామణీని రద్దు చేసి పిల్లల నుంచి పండు ముదుసలి వారి వరకూ బ్యాంకు ముందు నించోబెట్టారాయన. మొబైల్ సిమ్ కార్డు, బ్యాంకు ఖాతా, పాన్ కార్డు ఇలా అన్నింటినీ ఆధార్ నంబర్‌తో అనుసంధానించే కార్యక్రమం కూడా చేపట్టారు. పెట్రోల్, డీజిల్‌పై సబ్సిడీలను పూర్తిగా ఎత్తేశారు. గ్యాస్, కిరోసిన్‌లపై సబ్సిడీలను కూడా నెలనెలా తగ్గిస్తూ వెళుతున్నారు. త్వరలో వాటికీ పూర్తిగా ఫుల్ స్టాప్ పెట్టేయనున్నారు. రూ. 2 లక్షలకు మించి విలువ మేరకు ఏ కొనుగోలు, అమ్మకం అయినా నగదు రూపంలో జరగకుండా నిషేధం విధించారు. జిఎస్‌టి పేరుతో కొత్త పన్ను వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఆయన సంస్కరణల పుస్తకంలో ఇలాంటి ఆయుధాలు ఇంకా చాలానే ఉన్నాయి. కానీ, వాటిని ప్రయోగించడానికి సమయం లేదు. ఎందుకంటే 2019 సార్వత్రిక ఎన్నికలకు కేవలం ఏడాదిన్నర సమయమే ఉంది మరి. అందుకే ఇకపై భారీ సంస్కరణలను పక్కన పెట్టేసి ప్రజాకర్షక విధానాలను ఆయన అనుసరించబోతున్నట్లు బార్‌క్లేస్ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త సిద్ధార్థ సన్యాల్ అంచనా వేశారు. 2019 ఎన్నికల్లో నూతన ప్రాంతాల్లో కాషాయ జెండా ఎగిరేందుకు వీలుగా మోడీ ఇప్పటి వరకు చేపట్టిన సంస్కరణలు, ప్రాజెక్టుల తాలూకూ ఫలితాల బలోపేతంపై దృష్టి పెడతారని అంచనా వేస్తున్నట్లు సన్యాల్ తెలియజేశారు. ప్రజల మనసు చూరగొనేందుకు పాలనాపరమైన సంస్కరణలను చేపట్టే అవకాశం ఉందని సన్యాల్ సూచించారు.

ఆ ఫోన్లలోనూ ఇక గూగుల్ కెమెరా యాప్



కాలిఫోర్నియా : గూగుల్ రూపొందించిన పిక్సల్ ఫోన్లకు వినియోగదారుల్లో మంచి ఆదరణ ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఫోన్లలో అందించే గూగుల్ కెమెరా ఫీచర్ ద్వారా నాణ్యమైన చిత్రాలను పొందవచ్చు. తాజాగా గూగుల్ సంస్థ ఈ కెమెరా యాప్‌కు కొత్త అప్‌డేట్‌ను అందించింది. ఇందులో హెచ్‌డిఆర్ ప్లస్ ఫీచర్‌ను జోడించింది. దీని సాయంతో ఫోన్ కెమెరా ద్వారా మరింత నాణ్యతతో కూడిన చిత్రాలను తీసుకోవచ్చని సంస్థ ప్రకటించింది. సాధారణంగా ఒక ఫోటో తీసినప్పుడు కొంచె బ్లర్ అయ్యే అవకాశం ఉంటుంది. దీనితో దాని నాణ్యతలో కొద్దిగా మార్పు వస్తుంది. అటువంటి చిత్రాలను హెచ్‌డిఆర్ ప్లస్ ఫీచర్ సరి చేస్తుందని సంస్థ సూచించింది. తక్కువ వెలుతురులోనూ ఈ ఫీచర్ ద్వారా నాణ్యమైన చిత్రాలను తీయవచ్చు. అయితే, గతంలోని ఈ యాప్ గూగుల్ నెక్సస్ 4, నెక్సస్ 5 ఫోన్లలో మాత్రమే పని చేసేది. ఇప్పటి వరకు స్నాప్‌డ్రాగన్ 821 ప్రాసెసర్ మొబైల్స్‌లో అది కూడా గూగుల్ పిక్సల్స్‌లో మాత్రమే గూగుల్ కెమెరా యాప్ పని చేసేది. తాజా అప్‌డేట్‌తో మిగతా ఫోన్లలోనూ ఇది అందుబాటులోకి వచ్చింది. అయితే, స్నాప్‌డ్రాగన్ 820, 821, 835 ప్రాసెసర్స్ ఉన్న మొబైల్స్‌లో గూగుల్ కెమెరా మాత్రమే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. దీని ప్రకారం ఎల్జీ జి 6, వన్‌ప్లస్ 3, వన్‌ప్లస్ 3టి, వన్‌ప్లస్ 5, శాంసంగ్ గెలాక్సీ ఎస్8 మోడళ్లలో ఈ యాప్ పని చేస్తుంది.

హెూండా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకు హీరో మోటోకార్ప్ ప్రణాళికలు

మరి మూడు స్కూటర్ల ఆవిష్కరణకు సన్నాహాలు



న్యూఢిల్లీ : హీరో మోటోకార్ప్, హోండా ఈ రెండూ గతంలో భాగస్వాములు. హీరో హోండా పేరుతో ద్విచక్ర వాహన మార్కెట్‌ను శాసించాయి. ఆ తరువాత రెండూ విడిపోయి ఒంటరి ప్రయాణాన్ని ఆరంభించాయి. ఇప్పటికీ టూ వీలర్ మార్కెట్లో హీరో మోటో కార్ప్ నంబర్ 1గా ఉంది. కానీ, స్కూటర్ల విభాగంలో ఈ స్థానం హోండాకే చెందుతుంది. యాక్టివా మోడల్ ఒక్కటీ హోండాను తిరుగులేని స్థానంలో నిలబెట్టింది. దీనితో ఈ విభాగంలోనూ తాను మొదటి స్థానానికి చేరుకోవాలని హీరో మోటోకార్ప్ పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా వచ్చే మార్చి లోపు 125సిసి సామర్థ్యం గల ఒక స్కూటర్‌ను విడుదల చేయనున్నది. సంస్థ మరి రెండు మోడళ్లను వచ్చే మార్చి తరువాత అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న కంపెనీ వర్గాలు ఈ వివరాల్ని వెల్లడించాయి. ఇక మోటార్ సైకిళ్ల విభాగంలోనూ తన ఉత్పత్తుల సంఖ్యను పెంచే ఆలోచనలో సంస్థ ఉన్నది. 200సిసి మోటార్ సైకిల్‌ను సంస్థ వచ్చే ఏడాది మార్చి లోపు ఆవిష్కరించనున్నది.

చైనాలోకి రీ ఎంట్రీ ఇచ్చిన ఫేస్‌బుక్ ఫోటో షేరింగ్ అప్లికేషన్ విడుదల



న్యూయార్క్: సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ తిరిగి చైనాలో అడుగుపెట్టింది. అయితే, ఫేస్‌బుక్‌లా కాకుండా పేరు, రూపు మార్చుకుంది. కలర్‌ఫుల్ బెలూన్స్ పేరుతో ఫోటో షేరింగ్ యాప్‌ను విడుదల చేసింది. ఈ విషయాన్ని 'న్యూయార్క్ టైమ్స్' తెలిపింది. అయితే, ఈ యాప్ విడుదలలో తమ పాత్ర ఉందన్న విషయం తెలియడానికిగాను జుకర్‌బర్గ్ సంస్థ జాగ్రత్త పడింది. ఇందు కోసం బీజింగ్‌లోని ఒక భవనం అడ్రస్‌ను తమ సంస్థ చిరునామాగా పేర్కొంది. ఈ ఏడాది మొదట్లోనే విడుదలైన ఈ యాప్ అచ్చం ఫేస్‌బుక్‌నే పోలి ఉంది. కాగా, చైనాలో ఫేస్‌బుక్‌పై 2009 నుంచి నిషేధం అమలులో ఉంది. గూగుల్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ కూడా అక్కడ పని చేయవు. వాటిపై చైనా ప్రభుత్వం సెన్సార్‌షిప్ విధిస్తోంది. ఫేస్‌బుక్‌పై కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేయవలసిందిగా జుకర్‌బర్గ్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పలు మార్లు చైనాను సందర్శించిన జుకర్‌బర్గ్ అక్కడి నేతలు, అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీనితో పేరు, అడ్రస్ మార్చుకుని అచ్చం ఫేస్‌బుక్‌నే పోలిన అప్లికేషన్‌ను విడుదల చేసింది.

ఎయిర్‌టెల్ బిల్లు చూసి షాక్‌కు గురైన వినియోగదారుడు

పది రోజుల రోమింగ్‌కు రూ. 2 లక్షలు



న్యూఢిల్లీ : కుటుంబంతో కలసి సరదాగా గడిపేందుకు దుబాయి వెళ్లిన ఒక వ్యక్తికి టెలికమ్ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ దిమ్మదిరిగే షాకిచ్చింది. పది రోజుల ఇంటర్నేషనల్ రోమింగ్‌కు లక్షల్లో వచ్చిన బిల్లును చూసి అతడి గుండె ఆగినంత పనైంది. న్యూఢిల్లీకి చెందిన నితిన్ సేఠీకి ఈ అనుభవం ఎదురైంది. గత నెలలో కుటుంబ సభ్యులతో కలిసి అతడు దుబాయి వెళ్లాడు. అక్కడకి వెళ్లినా ఫోన్‌లో టచ్‌లో ఉండేందుకు తాను వినియోగిస్తున్న ఎయిర్‌టెల్ నుంచి పది రోజులపాటు అంతర్జాతీయ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకున్నాడు. టూర్ ముగించుకుని ఇండియాలో అడుగు పెట్టిన అతడి ప్యాకేజీ డీ యాక్టివేట్ కాలేదు.

ఫలితంగా జూన్ 8 నుంచి జూలై 7 వరకు నెల రోజులకుగాను ఏకంగా రూ. 1.86 లక్షల బిల్లు వచ్చింది. దీనితో కంగు తిన్న నితిన్ వెంటనే వినియోగదారుల సేవా కేంద్రానికి ఫిర్యాదు చేయగా, సాంకేతిక కారణాలతోనే బిల్లు తప్పుగా జనరేట్ అయిందని వివరణ ఇచ్చారు. మరొక బిల్లు పంపిస్తామని చెప్పడంతో సేఠీ ఊపిరి పీల్చుకున్నాడు. ఎయిర్‌టెల్ తనకు పంపిన బిల్లును నితిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

వేడెక్కిన నంద్యాల ఉప ఎన్నిక

(కర్నూలు నుంచి సూర్య ప్రధాన ప్రతినిధి):నంద్యాల ఉప ఎన్నిక ఇరుపార్టీల భవిష్యత్తుపై ప్రభావం చూపే ఉప ఎన్నిక ఇది. నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ దగ్గరపడే కొద్దీ వాతావరణం వేడెక్కుతోంది. అలాంటిది ఆచితూచి మాట్లా డాల్సిన సమయంలో కొందరు చేస్తోన్న వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఎక్కడ చూసినా ఇదే చర్చనీయాంశంగా మారుతోంది. ఏ రోజున ఏ వ్యాఖ్యలు చేసుకుంటారో అని ఉత్కంఠ నెలకొంటోంది. ఈ మాటల యుద్ధంపై ప్రజలు ఆలోచనలో పడితే నష్టమన్న సంకేతాలు పార్టీలకు అందాయి. దీంతో ఎవరికి వారు ప్రచారంలో అధినేతల మాటలనే ఓటర్ల మనసులో నాటుతూ ముందుకు సాగుతున్నారు. ఎన్నికల మహా సంగ్రామానికి సిద్ధమవుతున్నారు.

ఉప ఎన్నిక రణరంగాన్ని తలపిస్తోంది

ఈనెల 3వ తేదీన బహిరంగ సభలో వైకాపా అధినేత జగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చి చంపినా ఫర్వాలేదు అన్న వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీనిపై జగన్ ఈసీ(ఎన్నికల సంఘం)కు వివరణ ఇచ్చారు. మళ్లీ ఈనెల 9వ తేదీ నుంచి రోడ్డషో ప్రారంభించిన జగన్ తన ప్రచారంలో రెండోరోజు 'చంద్రబాబుకు ఉరి శిక్ష వేసినా తప్పు లేదు' అంటూ పదేపదే అనడం సంచలనమైంది. దీనిపై తెదేపా నాయకులు మౌనప్రదర్శనలు, ధర్నాలు, ఫ్లెక్సీలు దహనం చేయడంతోపాటు ఈసీకు మరోసారి ఫిర్యాదులు చేశారు. ఇలా ప్రతిరోజూ జగన్ మాటలపై పెద్ద యుద్ధమే జరుగుతోంది. మరోవైపు ఈ వ్యాఖ్యల వల్ల ఓటర్లు ఆలోచనలో పడితే వైకాపాకు నష్టమన్న భావన రావడంతో అభ్యర్థి, నాయకులు సందిగ్ధంలో పడుతున్నారు. అధికార పార్టీ ఈ మాటలను ప్రజల వద్దకు ప్రచారంలో తీసుకెళుతోంది. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు అభివ ద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చినవ్పుడు 'నేను వేసిన రోడ్లపై నడుస్తున్నారు.

.ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు

వైకాపా తరవున ప్రచారం చేస్తున్న అంబటి రాంబాబు, బొత్స సత్యన్నారాయణ, ఎమ్మెల్యే రోజా వంటి వారు చేస్తోన్న వ్యాఖ్యలు దుమారమే రేవుతున్నాయి. ఎన్నికలు శాంతియుతంగా జరగ కుండా రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారంటూ తెదేపా పలుసార్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. సాధారణ వ్యక్తిని దూషిస్తే ఎలాంటి కేసులు నమోదు చేస్తారో అలాంటి కేసులే ముఖ్య మంత్రిని దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

ఎవరినీ వదలం



- **గోరఖ్‌పూర్ ఘటనపై ప్రత్యేక విచారణ కమిటీ**
- **మేము ఈ అంశంపై సీరియస్‌గానే ఉన్నాం**
- **ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నాం**
- **తప్పని తేలితే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు**
- **కేంద్రం తరవున అవసరమైన సాయం అందించేందుకు సిద్ధం**
- **సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు**
- **పరిస్థితులను సమీక్షించేందుకు వైద్య బృందం ఏర్పాటు**
- **మీడియా సమావేశంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్**

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సొంత నియోజక వర్గం గోరఖ్‌పూర్ లోని బాబా రాఘవ్ దాస్ మెడికల్ కాలేజీని సందర్శించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో కలిసి పరిస్థితిపై వైద్యులతో చర్చించిన ఆయన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. కేంద్రం తరవున అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు అని యోగి తెలిపారు. మేము ఈ అంశంపై సీరియస్‌గానే ఉన్నాం. విచారణ కమిటీ నివేదికను రానివ్వండి. తప్పని తేలితే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. తప్పుడు కథనాలపై మండిపడ్డ ఆయన, వార్డులలోకి వెళ్లి చూస్తే పరిస్థితి మీకే అర్థమౌతుందంటూ మీడియాకు చురకలంటించారు. చనిపోయిన బాధలో ఉన్న తల్లిదండ్రులను రెచ్చగొడుతూ కొందరు ఈ సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అది సరికాదు. గతంలో గులామ్ నబీ ఆజాద్ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడికి వచ్చినప్పుడు ఇది పూర్తిగా రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమంటూ చేతులెత్తేశారు. ఇప్పుడేమో మాపై విమర్శలు చేస్తున్నారు. అది వారి విచక్షణకే వదిలేస్తున్నా అని యోగి పేర్కొన్నారు. ఇక ఘటనపై కేంద్రం తరవున ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటును చేస్తామని ప్రకటించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా, పరిస్థితులను సమీక్షించేందుకు ఓ వైద్య బృందాన్ని బీఆర్‌డీ మెడికల్ కళాశాలకు రప్పిస్తున్నట్లు వెల్లడించారు. సిలిండర్ల బకాయిలను ఆగష్టు 5నే చెల్లించినప్పటికీ, కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే ఈ మరణాలు సంభవించినట్లు ఇప్పటికే కమిటీ ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. పూర్తి స్థాయి నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు ఉంటాయని యోగి ప్రకటించారు. గోరఖ్‌పూర్ ఘటనపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యూపీ కాంగ్రెస్ విభాగం సీఎం యోగి, వైద్యశాఖ మంత్రి సిద్ధార్థ్ నాథ్‌ల రాజీనామాకు డిమాండ్ చేస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ ఆసుపత్రిని ఆదివారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సీఎం ఆరా తీశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను అక్కడి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సీఎం యోగి సొంత నియోజకవర్గమైన గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో దాదావు 70 మందికి పైగా చిన్నారులు ప్రాణవాయువు అందక మృతి చెందిన ఘటనపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన జరగక రెండు రోజుల ముందు సీఎం ఇదే ఆసుపత్రిని సందర్శించి.. అక్కడ వెద్య సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేసే గుత్తేదారు సంస్థకు బీఆర్‌డీ ఆసుపత్రి బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరాను నిలిపివేశారు. దాంతో 70 మంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే ఈ ఘటనపై సీఎం ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయించి విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం మరో చిన్నారి ప్రాణవాయువు అందక మృతి చెందింది.

మరో చిన్నారి దుర్మరణం


ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్ దాస్ మెడికల్ కళాశాల వెద్యశాలలో ఆదివారం ఉదయం మరో చిన్నారి ప్రాణాలు విడిచింది. దాంతో మృతుల సంఖ్య 70కి చేరింది. శనివారం దాదావు 11 మంది చిన్నారులు మృతి చెందారు. ప్రాణవాయువు అందక మెదడు వావు వ్యాధి బారిన పడిన పసిబిడ్డలు రోజురోజుకీ పిట్టల్లా రాలిపోతున్నారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఆదివారం యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ బీఆర్‌డీ ఆసుపత్రిని సందర్శించ నున్నారు. ఈ ఘటనపై ఓ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాల్సిందిగా సీఎం యోగి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ఆసుపత్రిలో 5రోజుల్లో 60 మంది పిల్లలు మృతి చెందడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై బీఆర్‌డీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజీవ్ మిశ్రను యూపీ ప్రభుత్వం తక్షణమై సస్పెండ్ చేసింది. ఆక్సిజన్ కొరత ఉండటంతో వేరే గ్యాస్ ఏజెన్సీ నుంచి మరో విడత ఆక్సిజన్ సిలిండర్లను తెప్పించారు.

మంత్రి రాజీనామా చేయాలన్న నటి

ఉత్తర్‌ప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రిసిద్ధార్థ్‌నాథ్ సింగ్ వెంటనే రాజీనామా చేయాలని బాలీవుడ్ నటి స్వరాభాస్కర్(ప్రేమ్ రతన్ ధన్ పాయో ఫేం) అన్నారు. యూపీ గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ మెడికల్ కళాశాల వెద్యశాలలో ప్రాణవాయువు అందక మెదడు వావు వ్యాధితో ఇప్పటివరకు 70 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఆస్పత్రిలో ఐదు రోజుల్లో 60 మంది పిల్లలు మృతి చెందడం దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతు న్నాయి. తాజాగా దీనిపై నటి స్వరాభాస్కర్ సోషల్ మీడియా ద్వారా స్పందిం చారు.ఎవరో చేసిన తప్పుకు పసిపిల్లలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని వెంటనే యూపీ ఆరోగ్యశాఖ మంత్రి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ రాజీనామా చేయాలని ట్వీట్ చేశారు. ఈ దుర్ఘటనపై కమల్ హాసన్ కూడా ట్విటర్ వేదికగా స్పందిం చారు. ఈ ఘటన చాలా బాధాకరం. దీనిపై యావత్ భారతదేశం చింతిస్తోంది. ఇలాంటివి మళ్లీజరగకుండా చూసుకోవాలి అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

జగన్ సీఎం కాలేడు.. రాసి పెట్టుకో

ఎంపీ ఎస్పీవై రెడ్డి



నంద్యాల, మేజర్‌న్యూస్:జగన్ సీఎం కాలేడని, ఇప్పుడే రాసి పెట్టుకోవచ్చు అని ఓ న్యూస్ ఛానెల్ ప్రతినిధి అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా టీడీపీ ఎంపీ ఎస్పీవై రెడ్డి అన్నారు. నంద్యాల ఉపఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని, ఫలితం సైకిల్ గుర్తుకే అనుకూలంగా వస్తుందని చెప్పారు. నంద్యాల ఉపఎన్నికలో ఎవరైతే గెలుస్తారో, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారే గెలుస్తారని అన్నారు. అది ఎలా సాధ్యం అని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, ప్రజల మూడ్ అలా వుంటుంది చంద్రబాబు చాణక్యుడు, ఆర్గనైజర్. ప్రజలకు సేవ చేయాలని చంద్రబాబు తపిస్తుంటారు, సేవ చేసే కెపాసిటీ ఆయనకు ఉంది. చంద్రబాబునాయుడు వల్లే రాష్ట్రం కచ్చితంగా బాగుపడుతుంది అని అన్నారు. వైసీపీ నుంచి గెలిచి టీడీపీలోకి వెళ్లిన మీరు ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నారా అని ప్రశ్నించగా అబద్ధాలు చెప్పను. అవకాశాలు లేవు. నన్ను రాజీనామా చేయమని స్పీకర్ నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు అని ఎస్పీవై రెడ్డి చెప్పుకొచ్చారు

ఏడంతస్తుల నుంచి పడినా కూడా



టెక్సాస్: ఏడు అంతస్తుల నుంచి కారు కింద పడిపోయి నుజ్జునుజ్జు అయినప్పటికీ అందులో ఉన్న మహిళ మాత్రం ప్రాణాలతో బయటపడింది. అమెరికాలోని టెక్సాస్‌లో గత నెల జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోను పోలీసులు తాజాగా విడుదల చేశారు. అమెరికన్ స్టేట్‌మెన్ కథనం ప్రకారం.. బీఎండబ్ల్యూ కారును పార్క్ చేయబోయేందుకు ప్రయత్నించిన మహిళ పొరపాటున ఎక్సలేటర్‌పై కాలు వేసింది. దాంతో ఒక్కసారిగా ఏడో అంతస్తులో ఉన్న పార్కింగ్ స్థలం నుంచి కారు కింద పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కారులో నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అంత ఎత్తు నుంచి పడినప్పటికీ ఆమెకు ప్రాణాల మీదకు వచ్చేంత దెబ్బలు మాత్రం తగలకపోవడం గమనార్హం. జులై 13న ఈ ఘటన జరగగా దీనికి సంబంధించిన వీడియోను ఆస్టిన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది గురువారం విడుదల చేశారు. ఆ పార్కింగ్ స్థలంలో ఇటువంటి ప్రమాదాలు జరగడం ఇదేమీ కొత్త కాదట. గతంలోను ఇటువంటి సంఘటనలు జరిగాయి. గతేడాది సెప్టెంబరులోను తొమ్మిది అంతస్తుల ఎత్తు నుంచి కారు కింద పడబోయింది. కానీ అదృష్టవశాత్తూ అందులోని వ్యక్తి అక్కడే ఉన్న తీగల సహాయంతో క్షేమంగా బయటపడగలిగాడు.

మొదటి పేజీ తరువాయి

అమరావతి కీర్తిని చాటుదాం

చేస్తుందని ఆయన చెప్పారు. గతానుభవాల పాఠాలతో అభివృద్ధిని ఒకే చోట కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ వికేంద్రీకరిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నగరం పాలన కేంద్రంగా, విద్య, వైద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా ఉంటుందని ఆయన చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమ సంతోష నగరిగా రూపుదిద్దుకుంటుందని సిఎం చెప్పారు. రాష్ట్రమంతా భౌగోళిక స్థితి స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరుల ఆధారంగా సర్వతోముఖాభివృద్ధి చెందేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి జిల్లా ప్రగతికి చిహ్నంగా ఉంటుందన్నారు. ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు సమగ్రాభివృద్ధిని సాధించేలా కార్యాచరణ సిద్ధం చేశామని ముఖ్యమంత్రి తెలియజేశారు. రాయలసీమను ఎలక్ట్రానిక్, మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని సిఎం చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి బండికి జోడు చక్రాల వంటివని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన వారందరికీ అందవలసిందేనని, పారదర్శకంగా అవినీతి రహితంగా పాలనను సాగిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రగతిలో సాగునీటి పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. దేశానికి ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ప్రాజెక్టును 2018 నాటికి గ్రావిటీ ద్వారా నీరు అందించి 2019 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా రైతులకు సాగునీటిని అందించి ఆదుకోవాలన్న లక్ష్యంతోనే పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువలపై పట్టిసీమ, పురుషోత్తపట్నం, ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశామన్నారు. 'రెండేళ్లుగా పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఫలాలు రైతులుకు అందుతున్నాయి. ఇదే బాటలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల ఫలాలూ ఏలేరు రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయడం ద్వారా రైతులకు అందనున్నది. స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తాం' అని చంద్రబాబు ప్రకటించారు. భారీ ప్రాజెక్టులతో సహా చిన్న మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులకూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సిఎం చెప్పారు. మరి మూడు నెలల్లో వరుసగా ఒకదాని వెంట ఒకటిగా 28 సాగునీటి పథకాలను ప్రారంభించనున్నామని సిఎం ప్రకటించారు. రాజధాని నగరంలో ఇప్పటికే పలు ప్రఖ్యాత విద్యా సంస్థలు ప్రారంభం కావడం గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఎం, విట్ ఇప్పటికే తమ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడంతో రాష్ట్ర విద్యార్థులకు అత్యున్నత విద్యావకాశాలు దక్కుతున్నాయని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వైద్య రంగంలోనూ విశిష్ట సంస్థలు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు పేదవారికి వైద్య సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాత బి.ఆర్. షెట్టి వైద్య విజ్ఞాన సంస్థ అమరావతి నగరంలో సేవలు అందించేందుకు గురువారం భూమి పూజ చేపట్టిందన్నారు. సులభతర వ్యాపార సరళి విధానం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. పారిశ్రామిక పెట్టుబడులతో యువతకు ఉపాధి, రాష్ట్రానిక ఆర్థిక ప్రగతి లభిస్తాయన్నారు. కర్నూలులో నెలకొల్పిన 1000 మెగావాట్ల సోలార్ పార్క్ ప్రపంచంలోనే అతి పెద్దదని చంద్రబాబు చెప్పారు. ఈ పార్క్ స్థాపనతో ప్రపంచ సోలార్ చిత్రపటంలో ఏపికు స్థానం దక్కిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత లండన్ కింగ్స్ హాస్పిటల్ అమరావతి రాజధానిలో రూ. 1000 కోట్లతో ఆధునాతన వైద్య సదుపాయాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించబోతున్నదని రాష్ట్ర ప్రజలకు చెప్పడానికి సంతోషిస్తున్నానని చంద్రబాబు చెప్పారు. ఈ హాస్పిటల్‌కు ఈ నెల 16న శంకుస్థాపన చేయనున్నామని సిఎం తెలిపారు. ప్రజా రాజధాని అమరావతి, పోలవరం, ప్రపంచంలో అతి పెద్ద సోలార్ పార్క్ అయిన కర్నూలు సోలార్ పార్క్ వంటి వివిధ అంశాలపై సిఎం స్పెషల్ సిఎస్ సతీష్‌చంద్ర, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్, ఎ.డి.సి. ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎనర్జీ, ఐ ఐ, సిఆర్‌డిఎ, అజయ్ జైన్, సిఆర్‌డిఎ కమిషనర్ సి. శ్రీధర్, కమిషనర్ రామమనోహర్ తదితరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

మొదటి పేజీ తరువాయి

ఒక్క ఛాన్స్ ఇవ్వండి

చిరునవ్వు చూడటమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. ఉప ఎన్నికలు రాకముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన కుమారుడు ఒక్కసారైనా నంద్యాల వచ్చారా అని ప్రశ్నించారు. నేడు ఉప ఎన్నికలు వచ్చాయి కాబట్టే వారికి నంద్యాల గుర్తొచ్చిందని, తండ్రికొడుకులు ఇద్దరు ఇప్పుడు నంద్యాల రోడ్లపై కనిపిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీని తట్టుకోలేక ఏపీ కేబినెట్ మొత్తం నంద్యాల్లో దిగిందని అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఐదో రోజు నంద్యాల రోడ్‌షోలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి, అన్యాయాలను తూర్పారబట్టారు. అధికారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టమొచ్చినట్లు హామీలు ఇచ్చారని విమర్శించారు. రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు. బ్యాంకుల గడప తొక్కలేని స్థితిలో డ్వాక్రా మహిళలు ఉన్నారని నేడు రాష్ట్రంలో మహిళల కళ్లల్లో కన్నీళ్లకు కారణం చంద్రబాబేనని విమర్శించారు. మూడున్నారేళ్లలో చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని, జాబు రాకుంటే నెలకు రూ.2వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి చివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. విద్యార్థులను కూడా చంద్రబాబు మోసం చేశారన్నారు. ప్రతి ఇంటికి నేడు రూ.76 వేలు బాకీ పడ్డారని ఆఖరికి పేదవారిని కూడా ఆయన వదిలిపెట్టలేదని విమర్శించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ "ప్రతి పేదవాడికి మూడు సెంట్ల భూమి ఇస్తానని అన్న చంద్రబాబు పేదవారికి ఒక్క ఇల్లయినా ఇప్పటి వరకు కట్టించలేదు. అధికారం కోసం చంద్రబాబు ప్రజలను వాడుకుంటున్నారు. ఏ ఒక్క సామాజిక వర్గానికి కూడా న్యాయం చేయలేదు. చంద్రబాబు తీరుతో ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. కర్నూలు జిల్లాకు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. రైతును మోసం చేసేందుకు గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పిన బాబు ఆ పనిచేయలేదు. ఎన్నికలుంటేనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రజలు గుర్తొస్తారు. నంద్యాల ఉప ఎన్నిక వచ్చింది కాబట్టే చంద్రబాబుకు మళ్లీ ప్రజలు గుర్తొచ్చారు. మరోసారి మోసం చేసేందుకు మళ్లీ టేకపు రికార్డర్ ఆన్ చేశారు. ఎక్కడైనా రోడ్ల విస్తరణ జరుగుతుంది. అది అభివృద్ధి కాదు. ఎవరిని అడగకుండా షాపులను కూల్చేస్తారు. చంద్రబాబులాగా నా దగ్గర డబ్బు, అధికారం, దుర్బుద్ధి, పోలీసులు లేరు. లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్లుగా చూపించే టీవీ చానెళ్లు పేపర్లు నా వద్ద లేవు. నాకున్న ఆస్తి నాన్నగారు ఇచ్చిన పెద్ద కుటుంబమే. వైఎస్ఆర్ సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో బతికుండటమే నాకున్న ఆస్తి. మీ జగన్ అబద్ధం ఆడడు. మోసం చేయడు. మాట మీద నిలబడే విశ్వసనీయతే నా ఆస్తి. విలువలతో కూడిన రాజకీయాలే నా ఆస్తి. నవరత్నాలతో అందరి జీవితాల్లో వెలుగు నింపుతాను. ఒక్క అవకాశం ఇస్తే నాన్న మాదిరిగా అందరి గుండెల్లో ముద్ర వేసుకుంటాను. బిల్డింగ్‌లు కూల్చేయడం, రోడ్లు తవ్వడం అభివృద్ధి కాదు, రైతుల, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే నిజమైన అభివృద్ధి. నంద్యాల ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటాను. నంద్యాల ప్రజలను నేను ఒక్కటే కోరుతున్నాను. ధర్మానికే ఓటెయ్యండి. న్యాయాన్ని గెలిపించండి. మీ ఓటుతో నేను వెంటనే ముఖ్యమంత్రిని కాకపోవచ్చు. కానీ, ఏడాది తర్వాత జరిగే కురుక్షేత్రానికి నంద్యాల ఎన్నిక నాంది కావాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డబ్బు మూటలతో మీ దగ్గరకు వస్తారు. ఈ మూడున్నరేళ్లలో దోచుకున్న అవినీతి సొమ్మును తీసుకొస్తారు. రూ.5వేలు ఇచ్చి దేవుడి పటం చూపించి ప్రమాణం చేయించుకుంటారు. ఏ దేవుడు కూడా పాపానికి ఓటేయమని చెప్పడు.. అలా దెయ్యాలే చెబుతాయి. రూ.5వేలు మీ చేతుల్లో పెట్టినప్పుడు దేవుడిని ప్రార్థించి లౌక్యంగా ఓటెయ్యండి. ధర్మానికి ఓటెసి న్యాయాన్ని గెలిపించండి." అని జగన్ పిలుపునిచ్చారు.

హిమాచల్‌లో విషాదం

లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 1752 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా దాదావు 11 లక్షలమందిపై ప్రభావం పడింది. ఎక్కడిక్కడ పోటెత్తిన వరదలతో లక్ష హెక్టార్లకు పైగా పంటలు నీటమునిగాయి. అనేక చోట్ల వంతెనలు, రహదారులు ఇతర మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. తాజా విపత్తుతో డెమాజీలో ఇద్దరు, లకీంవూర్, కోక్రాచూర్, మోరికౌర్ జిల్లాల్లో ముగ్గురు మరణించారన్న అధికారులు.. ఈ ఏడాది వరదల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 89కి చేరినట్లు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. త్రిపురలో అకస్మిక వరదల కారణంగా 4500 మంది నిరాశ్రయులయ్యారు. రెండు వేల మందికి పైగా పునరావాస కేంద్రాలకు తరలించారు.

బడుగుల పోరుబాట

ఉండడంతో రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు మద్దతు ప్రకటించడంతో పాటు ఆందోళనకు సైతం సంఘీభావం ప్రకటించాయి. ఇందులో భాగంగా ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ర్యాగ కృష్ణయ్య ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు పెద్ద ఎత్తున సర్కార్‌పై ఒత్తిడి తీసుకరావాలని, ప్రభుత్వం పెంచేందుకు నిర్ణయం తీసుకోకుంటా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాలని సమావేశంలో తీర్మాణించారు. ఈ సందర్భంగా బీసీ నేతలు గుజ్జ కృష్ణ, డాక్టర్ ర్యాగ అరుణ్, నీల వెంకటేశ్ తదితరులతో కలిసి కృష్ణయ్య మాట్లాడారు. కేంద్రప్రభుత్వం సైతం బీసీల రిజర్వేషన్లకు అనుకూలంగా ఉందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీతో సహా కేంద్ర మంత్రులు బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్యా, ఉద్యోగ , రాజకీయ రిజర్వేషన్లు పెంచకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అన్ని సామాజిక వర్గాలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తూ బిసిలకు మాత్రం 56శాతం జనాభా ఉంటే 25శాతం రిజర్వేషన్లు కల్పించడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. సమగ్ర సర్వేలో బీసీ జనాభా లెక్కలు 56శాతంగా తేలిందని, అందువల్ల బీసీల రిజర్వేషన్లు పెంచాలని, న్యాయపరమైన వివాదాలు కూడా రావని సూచించారు. తమిళనాడులో 70, కర్ణాటకలో 69శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, ఇటీవల సుప్రీం కోర్టు బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించవచ్చునని ఉత్తరప్రదేశ్‌కు సంబంధించిన ఒక కేసులో తీర్పు చెప్పిందని తెలిపారు. తమిళనాడు తరహాలో తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. రిజర్వేషన్ల జాబితాలో కలిపే కొత్త కులాలను రాజకీయ వత్తిడిలకు లొంగకుండా శాస్త్రీయంగా, హేతుబద్ధంగా రిజర్వేషన్ వర్గాలకు ఉండాల్సిన ప్రాతిపదికలు, లక్షణాల ఆధారంగా కలుపాలన్నారు. రాజ్యాంగం, సుప్రీం కోర్టు, మండల్ కమిషన్, వివిధ బిసి కమిషన్లు బీసీ జాబితాలో కలుపే కులాలకు రెండు పారామీటర్లు నిర్ణయించారని తెలిపారు. ముస్లిం, మైనార్టీల రిజర్వేషన్ల పేరుతో బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు, సబ్-ప్లాన్ సాధించుకునేందుకు బీసీలు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

పొంచివున్న ఉగ్ర ముప్పు

పాక్ సైన్యం మరోసారి కాల్పుల ఉల్లంఘనకు పాల్పడింది.పూంచ్ జిల్లాలోని భారత సైనిక స్థావరాలపై ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో పాక్ కాల్పులకు తెగబడింది. ఈ కాల్పులను జవాన్లు సమర్థవంతంగా తిప్పికొట్టారు. డిఫెన్స్ వర్గాల సమాచారం మేరకు ఈ కాల్పుల్లో ఓ భారత పౌరుడు, ఒక జవాను మృతి చెందినట్లు తెలుస్తోంది. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో దాడులు జరగవచ్చనని నిఘా వర్గాలు ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలను హెచ్చరించాయి. దీంతో కేంద్రం దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో విషాదం నింపేందుకు భారత రాజధాని ఢిల్లీలో పాకిస్తాన్ ఉగ్రవాదులు భారీ విధ్వంసానికి కుట్రపన్నినట్లు కేంద్ర నిఘా సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఉగ్రవాదుల వద్ద ఆర్డీఎక్స్ సహా పేలుడు పదార్థాలు కూడా ఉన్నాయని తెలిపాయి. దీంతో ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు.భారత్-పాక్ మధ్య సంబంధాలను చెడగొట్టేందుకు లష్కరేతోయిబా, హిజ్‌బుల్ ముజాహిద్దీన్ టెర్రరిస్టులు ప్రయత్నిస్తున్న విషయం విదితమే. హైదరాబాద్ సహా పలు నగరాలపై ఉగ్రవాదులు దృష్టిపెట్టారన్నది సమాచారం. దీంతో సరిహద్దుల్లో సైనిక దళాల పహారా పెంచారు. గురుదాస్‌పూర్, కాశ్మీర్ ఘటన తర్వాత సరిహద్దుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. రిపబ్లిక్ వేడుకలలో దేశంలో ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని కేంద్రం తాజాగా మరోసారి హెచ్చరికలు చేసింది. ఇదివరలో ఉగ్రవాది యాకుబ్ మెమెన్ ఉరిశిక్షతో దేశంలోని ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలలో ఉగ్రదాడులు జరుగవచ్చని కేంద్ర నిఘా వర్గాలు అనుమానిస్తూ వచ్చాయి. ఉగ్రకుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలు సన్నద్ధం కావాలని కేంద్ర నిఘా వర్గాలు ముందస్తుగా సమాచారం ఇచ్చాయి. దేశంలోని ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలైన బెంగళూరు, పూనె, హైదరాబాద్, నాగ్‌పూర్, ముంబై, ఢిల్లీలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని ఇంటిలిజెన్స్ హెచ్చరికలే ఇందుకు ప్రధాన కారణం. ఈక్రమంలో దీంతో ఢిల్లీలో భద్రతను పెంచారు. ఇప్పటికే ఢిల్లీ, నాగ్‌పూర్‌లోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాలలో 144 సెక్షన్ విధించారు. ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలలోని రద్దీ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది. ముంబైలోనూ భద్రత



పెంచారు. కీలక ప్రాంతాలలో తనికీలు నిర్వహించారు. భారత్-పాక్ సరిహద్దుల్లో భద్రతను పెంచారు. చొరబాట్లు జరగకుండా భారత బలగాలు అప్రమత్తంగా ఉన్నాయి. పంజాబ్‌లోనూ మళ్లీ దాడులు జరిగే అవకాశం ఉందని ఆర్మీ ఇంటిలిజెన్స్ వెల్లడించింది.ఇటీవల కాలంలో పఠాన్‌కోట్ దాడీ, పాక్‌పడవ నుంచి పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాలు పట్టుబడటం, ఇదివరలో పాక్ మరబోటు కాల్చివేయడం లాంటి ఘటనలు చోటుచేసుకున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌ను నిశితంగా గమనిస్తున్నారు. అభ్యంతరకర వ్యాఖ్యలు పోస్ట్ చేసినా, తప్పుడు ప్రచారం చేసిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఎయిర్ పోర్ట్‌లో భారీగా భద్రత పెంచారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగా ఈక్రమంలో కేంద్రం చేసిన హెచ్చరికలతో తెలుగు రాష్ట్రాలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా అనుమానిత ప్రాంతాలలో కార్డన్ సర్చ్‌లు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో తీవ్ర వాదులు రెచ్చిపోయి దాడులకు పాల్పడే అవకాశం ఉందని కేంద్ర నిఘా వర్గాలు ముందస్తుగా ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలను హెచ్చరించాయి. ఈక్రమంలో తెలుగు రాష్ట్రాలలో పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఉగ్ర కద లికలు ఉన్న ప్రాంతాలలో విఐపిలకు భద్రత మరింత పెంచారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలో పుష్కరాలు జరుగుతున్నందున పవిత్ర పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, మహానంది, భద్రాద్రి, వేముల వాడ, మంత్రాలయం, శ్రీకాళహస్తి, బాసర తదితర పుణ్యక్షేత్రాలలో భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని ఎయిర్‌పోర్టులో భద్రతా చర్యలు మరింత పటిష్టం చేశారు. అదేవిధంగా ప్రముఖ నగరాల్లోని బస్టాండ్స్, రైల్వే స్టేషన్‌లలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఉగ్ర కదలికలపై సంయుక్తంగా పనిచేయాలని రెండు రాష్ట్రాల సిఎంలు పోలీసులకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఇదిలావుండగా హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో ఐఎస్‌కు చెందిన సానుభూతి పరులు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఐఎస్, సిమీ ఉగ్రవాదులు సంచరిస్తున్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట, శ్రీసిటీ, తడ ప్రాంతాల్లో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నవారిపై నిఘా పెంచారు. ఇటీవల కాలంలో ఐఎస్ఎస్ పట్ల ఆక ర్షితులైన వారిపైనా నిఘా సారిస్తున్నారు. గత కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న ఉగ్రవాదులు ముంబై పోలీసు కార్యాలయంపై దాడులు చేస్తామని ప్రకటించడంతో కేంద్ర నిఘా వర్గాలు దేశంలోని ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలలో నిఘా సారించాలని ఆయా ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

డ్రోన్ దాడులు జరిగే అవకాశం ఉంది

దేశంలోని ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలను కేంద్ర నిఘా వర్గాలు అప్రమత్తం చేస్తున్నాయి. ఉగ్రవాద దాడులు జరిగిన ప్రాంతాలలో తీవ్రవాదులు దాడులకు తెగబడే అవకాశం ఉందని ముందస్తు హెచ్చరికలు జారీ చేశాయి. ముఖ్యంగా ముంబై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఉగ్రవాదులు డ్రోన్ దాడులు పాల్పడే అవకాశముందని ఇంటలిజెన్స్ వర్గాలు పోలీసులను హెచ్చరించాయి. దీంతో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అందువల్ల హైదరాబాద్‌లో డ్రోన్లు, ఇతర తేలికపాటి పరికరాల ఎగరవేతపై నిషేధం విధించిన విషయం విదితమే. ఉగ్రవాదుల ఏ క్షణంలోనైనా దాడులకు పాల్పడొచ్చనే నిఘా వర్గాల సమాచారంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు అప్రమత్తమయ్యారు. డ్రోన్లు, గాలిలో ఎగిరే రిమోట్ కంట్రోల్ పరికరాల ద్వారా ఉగ్రవాదులు దాడులకు పాల్పడవచ్చని నిఘావర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి.

దక్షిణ తెలంగాణలోను బిజెపిని విస్తరిస్తాం

కేంద్రమంత్రి పొన్ను రాధాకృష్ణన్

మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధి : దేశ వ్యాప్తంగా నరేంద్ర మోడీ హవా కొనసాగుతుందని కేంద్రమంత్రి పి. రాధాకృష్ణణ్ అన్నారు. కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పార్టీ విస్తరించిందన్నారు. ఆదివారం వరంగల్ పార్ల మెంట్ పరిధిలోని బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో పాల్గొనేందుకు వరం గల్‌కు వచ్చిన ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. దేశంలో 16 రాష్ట్రాలలో ఎన్డీఏ అధికారంలో ఉందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో దక్షిణ తెలంగాణలోను పార్టీని బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందన్న ఆయన బిజెపిని ఎదుర్కొని నిలబడే సత్తా ఇతర పార్టీలకు లేదన్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ అధి కారంలోకి వచ్చిన తరువాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆరోపిం చారు. కేంద్రం ఇస్తున్న నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను తాము చేశా మంటు చెప్పుకోవడం టిఆర్ఎస్ నేతలకు అలవాటయిపోయిందని ఆయన విమర్శించారు. మూడు సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం మినహ సాదించింది ఏమి లేదన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలచే రాజీనామాలు చేయించి ఎన్నికలకు వెళ్లే దమ్ము అధికార పార్టీ నేతలకుందా అని ఆయన ప్రశ్నించారు. కమలాపూర్ గ్యాస్ ప్లాంట్‌ను తాము అధికారంలో ఉన్నపుడు మంజూరు చేయిస్తే దానిని టిఆర్ఎస్ పార్టీ తీసుకువచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు మద్దతునిచ్చిన పార్టీగా బిజెపికి తెలంగాణ ప్రజల మనసులలో సుస్థిర స్థానం ఉందన్నారు. తమపై ఎవరెన్ని విమర్శలు చేసిన వచ్చే సార్వత్రిక ఎన్నికలలో అధికారంలోకి వస్తామన్నారు. టి జెఎసి నేతలపై టిఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తాము ఖండిస్తున్నా మన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డా లక్ష్మణ్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మార్తినేని ధర్మారావు, డాక్టర్ రాజేశ్వర్‌రావు, చందుపట్ల కీర్తిరెడ్డి, వెన్నంపల్లి పాపయ్య, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పాలమూరుపై దృష్టి పెట్టిన గులాబీ దళం?

- నల్గొండలో ఆపరేషన్ ఆకర్ష్‌ను పూర్తి చేసిన గులాబీదళం
- టిఆర్ఎస్‌లోకి మరో సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే డికె అరుణ
- మంత్రి కెటిఆర్‌తో ప్రాథమిక చర్చలు పూర్తి చేసిన ఫైర్‌బ్రాండ్
- ప్రభుత్వంలో కీలకమైన పదవి కావాలని అరుణ డిమాండ్
- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కెసిఆర్

మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధి: అధికార టిఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ విజయవంతంగా కొనసాగుతుంది. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయడంలో విజయం సాదించిన గులాబీ దళం ఇపుడు తన దృష్టిని పాలమూర్ జిల్లా వైపు మల్లించింది. పార్టీ యువ నేతలు కెటిఆర్, హరీశ్ రావులు పోటాపోటీగా వలసలను ప్రోత్సహిస్తున్నారు. నల్గొండ ఆపరేషన్‌కు మంత్రి హరీశ్‌రావు సారథ్యం వహిస్తే పాలమూర్ ఆపరేషన్‌కు యువనేత సిఎం తనయుడు కెటిఆర్ సారథ్యం వహిస్తున్నారు. నేరుగా రంగంలోకి దిగిన కెటిఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే డికె అరుణతో సమావేశమయ్యారు. ఆమెను పార్టీలోకి రావా ల్సిందిగా ఆహ్వానించారని సమాచారం. ఆమెతో పాటు మరో ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కూడ ఈ బేటిలో పాల్గొన్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని రెండు వర్గాలు అంటున్నాయి. అయితే డికె అరుణ సోదరుడు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మో హన్‌రెడ్డిని తనకు తెలియకుండా టిఆర్ఎస్‌లోకి తీసుకోవడం పై అరుణ ఒకింత అసహనం వ్యక్తం చేసినప్పటికి చివరికి తాను కూడ గులాబీ కండువా కప్పు కోవడానికి అంగీకరించిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక పార్టీలో, ప్రభుత్వంలో తన రోల్ ఉండాలే అనే అంశం పైన సుదీర్ఘంగానే చర్చలు జరిగా యని తెలుస్తోంది. టిఆర్ఎస్ నేతలు చెబుతున్న లెక్కల ప్రకారం ప్రస్తుతం పాలమూరు జిల్లా నుండి మంత్రి వర్గంలో కొనసాగుతున్న ఇద్దరు నేతలు కూడ రాజకీయంగా మహబూబ్‌నగర్ జిల్లాలో టిఆర్ఎస్‌ను బలోపేతం చేయడంలో విఫలమయ్యారని కెసిఆర్ సన్నిహిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. మంత్రులు జూపల్లి కృష్ణారావు, కె. లక్ష్మారెడ్డిలకు పార్టీ విస్తరణలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్పటికి దానినివారు పూర్తిస్థాయిలో వినియోగించు కోవడం లేద న్నది ప్రధాన ఆరోపణ. ఇక్కడి నుండి నాగం జనార్ధన్ రెడ్డి, రేవంత్‌రెడ్డిలను రాజకీయంగా ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నం కావడంతో టిఆర్ఎస్ అధిష్ఠానం డికె అరుణను పార్టీ లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుందని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా టిఆర్ఎస్ గాలి వీచినప్పటికి మొన్నటికి మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆమె ఒంటిచేత్తో ఓ సీటులో కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకోగలిగారు. రాష్ట్ర అసెంబ్లీలోను కాంగ్రెస్ గొంతును ఆమె బలంగా వినిపిస్తున్నారు. ఈ పరిణామాలతో అటు కాంగ్రెస్‌ని ఆత్మరక్షణలోకి నెట్టవచ్చన్న వ్యూహంతో టిఆర్ఎస్ పెద్దలు అడుగులు వేస్తున్నారు.

డికె అరుణతోపాటు పార్టీ మారనున్న ఎమ్మెల్యే సంపత్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

ప్రస్తుత పాలమూరు జిల్లా రాజకీయాలలో డికె అరుణ హవా కొన సాగుతుంది. అక్కడక్కడ అధికార టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ నేతలకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆమె దగ్గరుండి కాంగ్రెస్ నేతలకు అండగా ఉంటూ వచ్చా రు. డికెనే పార్టీ మారేందుకు సిద్ధమైందన్న ప్రచారంతో జిల్లాలోని కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున టిఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్దం చేసుకుంటున్నారని సమాచారం. వీరిలో అరుణ ప్రధాన అనుచరులుగాఉన్న ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్, గత ఎమ్మెల్సీ ఎన్నికలలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన





దామోదర్‌రెడ్డి ఉన్నారని తెలుస్తోంది. మంత్రి కెటిఆర్‌తో జరిగిన చర్చలలో వీరు పాల్గొన్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో భవిష్యత్‌లో మంచి అవకాశాలుంటాయన్న అంచ నాలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా దామోదర్‌రెడ్డికి గుర్తింపు ఉంది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఆయనకు గట్టి పట్టు ఉంది. వీరితో పాటు గద్వాల్, దేవరకద్ర తదితర నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు కూడ పెద్ద ఎత్తున పార్టీలో చేరేందుకు రంగం సిద్దం చేసుకున్నట్లు ప్రచారం జరగుతుంది.

సిఎం కెసిఆర్ మంత్రివర్గంలోకి డికె అరుణ?

త్వరలోనే సిఎం కెసిఆర్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేయనున్నారన్న వార్తల నేపథ్యంలో డికె అరుణకు క్యాబినెట్ మంత్రిగా అవకాశం ఇవ్వనున్నారని సమా చారం. జిల్లాల పునర్విభజన తర్వాత మహబూబ్‌నగర్ మూడు జిల్లాలుగా ఉండ బోతుంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయిని నర్సింహారెడ్డి లేదా డాక్టర్ లక్ష్మారెడ్డిలలో ఒకరికి ఉద్వాసన పలికి వారి స్థానంలో అరుణకు అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది.

కెసిఆర్‌పై ప్రజలకు విశ్వాసం ఉంది!

ఎమ్మెల్సీ కొండా మురళి, ఎమ్మెల్యే సురేఖ



మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధి : కెసిఆర్ నాయకత్వంలోనే బంగారు తెలంగాణ సాధ్యమని ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను అమలు చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు ప్రజల నుండి ఆదరణ లభిస్తుందన్నారు. గొర్రెల పెంపకం పథకాన్ని యాదవులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చారి త్రక ఓరుగల్లు నగరానికి వారసత్వంగా వస్తున్న కాకతీ య కట్టడాలను కాపాడు కోవాలని కొండా దంపతులు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ లోని చారత్రక మెట్లబావిని వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కొండా మురళీ మాట్లాడుతూ వరంగల్‌లో కాకతీయులు ఎన్నో అద్భుతమైన కట్టడాలను నిర్మిం చారని కొనియాడారు. ఈరోజు పర్యాటకంగా ఓరుగల్లు అభివద్ధి చెందుతుం దంటే అది కాకతీయ రాజుల చొరవేనన్నారు. శివనగర్‌లోని మెట్లబావిని నిశి తంగా పరిశీలిస్తే వారి సాంకేతిక పరిజ్ఞానం మనకు అర్ధమవుతుందన్నారు. కాకతీయుల కట్టడాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభు త్వం కట్టుబడిఉందన్నారు. హ దయ్ పథకంలో ఈ బావిని చేర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. నెల రోజులలో మెట్లబావిని పునరుద్దరించి పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తామని వివరించారు. పర్యాటక, పురావస్తు శాఖలను సమన్వయం చేస్తూ ఈ ప్రాంతా న్ని వృద్ధిలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఈ భావికి సంబం దించిన భూములు కబ్జాకు గురవు తున్నాయని స్థానికులు ఎమ్మెల్యే కొండా సురేఖకు మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఆమె రెవెన్యూ అధికా రులతో మాట్లాడి కబ్జాదారుల నుండి విముక్తి చేస్తామని హామీ ఇచ్చారు. సిఎం కెసిఆర్ వరంగల్ నగరాభివద్ధికి కట్టుబడి ఉన్నారని అందులో బాగంగా ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారని గుర్తు చేశారు.

రేలంగి సేవలు చిరస్మరణీయం : మంత్రి మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం మేజర్ న్యూస్:తెలుగు చిత్ర పరిశ్రమలో హాస్యంలో తిరుగులేని నటధీరుడిగా తెలుగు ప్రజల మనస్సు దోచుకున్న పద్మశ్రీ రేలంగి వేంకటరామయ్య అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు పేర్కొన్నారు. స్థానిక బివిఆర్ కళకేంద్రంలో పద్మశ్రీ రేలంగి వేంకటరామయ్య 107వ జయంతి ఉత్సవ కార్యక్రమం రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ మరియు దవళ సత్యం కళా మిత్రమండలి ఆధ్వర్యంలో పియమ్ఆర్ ట్రస్టు సహకారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పైడికొండల మాణిక్యాలరావు మాట్లాడుతూ రేలంగి చిత్ర పరిశ్రమలో అచంచలుగా ఏదిగి తన హస్య చతురతతో హస్య ప్రియుల మనస్సును దోచుకన్న మహనటుడని చిత్ర పరిశ్రమలో నిర్మాతగా ఏందరో నటులకు తమ సహాయసహకారాలను అందించి వద్ధిలోకి తీసుకొచ్చిన ఘనత అయనదని నిరాథంబరుడు, భహుముఖ ప్రజ్ఞాసాలి అని రేలంగిని కొనియాడారు. రేలంగి తాడేపల్లిగూడెంలో జన్మిం చి నటుడిగా ఎదిగిన క్రమంలో తన సోంత ఊరిలో రేలంగి చిత్ర మందిర్ అను సినిమా దియేటర్‌ను స్థాపించి గూడెం ప్రజలపై వున్న తమ మమకారాన్ని చాటుకున్నారని అన్నారు. ఆయన జయంతి కార్యక్రమం కుటుంబ సభ్యుల మధ్య, తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖుల మధ్య జరువుకోవడం సంతోషంగా వుందన్నారు. రేలంగి చేసిన సేవలకు కతజ్ఞతగా తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రధాన కూడలిలో రేలంగి విగ్రహన్ని ఏర్పాటుకు సన్నాహలు చేస్తున్నామని అన్నారు. రేలంగిని ఆదర్శంగా తీసుకుని అయన అడుగుజాడల్లో యువత నడవాలని పిలువు నిచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు రేలంగి నరసింహరావు మాట్లాడుతూ రేలంగి అశయాలకు ముందుకు తీసుకువెళ్ళడానికి మా కుటంబం కృషి చేస్తుందని అన్నారు.



కొండవీడు కొండపైకి రూ. 34 కోట్లతో ఘాట్ రోడ్డు

- **రూ. 200 కోట్లతో ఇస్కాన్ స్వర్ణ దేవాలయం**
- **కోటను శతాబ్దాల తరువాత ప్రభుత్వం అభివృద్ధికి నిధులు**
- **ఘాట్ రోడ్డు నిర్మాణం సింహభాగం పూర్తి**
- **కొండ మొత్తం పచ్చని చెట్లతో నిండిన ఉద్యానవనాలు**

విజయవాడ, సూర్య బ్యూరో : చారిత్రాత్మక చిహ్నామై, పచ్చని చెట్లతో ప్రకృతి రమణీయతకు నిలయమై, ఆంధ్రదేశ సాహిత్య, సామాజిక, రాజకీయ చరిత్ర లో సుస్థిరమైన స్థానం ఉన్న ప్రాంతం కొండవీడు అనడంలో సందేహంలేదు. అటువంటి ఈ కోటను శతాబ్దాల తర్వాత ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేసింది. కొండవీడు కోటను అన్ని విధాలా అభివృద్ధి చేయ డానికి అటవీ శాఖ, రోడ్లు, రహదారుల భవనాల శాఖ, దేవాదాయ శాఖ ప్రణాళి కలు రూపొందించాయి. ఇప్పటికే ఘాట్ రోడ్డు నిర్మాణం సింహభాగం పూర్తి కాగా మిగిలిన రహదారి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. చారిత్రక, పర్యాటక ప్రాంతంతోపాటు అందాల ఉద్యానవనాలు తీర్చిదిద్దేలా పలు ప్రణాళికలతో ప్రగతి పనులు మొదలయ్యాయి. నవ్యాంధ్ర రాజధాని నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో చారిత్రక ప్రాంతమైన కొండ వీడు కోట ఉంది. యడ్లపాడు మండలం కొండవీడు గ్రామం నుంచి కోటపైకి చేరుకోవచ్చు. అప్పట్లో రెడ్డిరాజులకు రాజధానిగా విలసిల్లిన కొండవీడు ప్రాంతం ప్రకతి రమణీయతకు నిలయం. కొండలపై పచ్చదనంతో నిండిన చెట్లు, వివిధ ఆకతుల్లో పెద్దపెద్ద బండరాళ్లు. కొండవీడు కొండచుట్టూ నిర్మించిన కోట, కొండపై మూడు చెరువులు, అప్పట్లో ఆయుధాలు దాచడానికి వినియోగించిన నేతికొట్టు ఇలా పర్యటకులను ఆకర్షించే అంశాలు, విశేషాలు ఈ ప్రాంతం సొంతం. కొండపై సారవంతమైన భూమి ఉండడంతో ఔషధ మూలికలు అందించే ఎన్నో చెట్లు ఇక్కడ పెరుగుతున్నాయి. కొండ మొత్తం పచ్చని చెట్లతో నిండి ఉద్యానవనాలను తలపిస్తోంది. ఎటుచూసినా పచ్చనిచెట్లు, ఆసక్తి కనిపించే పెద్ద పెద్ద రాళ్లతో కూడిన గుహలు వంటి ప్రాంతం ఆకర్షిస్తోంది. కొండపైన ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు చల్లని సమీరాలు, పచ్చని మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. కొండపై నుంచి కొండవీడు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల అందాలను తిలకించవచ్చు. కొండపై ఉన్న సారవంతమైన ప్రాంతంలో ఉద్యానవనాలు అభివృద్ధి చేస్తే శతాబ్దాల కిందటి పూర్వవైభవం మళ్లీ కొండవీడుకు సంతరించుకుంటుంది. కొండపై వేసవి కాలంలో సైతం ఎండిపోని చెరువులు ఉన్నాయి. కొండవీడు కొండకు సమీపంలో ఉన్న కొండలపై దట్టమైన అటవీ ప్రాంతం పచ్చదనంతో ఆకర్షిస్తోంది. కొండవీడు పరిసర ప్రాంతాల్లో చారిత్రక కత్తులబావి, దక్షిణ భారతదేశంలోనే విశేషమైన వెన్నముద్ద గోపాలస్వామి ఏకశిలా విగ్రహంతో పాటు అనేక ప్రముఖ ఆలయాలున్నాయి.

రూ. 200 కోట్లతో ఇస్కాన్ స్వర్ణదేవాలయం...

కొండవీడు సమీపంలో రూ. 200 కోట్లతో ఇస్కాన్ స్వర్ణదేవాలయాన్ని నిర్మి స్తున్నారు. కొండవీడు కొండపైకి చేరుకోవడానికి ఇప్పటివరకు కాలిబాట మాత్ర మే ఉంది. దీంతో పర్యటకులు పైకి చేరుకోవడానికి అష్టకష్టాలు పడేవారు. కొండవీడు కోట ప్రాశస్త్యం పెద్దగా వెలుగులోకి రాకపోవడంతో పర్యటకుల సందడి పెద్దగా ఉండేది కాదు. ఈ క్రమంలో కొండవీడు ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో తొలుత రోడ్డుపైకి వెళ్లడానికి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కొండవీడు గ్రామం నుంచి కొండ వరకు రహదారి ఉంది. కొండ కింది భాగం నుంచి పైకి చేరుకోవడానికి 5.9 కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ. 34 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయి. ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కొండపైకి చేరుకున్న తర్వాత చెరువులు, ఇతర చార్త్రిక ప్రాంతాలు చేరుకోవడానికి కొండమీద 660 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ. 11.8 కిలోమీటర్లతో రహదారులు, భవనాల శాఖ ప్రభుత్వానికి ప్రతిపా దనలు పంపింది. ఇది అటవీ ప్రాంతం కావడంతో అటవీ శాఖ నుంచి అను మతి కోసం దరఖాస్తు చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సుముఖత వ్యక్తం చేయడంతో అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు. ఈఏడాది చివరికి ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఆర్అండ్బీ వర్గాలు అంటున్నాయి.

పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఒక కేంద్రం ఏర్పాటు


కొండవీడు కొండ, కోట ప్రాంతం మొత్తం అటవీశాఖ ఆధ్వర్యంలో ఉండ డంతో ఇక్కడ అభివృద్ధి పనులను అటవీ శాఖ చేపడుతోంది. ఇందుకు సంబం ధించి రూ. 6.80 కోట్ల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో ప్రాథమికంగా



ఆమోదం వచ్చింది. కొండవీడు కోట చుట్టూ 3 మీటర్ల ఎత్తుతో కంచె వేయ నున్నారు. ఇందుకు రూ. 82 లక్షలు వెచ్చించనున్నారు.

ఇక్కడి వచ్చే పర్యటకు లకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా ఒక కేంద్రం ఏర్పాటు చేస్తారు. దీంతోపాటు పక్షుల శాంక్చరీ, చేపల ఆక్వేరియం అందుబాటులోకి తెస్తారు. రూ. 70 లక్షల వ్యయంతో జింకల పార్కు ఏర్పాటు చేస్తారు. రూ. 80 లక్షలతో పక్షుల కేంద్రం, రూ. 45 లక్షలతో బొటానికల్ గార్డెన్, రూ. 16 లక్షలతో రెండు వాచ్‌టవర్లు, రూ. 15 లక్షలతో ఆర్కిలాజికల్ గార్డెన్ ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పర్యటకుల విడిదితోపాటు మౌలిక వసతులు కల్పిస్తారు. పచ్చదనంతో కూడిన లాన్, ల్యాండ్ స్కేపింగ్, అల్పాహారశాల, ఔషధ మొక్కలతో కూడిన ఉద్యాన వనం, కొండపై ఆకట్టుకునేలా ఉద్యాన వనాలు అభివ ద్ధి చేస్తారు. ఇక్కడే 500 హెక్టార్లలో జూ పెట్టాలన్న ప్రతిపాదలనకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపినట్లు అటవీశాఖ వర్గాలు తెలిపాయి. కొండవీడు కొండలో త్వరలోనే పలు అభివద్ధి పనులు ప్రారంభిస్తామని అటవీ శాఖ అధికారి మోహన్‌రావు అన్నారు. అటవీ శాఖ ప్రతిపాదించిన పనులు పూర్తయితే కొండవీడు ప్రాంతం రాబోయే కాలంలో జిల్లా పర్యటకరంగంలో ప్రధాన కేంద్రమై తలమానికం అవుతుం దనడంలో సందేహం లేదు.

నంద్యాలలో టీడీపీ జెండా ఎగురవేస్తాం



నంద్యాల, మేజర్‌న్యూస్ : నంద్యాలలోని వివేకానంద ఆడి టోరియంలో టీడీపీ అభ్యర్థికి మద్దతుగా ఏర్పాటు చేసిన ఆర్య వైశ్య సంఘాలు సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్య వైశ్యులకు పెద్దపీత వేసిన ఘనత సిఎం చంద్రబాబేనని చెప్పుకోవచ్చు. నంద్యాల ఉప ఎన్నికల్లో భూమా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని ఆయన కోరారు. జగన్ ఓటమి భయంతోనే నంద్యాలలో ఎన్నికల ప్రచా రం నిర్వహిస్తున్నారని అన్నారు. రాయలసీమను రతనాలసీమగా మార్చిన ఘన త సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆది నారాయణరెడ్డి, అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులు, సినీ నిర్మాత అంబికా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ల కోసం బిజెపి కార్యాలయంపై దాడి



కాకినాడ, సూర్య ప్రతినిధి : భారతీయ జనతా పార్టీ, టిడిపి పొత్తులో భాగంగా కేటాయించే సీట్లలో బిసిలకు అన్యా యం జరిగిందని ఆరోపిస్తూ బిసి, ఎస్సీ, ఎస్టీలకు చెందిన నాయకులకు అన్యాయం జరిగిందని, ఆరోపిస్తూ జగన్నా ధపురనానికి చెందిన బిసి సెల్ నగర అధ్యక్షుడు కె.గంగ రాజు ఆధ్వర్యంలో దాడి జరిగింది. ఈ దాడిలో భాగంగా బిజెపి జెండాలను డ్రైన్లలో పడేసి పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిసి ఓట్లతో పదవులు పొందుతున్న నాయకులు సీట్లు కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని, అది భారతీయ జనతా పార్టీలో కూడా ప్రారంభమైందని ఆయన తెలియజేశారు. అయితే పోలీస్‌లు రంగప్రవేశం చేసి వారిని అదుపు చేశారు. ఈ అంశంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ పార్టీ జిల్లా క్యాడర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, ఇటువంటి క్రమశిక్షణా రాహిత్య చర్యలను సహించేది లేదని పేర్కొన్నారు.

మేయరే కాదు కార్పొరేటర్ల సీట్ల కేటాయింపులో 'దేశం' ముందంజ

- **34 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థుల ప్రకటన**
- **పెండింగ్‌లో 16.. దానిలో 9 బిజెపికే**


కాకినాడ, సూర్య ప్రతినిధి : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబం ధించి కాపు మహిళా అభ్యర్థికే మేయర్ స్థానాన్ని కేటాయిస్తున్నట్టు ఉప ముఖ్య మంత్రి నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేసిన విషయం విదితమే. అయితే దీనికి సంబంధించి రాష్ట్ర పార్టీ కూడా ఐవిఆర్‌లో ఐదుగురి పేర్లు ప్రకటించి కాకినాడలో ముఖ్యుల నుండి వివరాలు సేకరించిన విషయం విది తమే. అదే దూకుడులోనవాం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నామన రాంబాబు 34 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్ అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. అయితే మిగిలిన 14 డివిజన్లకు సంబంధించిన పేర్లు ప్రకటించాల్సి వున్నప్పటికీ వీటిలో 9 స్థానాల్లో బిజెపితో పొత్తు కారణంగా ఆ పార్టీ వదులుకోవాల్సి వుంది. కాగా ఈ 14 డివిజన్లలోను 4, 5, 9, 29, 35, 36, 39, 40, 41, 47, 49, 50 డివిజన్లలో మాత్రమే బిజెపి నామినేషన్లు దాఖలు చేసింది. 13, 21 డివి జన్లలో మాత్రమే నామినేషన్‌లు దాఖలు చేయలేదు. అయితే కొన్ని డివిజన్లలో ఉపసంహరణ (విత్‌డ్రా)కు సంబంధించి అభ్యర్థులను బతిమాలే విధానం లేకుండా ముందుగానే విత్‌డ్రా ఫారాలపై భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకత్వం సంతకాలు తీసుకుంది. సోమవారం కాకినాడ నగరానికి రానున్న దేవాదాయ శాఖామంత్రి పైడికొండల మాణిక్యాలరావు విశాఖపట్నం జిల్లా శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు బిజెపి అభ్యర్థులకు బి-ఫారాలు అందజే యనున్నారు. అయితే కొన్ని డివిజన్లను బిజెపికి కేటాయించడం వల్ల ఓటమి చవిచూసే అవకాశముందని తెలుగుదేశం నాయకత్వం, కార్యకర్తలు భావిస్తు న్నారు. అలాంటి డివిజన్లపై మరోసారి ఇరుపార్టీల ముఖ్యులు చర్చలు జరిపే అవకాశముంది. అదేవిధంగా 9 డివిజన్లను బిజెపికి కేటాయిస్తుండగా, ఐ డివిజన్లలో టిడిపి అభ్యర్థులను ఖరారు చేయడంలో అధికార పార్టీ కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. ఉదాహరణకు 29వ డివిజన్ నుండి





టిడిపి టికెట్ ఆశిస్తూ గత ఎన్నికల్లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుకు మద్దతునిచ్చి, విజయానికి కృషి చేసిన నాయకులతో పాటు మాజీ కార్పొరేటర్, జన్మభూమి కమిటీ సభ్యులు పోటీ పడుతున్నారు. పోటీ పడుతున్న వారిలో యాళ్ల పట్టాభి, వాసిరెడ్డి రాంబాబు, జ్యోతుల రాము, చిన్నా లు ఉన్నారు. ఈ డివిజన్ నుండి బిజెపి తరపున టికెట్ ఆశిస్తూ చెక్కా రమేష్, కర్రి పాపారావు, చిట్నీని శ్రీనివాస్‌లు పోటీ పడుతున్నారు. ఈ డివిజన్ నుండి గతంలో కౌన్సిలర్‌గా వ్యవహరించిన సిరియాల చంద్రరావు వైసీపీ నుండి అభ్యర్థిగా ఉన్నారు. జనరల్ కేటగిరీకి చెందిన ఈ డివిజన్‌లో బిసి వర్గానికి చెందిన సిరియాల చంద్రరావుకు ఆ పార్టీ టికెట్టు కేటాయించింది. దీనికి కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సిఫార్సు వుందని ప్రచారం జరుగుతోంది. అయితే ఇరు పార్టీల నుండి ఏడుగురు అభ్యర్థులు పోటీ పడుతున్న ఈ డివిజన్‌లో టిడిపి పొత్తులో భాగంగా బిజెపి అభ్యర్థి ఎవరనేది సోమవారం తేలిపోనుంది. మరోపక్క టిడిపి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్యులు ఒక్కొక్కరు రెండేసి డివిజన్ల చొప్పున ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఐవిఆర్ ద్వారా ఆయా డివిజన్ల అభ్యర్థుల పేర్లతో పాటు మేయర్ పేరును ఖరారు చేసే ప్రయత్నం చేసిన అధికార తెలుగుదేశం పార్టీ జిల్లాలోని పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నగరపాలక సంస్థ ఎన్నికలను ప్రకటించిన మరు క్షణమే సర్వే చేయించింది. దీంతో మేయర్‌కు కావాల్సిన టికెట్టుకు డోకా వుండ దని, ఒకవేళ 1, 2 తగ్గినా ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీల ఎక్స్ అఫీషియా ఓట్లతో కాకినాడ నగరపాలక సంస్థను కైవసం చేసుకోవచ్చని అధికార తెలుగు దేశం పార్టీ భావిస్తోంది. ఇదిలా వుండగా కాకి నాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంక టేశ్వరరావు సోదరుడు వనమాడి సత్యనారా యణ కుమారులు వనమాడి ఉమా శంకర్ 14, వనమాడి శివప్రసాద్ 22 డివిజన్ల నుండి పోటీలో ఉండటం కొంత పార్టీలో చర్చనీయాంశమైన అంశంగా మారింది. కాగా ఈ నెల 16న హైకోర్టు కాకినాడ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇస్తుందని భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ జాతీయస్థాయిలోని కాకినాడ స్మార్ట్‌సిటీగా ప్రకటించిన తర్వాత అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలోను బిజెపి, తెలుగుదేశం పార్టీలు పొత్తుగా ఎన్నికల నగారా మోగిస్తుంటే దానికి ప్రత్యామ్నాయంగా వైఎస్సార్ సీపీ కూడా బలమైన అభ్యర్థులను అధికార పార్టీ నుండి వలసల ద్వారా రప్పించి, పోటీలో నిలబెడుతుంది. దీంతో కాకినాడ నగర ఎన్నికలు నువ్వా-నేనా అన్నట్టుగా జరిగే అవకాశాలున్నాయి.

బిజెపి ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ



విజయవాడ, సూర్య బ్యూరో : భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమం 75 సంవత్సరాలు పూర్తి చేసు కున్న సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం సంద ర్భంగా భారీ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా యువ మోర్చా నాయకులు రవి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం ప్రాణం పోసుకుని ఈనాటికి 75 ఏళ్లయిన సందర్భంగా యువతలో ఉద్యమస్ఫూర్తిని రగిలించడానికి ఈరోజు తిరంగా యాత్ర చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రసాద్, అడపా నాగేంద్రం, ఉత్తమ్‌చంద్ భండారిలుపాల్గొన్నారు.

'ఉపకార వేతనాన్ని వెంటనే పెంచాలి'

విజయవాడ, సూర్యబ్యూరో : సీనియర్ రెసిడెంట్స్ ఉపకార వేతనాన్ని పదిహేను శాతం పెంచుతూ తెలంగాణ ప్రభు త్వం జి ఓ 148 ఇవ్వటం జరగ్గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం సీనియర్ రెసి డెంట్‌ల సేవలు పొందుతూ కూడా వారికీ చాలీచాలని ఉపకార వేత నాన్ని ఇస్తున్నారని ఏపీసీసీ డాక్టర్స్ సెల్ కో చైర్మన్ డాక్టర్ నాగ రాధాకష్ణ ఆదివారం ఎపీసీసీ కార్యాలయం నుండి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ చేసిన తరువాత వారితో చాకిరీ చేయించుకుంటూ సరైన మొత్తం చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి స్టైపెండ్‌ను పెంచి క్రమం తప్పకుండా ప్రతి నెలా చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. స్టైపెండ్ కోసం వారు ఉద్యమించి ప్రజలు ఇబ్బందులు పడకముందే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



జీవిత పరమార్థం బోధించే జన్మాష్టమి



ఇతిహాసాలలో ఎనిమిదవ అవతారము శ్రీకృష్ణుడు. ఆయన జన్మదినమే కృష్ణాష్టమి . దీనినే జన్మాష్టమి లేదా గోకులాష్టమి లేదా అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు. శ్రీకకృష్ణుడు దేవకి వసుదేవులకు దేవకి ఎనిమిదో గర్భంగా శ్రావణ మాసము కృష్ణ పక్షమి, అష్టమి తిథిన చెరసాలలో జన్మించాడు. చాంద్రమాన పంచాగం ప్రకారం శ్రావణ బహుళ అష్టమి తిథి. ఇదే రోజు రోహిణి నక్షత్రము కొద్ది సేపు చంద్రాయుక్తమై ఉంటుంది. గో అంటే ఆవు అని సామాన్యార్థం. గోపాలకుడు అంటే గోవులను కాసే వ్యక్తి. వాస్తవానికి గో అనే శబ్దానికి కిరణాలు, భూమి, పంచభూతాలు, జీవుడు అనే అర్థాలున్నాయి. వాటిని పాలించే వాడు కాబట్టి కృష్ణుడు గోపాలకృష్ణయ్య అయ్యాడు. నమ్మిన వారికి కొండంత దేవుడు, అర్థం చేసుకున్న వారికి లీలాస్వరూపుడు, పట్టపురాణులకు ప్రేమమూర్తి, పదహారువేలమంది గోపస్త్రీలకు ఇష్టసఖుడు.

నేడు కృష్ణాష్టమి

కృష్ణావతారంలో ముఖ్యోద్దేశ్యం.. కృష్ణావతారం ముఖ్యోద్దేశం దుష్టశిక్షణ, శిష్టరక్షణ మాత్రమే కాదు. గోపికలను ఆధ్యాత్మిక ప్రేమలో తపింపచేశాడు. ఏ మనిషిలోనూ మంచి చెడులు విడివిడిగా ఉండవని, సత్వ, రజః తమో గుణాల ఆధారంగానే నిర్మితమైన వ్యక్తిత్వం అవసరాను గుణంగా మారుతుంటుందని నిరూపించాడు. కురుపాండవ యుద్ధంలో దుఃఖపూరితుడైన అర్జునునికి గీతోపదేశం చేసి స్వధర్మంతో కార్యోన్ముఖుని కావించాడు. తానుగా యుద్ధం చేయకపోయినా, ఎటువంటి ఉన్నత పదవులూ నిర్వహించకపోయినా, నమ్మిన వారికి అండగా ఉండి, ఉత్తమ కథానా యకునిగా, స్నేహశీలిగా, ప్రేమమూర్తిగా, అందరికీ ఆదర్శంగా నిలిచాడు. కృష్ణాష్టమి పర్వదినం నాడు శ్రీ కృష్ణుని బోధామృతమైన గీతా పఠనం అత్యంత ఆవశ్యకము. కృష్ణుని పూజించడమే కాదు. ఆయనలోని కొన్ని మంచి లక్షణాలయినా అలవరుచుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే ఆయన దివ్యానుగ్రహాన్ని పొందగలం.

ముస్లిం ఇంట శ్రీకృష్ణాష్టమి

అన్ని మతాలు ఒకటే అన్న సామరస్యభావం నాయకుల్లో ఉందోలేదోకానీ, ప్రజల్లోమాత్రం నిం డుగా ఉన్నదనడానికి ఓ చక్కటి తార్కాణం ఇది. ముస్లీం ఇంట మూడు దశాబ్దాలుగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతు న్నాయి. మతసామరస్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిస్తున్న సంఘ టన ఇది. అహ్మద్ అతనిభార్య, ముగ్గురు పిల్లలు తమ ఇంటజరిగే వేడుకల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొనడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. శ్రీకృష్ణుడి జన్మదినమైన అష్టమిరోజున కృష్ణుడి లీలలకు సంబంధించిన బొమ్మలను, చిత్రపటాలను ఇంట్లో ఉంచుతారు. బొమ్మలతో సెట్టింగ్స్ వేస్తారు. చిన్ని కృష్ణుడి విగ్రహాన్ని ఊయలలోఉంచి లాలిపాటలు పాడుతారు. కొత్తగా ఎవరైనా కృష్ణాష్టమి రోజున వాళ్ల ఇంటికి వెళ్ళిచూస్తే, ఇవ్వాళే నల్లనయ్య పుట్టాడేమో అన్నట్టుగా ఉంటుంది అక్కడి వాతావరణం. పాలు, వెన్నలు నైవేద్యంగా పెట్టడం, భక్తిపాటలు పాడటం, ఒకరినొకరు బహుమతులను పంచుకోవడం వంటి వేడుకలతో ఆ ఇళ్లు బృందావనంలా మారిపోతుంది. మొత్తానికి దేశవ్యాప్తంగా నల్లనయ్య, చల్లనయ్య, వెన్నదొంగ, భక్తమానస చోరుడైన దేవకీ సుతుని జన్మదిన వేడుకలు జరుపుకొని ఆబాల గోపాలం తరిస్తుంది.

గోపాలుని లీలలు అనంతం.. పరిపూర్ణావతారమైన కృష్ణావతారంలో శ్రీకృష్ణుడు అవతరించినది మొదలు నిర్యాణం చెందేవరకు ఎనలేని లీలలు చూపాడు. కృష్ణుని లీలలన్నీ మానవాతీతమైనవి. పరమాం పూరితమైనవీను. నోటిలో పదునాలుగు భువన భండాలను చూపి దేవత్వాన్ని చాటుకు న్నాడు. గోవర్థన గిరిని చిటికెన వేలితో నిలబెట్టి, దేవతలందరి వందనాలు అందుకున్నాడు. లోకకం టకునిగా తయారైన తన మేనమామను సైతం మట్టుపెట్టి, దుష్ట శిక్షణలో తన వారు పరులు అనే బేధం లేదని నిరూపించుకున్నాడు. అహంకారంతో అతిశయిస్తూ, గోవులను, గోపబాలురను భయభ్రాంతులను చేస్తున్న కాళీయుడి తలపై మర్దించి అతని అహంకారాన్ని అణచాడు. రామావతా రంలో ఏకపత్నీ వ్రతంలో తీర్చలేకపోయిన ఋషుల కోర్కెలను కృష్ణావతారంలో గోపాల కృష్ణునిగా తీర్చాడు. ద్రౌపదీ వస్త్రాపహరణంలో ఆమె మాన సంరక్షణ చేసి ఆశ్రిత వత్సలుడయ్యాడు. కురుక్షేత్ర యుద్ధాన్ని నివారించేందుకు రాయబారం నెరపాడు. సత్యభామ వద్ద ఉన్న కొండంత ధనం కన్నా, రుక్మిణీదేవి మనసు లోని అచంచలమైన భక్తి విశ్వాసాలే గొప్పవని నిరూపించాడు. కర్తవ్య నిర్వహణను మించిన ధర్మాచరణ మరొకటి లేదని విశ్వరూప ప్రదర్శనతో అర్జునునికి గీతామృతాన్ని బోధించి జగద్గురువయ్యాడు.

శ్రీకృష్ణాష్టమి వ్రత విధానం కృష్ణాష్టమి రోజు సూర్యోదయానికి ముందే లేచి, తలస్నానము చేసి పసుపు రంగు బట్టలు ధరించాలి. తర్వాత ఇంటిని పూజామందిరమును శుభ్రం చేసుకోవాలి. గడపకు పసుపుకుంకుమ, గుమ్మానికి తోరణాలు, పూజా మందిరములో ముగ్గులు వేయాలి. పూజకు ఉపయోగించే పటములకు పసుపు, కుంకుమ గంధము,తులసి మల ,శ్రీకృష్ణుడి చిత్రపటం లేదా విగ్రహం, పుష్పాలతో అలంకరించుకోవాలి. అంతకు ముందే పూజకు పసుపు రంగు అక్షింతలు, కదంబ పుష్పములు, సన్నజాజులతో మాల, నైవేద్యానికి పానకం, వడ పప్పు, కమలాకాయలు వంటివి సిద్ధం చేసుకోవాలి. తదనంతరం పూజను ప్రారంభించాలి. కంచుదీ పంలో కొబ్బరినూనె పోసి, ఐదు దూది వత్తులతో దీపమెలిగించాలి. దీపారాధనకు ఆవునేతితో హారతి సిద్దం చేసుకోవాలి. నుదుటన సింధూరం ధరించి, తూర్పు దిక్కునకు తిరిగి ఓం శ్రీ కృష్ణ పరబ్రహ్మణే నమః అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. ఇంకా పూజా సమయంలో బాలకృష్ణ స్తోత్రమ్, శ్రీకృష్ణ సహస్ర నామాలు, శ్రీమత్భావగతములతో శ్రీకృష్ణున్ని స్తుతిస్తే మంచిది. ఆ తరువాత శ్రీకృష్ణునికి నైవేద్యాలు సమర్పించి, దీపారాధన గావించి పూజను ముగించాలి. అంతేకాకుండా కృష్ణాష్టమి రోజున బంగారంతోగానీ, వెండితోగానీ చంద్రబింబాన్ని తయారు చేసి, వెండి లేక బంగారు పాత్రలలో ఉంచి పూజించి అర్ఘమిస్తే సకల కోరికలు తీరతాయని భవిష్యోత్తర పురా ణం ద్వారా తెలుస్తుంది. ఈ పుణ్యదినాన భీష్ణాచార్యులను పూజిస్తే సకల పాపాలు తొలిగిపోతాయని మహర్షులు చెప్పినట్లుగా ఉంది. సంతానం లేని వారు, వివాహం కావాల్సిన వారు బాల కృష్ణుడిని సంతాన గోపాల మంత్రంతో పూజిస్తే మనోభీష్టం ఫలిస్తుంది.

దేశవ్యాప్తంగా జన్మాష్టమి వేడుకలు... దేశంలోని వివిధ రాష్ట్రాలలో పండుగ నిర్వహించే విధానంలో తేడాలున్నా... ప్రధానంగా కృష్ణాష్టమి నాడు భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంకాలం కృష్ణ విగ్రహాన్ని ఊరేగించి, తర్వాత ఉయాల కట్టి అం దులో శ్రీకృష్ణ విగ్రహాల్ని పడుకోబెట్టి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు పాడతారు. శ్రావణ మాసంలో లభించే పళ్ళు,అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యం పెడతారు. పూజ పూర్తయ్యాక భాగ వతాది గ్రంథాలలోని కృష్ణలీలా ఘట్టాలని పఠిస్తారు. పుర వీధుల్లో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడతారు. అందుకే ఈ పండుగని 'ఉట్ల పండుగ' లేదా 'ఉట్ల తిరునాళ్ళు' అని పిలుస్తారు. మరోవైపు భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతం ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పింది. కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినమని అందులో వివరించబడి ఉంది. ఈ రోజు చిన్నికృష్ణునికి ఇష్టమైన పాలు, పండ్లు, వెన్న, మీగడ మొదలైన వాటిని నైవేద్యంగా సమర్పిస్తే కోరికలు నెరవేరతాయని ప్రతీతి. మరోవైపు.. దర్మానికి హాని కలిగిన పుడు, చెడు చేతిలో మంచి బాధపడుతున్న ప్పుడు దుష్టులను శిక్షించి సాదు, సజ్జనులను రక్షించి, పరిస్థితులను చక్కబెట్టేందుకు ఎదో ఒక రూపంలో ఇల ప్వ అవతరి







స్తానని చెప్పాడు భగవంతుడు. తాను చెప్పిన మాటను నెరవేర్చేందుకే కృష్ణావతారం ఎత్తాడు. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం చేశారు కృష్ణ భగవానుడు. మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన. మహా భాగవతం కథలను విన్నా... దృశ్యాలను తిలకించినా జీవితానికి సరిపడా విలువలెన్నో బోధపడతాయి. ఆ కావ్యం ఇప్పటి పరిస్థితులకు ఒక మార్గదర్శకంగా ఉండటం కృష్ణ మహోన్నత వ్యక్తిత్వానికి, ఆయన లీలలకు అద్దం పడుతోంది. ద్వాపరయుగంలో జన్మించిన కృ ష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన్ను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తున్నారు. వివిధ రూపాల్లో, సంప్రదాయాలతో భక్తిప్రపత్తులతో కృష్ణుడిని కొలుస్తున్న ఆయా రాష్ట్రాల వారి సంస్కృతి, సంప్రదాయాలు మన భారతీయ సంస్కృతికి విలక్షణమైన అందాన్ని తెస్తున్నాయని చెప్పక తప్పదు.

గుజరాతీ సంప్రదాయంలో.... గుజరాత్ రాష్ట్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని శ్రీజగదాష్టమి అని పిలుస్తారు. గుజరాతీల సంప్ర దాయం ప్రకారం కృష్ణాష్టమి పండగకు నాలుగురోజుల ముందు నుంచే పూజలు ప్రారంభమవుతాయి.. పండగకు నాలుగురోజుల ముందు వచ్చే చవితినాడు ఆవు, లేగదూ డలను ఇంటికి ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేస్తారు. బాజ్రీ పిండితో రొట్టెలను తయారు చేసి వాటికి ఆహా రంగా అందిస్తారు. కృష్ణుడు గోవులను సంరక్షించే వారు అయినందున గుజరాతీలు గోవులను ప్రత్యే కంగా పూజిస్తారు. అన్నం తిన కుండా రెండరో జుల ముందుగానే మిఠాయిలు, ఫలహారాలు, కార, చుడువా, గారెలు వంటివి తయారుచేసు కుంటారు. ప్రత్యేకంగా మిన పప్పు పిండితో తయారుచేసిన అడిది పేరుగల మిఠాయిలు తయారుచేస్తారు. ఒకరోజు ముందు నుంచే ఉపవాసదీక్షలు పాటిస్తారు. అన్నం స్వీకరించకుండా ఫలహారాలు తీసుకుంటారు. రాత్రి దోసకాయ గుజ్జును తీసి వేసి దాంట్లో కృష్ణుడి విగ్రహాన్ని ఉంచుతారు. దాన్ని తల్లి గర్భంగా భావించి పూజలు చేస్తారు. రాత్రి 12 గంటల తర్వాత అందులోంచి విగ్రహాన్ని తీసి పాలతో అభిషేకం చేసి కృష్ణుడి విగ్రహానికి హారతి పూజ నిర్వహిస్తారు. అనంతరం పూయలలో ఉంచి భక్తి, జోలపాటలతో భజన నిర్వహిస్తారు. వెన్న, పెరుగు, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసిన పదార్థాలను అలంకరించిన కుండలో ఉంచి మహిళలు, యువతీ, యువకులు అందరూ కలిసి ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. దీనినే దహీ హండీ అని పిలుస్తారు. అదే సమ యంలో స్త్రీలు దాండియా నృత్యాలు చేయగా, పురుషులు ప్రత్యేక నృత్యప్రద ర్శనలతో వేడుక జరుపుకుంటారు. చిన్నా రులను కృష్ణుడి వేషధారణలో అలంక రించి దహీహండీని పగులగొట్టిస్తారు. మరు నాడు ఉదయం వంటలు చేసుకొని భోజనాన్ని ఆరగిస్తారు.

సామూహిక వేడుకలు యాదవుల ప్రత్యేకం కృష్ణుడు అనగానే యాదవులు గుర్తుకొస్తారు. ఎందుకంటే ఆయన యదుకుల నందనుడు. ఆ కులస్థులు కృష్ణుడిని కులదైవంగా కొలుస్తూ వస్తున్నారు. కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లో, పట్టణాల్లోనూ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యాదవులు అత్యధికులు కలిగిన గ్రామాలు కృష్ణాష్టమికి ఒకరోజు ముందు నుంచే ఈ వేడుకల్లో మునిగి పోతాయి. అర్ధరాత్రి నుంచి వేడుకలను ప్రారంభిస్తారు. కృష్ణాష్టమి రోజున పూయలలో కృష్ణుడి ప్రతిమను ఉంచి కనులపండువగా జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా అలంకరిస్తారు.

కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ముగింపుఘట్టంగా నిర్వహించి సహ పంక్తి భోజనాలతో వేడుకలను ముగిస్తారు.







పట్టాలు తప్పిన బన్నీ చిత్రం?

అల్లు అర్జున్ నటించిన దువ్వాడ జగన్నాథం (డీ. జె) చిత్రం వసూళ్ల పరంగా కాసులు పండించినా సినిమా మాత్రం యావరేజ్ స్థాయిలో నిలిచింది. ఈ డిప్రెషన్ లో ఉన్న బన్నీ తదుపరి చిత్రం లింగుస్వామి దర్శకత్వంలో నిర్మాత కె. ఇ. జ్ఞానవేల్ రాజా తెలుగు తమిళ భాషల్లో సినిమా ఒకటి ప్రకటించిన సంగతి తెలిసిందే. చెన్నైలో అట్టహాసంగా ఈ చిత్ర ప్రారంభోత్సవమూ జరిగింది. నిజానికి, దువ్వాడ జగన్నాథమ్ తర్వాత బన్నీ, లింగుస్వామి సినిమా షూటింగ్ మొదలవ్వాలి. కానీ, వక్కంతం వంశీ దర్శకత్వంలో నా పేరు సూర్య– నా ఇల్లు ఇండియా అనే సినిమా ను ప్రారంభించారు బన్నీ. మరోపక్క విశాల్ హీరోగా తమిళంలో సండైకోళి2 ప్రారంభించారు లింగుస్వామి. పందెం కోడికి సీక్వెల్ గా చేస్తున్న సినిమా ఇది. ముందుగా ప్రకటించిన బన్నీ సినిమా సంగతేంటి? అంటే... తప్పకుండా ఆ సినిమా ఉంటుంది. వక్కంతం వంశీ తో సినిమా పూర్తయిన తర్వాత బన్నీ ఆ సినిమా స్టార్ట్ చేస్తారు. నిజం చెప్పాలంటే అల్లు అర్జున్ చెన్నై ఎక్స్‌ప్రెస్ ఈ టైమ్‌కి ఎక్కేయాలి. ఒకానొక దశలో అసలు చెన్నై ఎక్స్‌ప్రెస్‌ను క్యాన్సిల్ చేశారనే మాటలూ వినిపించాయి. కానీ ఆ వార్తలు అవాస్తవమని తేల్చారు యూనిట్.



అతి త్వరలో సచ్చిందిరా గొర్రె చిత్రం

ముంబాయికి చెందిన ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ సోహం రాక్ స్టార్ ఎంటర్టైన్మెంట్ మరియు హైదరాబాద్ కు చెందిన ఎంటర్టైన్మెంట్ స్టూడియో సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'సచ్చిందిరా గొర్రె'. శ్రీనివాస్ రెడ్డి, తిళ్ళు, వేణు, జబర్దస్త్ రాకేష్, శివారెడ్డి, చిత్రం శీను, సత్యవతి, మంగ్లీ, కోట శంకర్ రావు, లాంటి ప్రముఖ తారాగణం నటిస్తోన్న ఈ సినిమా కు దర్శకుడు శ్రీధర్ రెడ్డి యుార్వ. ఒక ప్రముఖ హీరోయిన్, కూడా ఈ సినిమా లో ముఖ్య పాత్ర పోషించనుంది. ఈ మధ్యనే ముహూర్తపు కార్యక్రమాలను జరువుకున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ షూటింగ్ జరువుకుంటోంది. నవంబర్ కల్లా షూటింగ్ ముగించుకొని నవంబర్ డిసెంబర్ మధ్యలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఈ చిత్ర దర్శక నిర్మాతలు తెలియచేసారు.

శ్రీనివాస్ రెడ్డి, తిళ్ళు, వేణు, జబర్దస్త్ రాకేష్, శివారెడ్డి, తదితర నటీనటులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు: శ్రీధర్ రెడ్డి, వై. దీపక్ ముఖత్(సోహం రాక్ స్టార్ ఎంటర్టైన్మెంట్), యన్ యమ్. షా షా(ఎంటర్టైన్మెంట్ స్టూడియో), అసోసియేటెడ్ ప్రొడ్యూసర్: అపర్ణా కిటే, డీ ఓ పి: రమణ సాల్వా, సంగీతం: సంతోష్ కుమార్, పాటలు: కాశర్ల శ్యామ్, ఎడిటింగ్: శుభాస్కర్, ఆర్ట్: కిరణ్ కుమార్, కొరియోగ్రఫీ: కపిల్, సోనీ, విజయ్, హరి, కాస్ట్యూమ్స్: వెంకట్.

మరో సారి అమ్మగా మీనా



చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఎంట్రీ ఇచ్చి తరువాత టాప్ హీరోల సరసన హీరోయిన్ గా నటించిన మీనా, శ్రీవాస్, బెల్లంకొండ సినిమాలో హీరోగా తల్లిగా నటిస్తోంది. అయితే హీరో చిన్నప్పటి సీన్స్ వరుకు మాత్రమే మీనా కనిపిస్తుందా..? లేక సినిమా అంత కనిపిస్తుందా అన్న విషయం తెలియాల్సి ఉంది. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో హీరో తల్లి పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుందట. కీలకమైన ఆ సీన్స్ భారీ బడ్జెట్ తో రూపొంది స్తున్నారని ప్రచారం జరుగుతోంది.జయ జానకి నాయక సినిమాతో మంచి విజయం సాధించిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్, తన నెక్ట్స సినిమాను కూడా వేగంగా పూర్తి చేస్తున్నాడు. కమర్షియల్ చిత్రాల దర్శకుడు శ్రీవాసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లో నటిస్తున్నాడు. ప్రస్తుతం సెట్స్ మీద ఉన్న ఈ సినిమా వివరాలు త్వరలో వెలువడనున్నాయి.



రెబల్ రేంజ్

బాహుబలి హీరోగా ప్రభాస్ పేరు ఇంటర్నేషనల్ మార్కెట్ లో ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తుంది. ఈ సినిమా మన దేశంలో ఎంత ఘనవిజయం పొందిందో అలాగే విదేశాలులో కూడా విడుదలై గొప్ప విజయం సాదించింది. ఈ సినిమాతో ప్రభాస్ కు ఉన్న క్రేజ్ రెట్టింపు అయ్యింది అనే చెప్పాలి. ఇప్పుడు ప్రభాస్ చేయబోతున్న ప్రతీ సినిమా అన్నీ బాషల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకొని చేయవలిసి ఉంది. బాహుబలి సినిమాతో కొన్ని ఇంటర్నేషనల్ బ్రాండ్లు ప్రభాస్ ని ప్రచారకర్తగా తీసుకున్నాయి. ఇప్పుడు అలాగే తన తాజా సినిమా ఆన్ లైన్ ప్రసారంకు సంబందించిన రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ మొత్తం పెట్టి కొనుక్కోంది. యువి క్రియేషన్స్ వాళ్ళు నిర్మిస్తున్న సాహో సినిమాను నెట్ ఫ్లిక్స్ సుమారుగా 50 కోట్లు పెట్టి రైట్స్ దక్కించుకొంది అని టాక్. ఈ సినిమాను తెలుగు - హిందీ - తమిళ్ - మలయాళం లో విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమానే కాదు ప్రభాస్ నటించిన బాహుబలి సినిమాను కూడా రికార్డు స్థాయిలో 4 మిలియన్ యూఎస్ డాలర్లు పెట్టి కొన్నది నెట్ ఫ్లిక్స్. అయితే సాహో రైట్స్ గురించి ఇంకా అధికారికంగా ప్రకటన ఇవ్వకపోయినా తొందరలో ఒక ఒప్పందానికి వచ్చే అవకాశం ఉంది. సుజీత్ డైరక్షన్లో వస్తున్న సాహో సినిమాలో హీరోయిన్ గా బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ చేసే అవకాశం ఉండవచ్చు అని చెబుతున్నారు.

150 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న సాహో సినిమా వచ్చే ఏడాది వేసవి కాలంలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాను ఒకే సారి అన్నీ బాషలులోనూ విడుదల చేస్తున్నారు. సాహో షూటింగ్ జరుగుతున్నా ఇంకా హీరోయిన్ ఎవరు అనేది ఒక నిర్ణయానికి రాకపోవడం ప్రభాస్ అభిమానుల ఆందోళన పడుతున్నారు. ఈ సినిమా నేషనల్ లెవెల్లో విడుదలకాబోతుంది కాబట్టి బాలీవుడ్ హీరోయిన్ కోసం చూస్తున్నట్లు తెలుస్తుంది.

అమ్మాయిలు అవి చూస్తే తప్పేంటంటున్న కృతి



హిందీలో చిన్న హీరోలతో జోడికట్టి గుర్తింపు తెచ్చు కున్న భామ కృతిసనన్. తెలుగులో మాత్రం సూపర్ స్టార్ మహేష్ బాబు 1 నేనెక్కడినే, దోచేయ్ వంటి భారీ సినిమాలలో ఛాన్స్ కొట్టేసింది. అయినా తన అదృష్టం ఎంబాగోలేక ఇక్కడ కూడా అవకాశాలు కరువవడం మొదలయ్యాయి. ప్రస్తుతం మళ్ళీ బాలీవుడ్ వైపు అడుగులు వేసి కొత్త తరహాలో ఓ రొమాంటిక్ కామెడీ కథతో కూడిన బరేలీ కి బార్ఫి అనే చిత్రం లో నటించింది. ఈ నేపథ్యం లోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ హీరోయిన్ ప్రస్తుత రోజు ఎల్లో మహిళల పట్ల చూపిస్తున్న ఒక చిన్నచూపు తనకు నచ్చడం లేదని ముఖ్యంగా అమ్మాయిలు కాస్త మోడెర్న్‌గా కనిపించినా తప్పుగా చూస్తున్నారని చెప్పింది. అంతే కాకుండా టాటూలు వేసుకున్న మహిళలను సిగరెట్, మద్యం అలవాట్లు ఉన్న మహిళలను పూర్తిగా క్యారెక్టర్ లేదని నిర్ధారించడం సరైనది కాదని చెబుతోంది. అయితే ఈ అమ్మడు ఇలా మాట్లాడటానికి కారణం 'బరేలీ కి బార్ఫి' అనే సినిమాలో అలాంటి పాత్రలోనే నటించిం దట. ఆ సినిమాలో సిగరెట్ కూడా తాగిందట. దీంతో మహిళ లకు చెడు అలవాట్లు ఉన్నంత మాత్రాన తప్పు గా చూడవద్దని హిత బోధ చేస్తోంది. ప్రస్తు తం ఈ ఘాటు కామెంట్స్ చర్చనీ యాంశంగా మారాయి.



ప్రతి ఏటా పెళ్లిచేసుకుంటా

ఎవరి జీవితం లోనైనా పెళ్లి ఒక్కసారే వస్తుంది. కానీ ఒక బాలీవుడ్ హీరోయిన్ తన పెళ్లి బంధం బలపడటానికి ప్రతి ఏటా పెళ్లి చేసుకోవాలి అని భావిస్తుందట ఎవరా అనుకుంటున్నారా వివరాల్లోకి రండి మరి....సెక్సీ హీరోయిన్ గా పేరు తెచ్చుకున్న బిపాసా బసు ఈమధ్య ఎలోన్ చిత్రంలో జంటగా నటించిన కరణ్ సింగ్ గ్రోవర్‌ను గత ఏడాది లో పెళ్లి చేసుకుంది. అయితే ముంబయిలో గురువారం జరిగిన ది గ్రేట్ ఇండియన్ వెడ్డింగ్ వుస్తకావిష్కరణ కార్యక్రమానికి బిపాసా ముఖ్య అతిథిగా వెళ్లింది. అక్కడ మీడియా ముందు మాట్లాడుతూ నా పెళ్ళికి అన్నీ పనులు నేనే దగ్గరుండి చూసుకోవాలిసి వచ్చింది. చాల హడావిడిగా జరిగిపోయింది. వైభవంగా జరగటం కోసం అందరికీ గుర్తుండి పోయేవిదంగా చేయడానికి కష్టపడవలిసి వచ్చింది. అలా చేయాలి అంటే చాలా మంది సహకారం కావాలి బోలెడు టైమ్ ఖర్చు అవుతుంది అని చెప్పింది. నాకు అయితే మళ్ళీ మా పెళ్లి చేసుకోవాలి అనిపిస్తుంది. ఒకసారి ఏంటి కుదిరితే ప్రతీ ఏటా మా పెళ్లి చేసుకుంటాను అని చెబుతోంది. పెళ్ళైనప్పటి నుండి ఆమె భర్త కరణ్ సింగ్ గ్రోవర్ తో గడిపిన చాలా మధుర అనుభవాలను ఆమె అభిమానులతో సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంటుంది. బిపాసా బసు, కరణ్ సింగ్ గ్రోవర్ పెళ్లి కి ఒక ఏడాది పూర్తికావడంతో ఆ మధ్య ఒక వీడియోను కూడా విడుదల చేసింది బిపాసా.

హిందీ టెంపర్...

జూనియర్ ఎన్టీఆర్ కెరీర్ ను మలుపు తిప్పిన సినిమా టెంపర్. అప్పటిదాకా రొటీన్ సినిమాలతో వరుస ఫ్లావులు ఎదుర్కొంటూ స్టార్ల రేసులో బాగా వెనుకబడిపోయి ఉన్న ఎన్టీఆర్ ఈ సినిమాతో మళ్లీ తనేంటో రుజువు చేసుకున్నాడు. పెర్ఫామెన్స్ పరంగా ఎన్టీఆర్ కెరీర్ బెస్ట్ సినిమాల్లో ఒకటిగా నిలవడమే కాదు.. అతడికి చాలా కాలం తర్వాత మంచి కమర్షియల్ సక్సెస్ కూడా అందించింది టెంపర్. పొరుగు భాషల్లోకి కూడా వెళ్లగల బలమైన.. యూనివర్శల్ కంటెంట్ ఉండటంతో ఈ చిత్రంపై బాలీవుడ్.. కోలీవుడ్ వాళ్లు కన్నేశారు. తమిళంలో విశాల్ హీరోగా ఈ సినిమాకు సన్నాహాలు జరుగుతుండగా.. హిందీలో ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కబోతోంది కూడా.

శ్వఅందరూ అనుకున్నట్లుగానే రణ్వీర్ సింగ్ హిందీలో దయా పాత్ర పోషించబోతున్నాడు. మాస్ మసాలా సినిమాలు తీయడంలో దిట్ట అయిన రోహిత్ శెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తాడు. వీళ్లిద్దరి కాంబినేషన్లో రాబోయే తొలి సినిమా ఇదే. చిన్న స్థాయి హీరోగా కెరీర్ ఆరంభించిన రణ్వీర్.. గత కొన్నేళ్లతో పెద్ద స్థాయికి చేరుకున్నాడు. చివరగా అతను నటించిన బాజీరావు మస్తానీ పెద్ద హిట్టయింది. అతడి స్టేచర్ ను పెంచింది. ఇక రోహిత్ శెట్టి అనగానే గోల్ మాల్ లాంటి మాస్ మసాలా సినిమాలు గుర్తుకొస్తాయి. వీళ్లిద్దరికీ టెంపర్ సరైన సినిమానే అవుతుందని అంచనా వేస్తున్నారు. మరి పూరి–ఎన్టీఆర్ ల మ్యాజిక్ ను ఈ జోడీ రిపీట్ చేస్తుందేమో చూడాలి. వచ్చే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది.







ఈసారి కృష్ణాష్టమికి ఎన్నో ప్రత్యేకతలు

న్యూఢిల్లీ: కన్నయ్య జన్మదిన మంటే జగమంతా వేడుకే. త్రేతా యుగంలో కంసాది రాక్షసుల భారం మోయలేక భూదేవి బ్రహ్మ, విష్ణువు, శివుడు తదితర దేవతలకు మొరపెట్టుకుందట. అప్పుడే విష్ణుమూర్తి కృష్ణావతారం దాల్చి భువిపై జన్మించాడని చెబుతారు. దేవకీ వసుదేవులకు ఎనిమిదో సంతానంగా చెరసాలలో పుట్టాడు కృష్ణుడు. పురాణాల ప్రకారం శ్రీముఖనామ సంవత్సరం శ్రావణ బహుళ అష్టమినాడు రోహిణీ నక్షత్రంలో అర్ధరాత్రి జన్మించాడు కృష్ణుడు. కృష్ణాష్టమిని నిర్ణయించేటప్పుడు కొందరు తిథికీ, మరికొందరు నక్షత్రానికీ ప్రాధాన్యం ఇస్తారు. తిథి మాత్రమే ఉంటే కృష్ణాష్టమిగా, నక్షత్రం కూడా కలిస్తే శ్రీకృష్ణజయంతిగా వ్యవహరించాలని ధర్మశాస్త్ర గ్రంథాల్లో కూడా పేర్కొన్నారు. అందులోనూ సోమవారం కానీ, బుధవారం కానీ కృష్ణాష్టమి వస్తే.. మరింత విశేషమని ధార్మిక గ్రంథాల్లో చెప్పారు. కృష్ణాష్టమి రోజు స్వామిని సేవిస్తే మంచి ఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందులోనూ సోమ లేదా బుధ వారం రోజు కృష్ణాష్టమి వస్తే.. మరింత విశేషమట. ఆ రోజు స్వామిని అర్చిస్తే చతుర్విధ పురుషార్థాలు ప్రాప్తిస్తాయనీ, అన్ని పనుల్లో విజయం కలుగుతుందనీ నమ్మకం. ప్రస్తుతం వచ్చిన కృష్ణాష్టమి కూడా సోమవారమే కావడం గమనార్హం.

జై హింద్ నినాదానికి రూపకర్త హైదరాబాదీనే

- నేతాజీ సుభాష్ చంద్రబోస్‌తో ముడిపడిన జైహింద్
- సైనికులు పలకరించుకునే టప్పుడు జై హింద్ అనేవారు
- భాగ్యనగరానికి చెందిన జైనుల్ అబిదీన్ హసన్ జైహింద్ నినాదకర్త

న్యూఢిల్లీ: భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన వారిలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఒకరు. ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ) పేరిట సైన్యాన్ని ఏర్పాటు చేసి బ్రిటిషర్లపై తిరుగుబాటు చేసిన నాయకుడాయన. ఆయన పేరు చెప్పగానే జై హింద్ నినాదం స్ఫూరణకు వస్తుంది. భారత సైనికులు ఒకరికొకరు ఎదురు పడినప్పుడు జై హింద్ అని పలకరించుకునేవారు. నేతాజీ కారణంగానే ఈ నినాదం ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది. కానీ చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. జైహింద్ నినాదాన్ని ముందుగా ఇచ్చింది సుభాష్ చంద్ర బోస్ కాదు.. మన హైదరాబాద్‌కు చెందిన ఓ ముస్లిం. భాగ్యనగరానికి చెందిన జైనుల్ అబిదీన్ హసన్ అనే వ్యక్తి సుభాష్ చంద్ర బోస్‌తో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. ఆయన జర్మనీలో చదువుకుంటున్న సమయంలో నేతాజీతో పరిచయం ఏర్పడింది. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు బ్రిటిషర్లను దేశం నుంచి పార్రదోలడానికి సుభాష్ చంద్రబోస్ జర్మనీ సాయం తీసుకోవాలని భావించాడు. అక్కడి భారత యుద్ధ ఖైదీలతో మాట్లాడి వారిలో ఉత్తేజం నింపాడు. సుభాష్ ప్రసంగం విన్న అబిదీన్ కూడా ఆయనతో చేతులు కలిపాడు. ఇండియాకు వచ్చేసి ఐఎన్ఏలో మేజర్‌గా పని చేశాడు. బర్మా నుంచి భారత సైన్యాన్ని నడిపాడు. ఆ సమయంలోనే సైనికులు ఒకర్నొకరు పకలరించుకోవడానికి ఏదైనా పదం సూచించమని నేతాజీ అబిదీన్‌ను కోరగా.. జై హింద్ నినాదాన్ని సూచించారాయన. తర్వాత కూడా మన దేశ జాతీయ నినాదంగా జై హింద్ రూపొందింది. సివిల్ సర్వెంట్‌గా పని చేసిన నరేంద్ర లూథర్ రాసిన పుస్తకంలో ఈ వివరాలను పొందుపరిచారు. అబిదీన్ తండ్రి హైదరాబాద్ కలెక్టర్‌గా పని చేశారు.







అత్యంత సూక్ష్మ స్వర్ణ త్రివర్ణ పతాకం సిద్ధం

ఉదయ్‌పూర్: భారతదేశ 70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ నివాసి, సూక్ష్మ కళాశిల్పి ఇక్బాల్ సక్కా ఒక అద్భుతాన్నిమన ముందుంచారు. దేశం యావత్తూ ఆగస్టు 15న ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకోనుంది. ఈ నేపథ్యంలో ఇక్బాల్ ఘనత కూడా అందరికీ తెలియనుంది. ఇక్బాల్.. ప్రపంచంలోనే అత్యంత సూక్ష్మమైన స్వర్ణ తివర్ణ పతాకాన్ని రూపొందించి అందరి చేత భేష్ అనిపించుకుంటున్నారు. దీనితో పాటు ఈ ఘనతను గిన్నీస్ రికార్డ్ బుక్ నిర్వాహకులకు తెలియజేశారు. ఈ సూక్ష్మ త్రివర్ణ పతాకానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది 0.5 మిల్లీమీటర్లు ఉండడంతోపాటు... 12వ నెంబరు సూది రంధ్రంలో నుంచి దీనిని సులభంగా బయటకు తీయవచ్చు. దీనిని భారత ప్రభుత్వం న్యూఢిల్లీలోని మ్యూజియంలో కొలువుంచాలని ఇక్బాల్ కోరుకుంటున్నాడు. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. ఇక్బాల్ 1991లో అత్యంత సూక్ష్మమైన చైన్ రూపొందించి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు. తరువాత 2004లో కూడా అత్యంత చిన్న చాయ్ కెటిల్ తయారు చేశారు. అలాగే 2009లో అత్యంత చిన్న స్వర్ణ స్టాంపు తయారుచేసి మరో మారు గిన్నీస్ బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారు.

దలైలామాకు రాందేవ్ పాదాభివందనం



ముంబై: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా, ప్రముఖ యోగా గురు రాందేవ్ బాబా ఒకే వేదికపైకి వచ్చిన అరుదైన ఘట్టం ముంబైలో జరిగింది. ప్రపంచ శాంతి, సామరస్యం సదస్సులో భాగంగా ఉభయులూ కలుసుకున్నారు. మౌలానా కల్బె సిద్ధిఖ్, కేంద్ర మంత్రులు డాక్టర్ హర్షవర్ధన్, ధర్మేంద్ర ప్రధాన్ సైతం ఈ సదస్సులో పాల్గొన్నారు. దలైలామా తన ప్రసంగం ముగించుకుని వేదికపై నుంచి నిష్క్రమిస్తుండగా రాందేవ్ బాబా నేరుగా దలైలామా వద్దకు వెళ్లి పాదాభివందనం చేశారు. దలాలైమా ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ అరుదైన సన్నివేశాన్ని కెమెరాలో బంధించిన పలువురు దీనిని సోషల్ మీడియాలో ఉంచడంతో వైరల్ అవుతోంది. దలైలామా ఈ సందర్భంగా తన అమూల్య సందేశాన్ని ఇస్తూ, మనిషి ఉక్రోషానికి, కోపానికి భయమే కారణని, కోపం హింసకు మూలమని అన్నారు. బాబారాందేవ్ భారత్, చైనా మధ్య ప్రతిష్ఠంభనకు దారితీసిన డోక్లాం సమస్యను ప్రస్తావించారు. 'శాంతిపైన చైనాకు నమ్మకం లేదు. అందువల్లే దలైలామా ఈరోజు మనమధ్య ఉన్నారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బ విధానాన్ని మనం అనుసరించాలి. యోగా పరిభాషలో మనం మాట్లాడుతుంటే, అది తలకెక్కని చైనాకు యుద్ధ పరిభాషలోనే మనం సమాధానం చెప్పాలి' అని ఘాటుగా విమర్శించారు. కాగా, షియా మతపెద్ద మౌలానా కల్బె సిద్దిఖ్ మాట్లాడుతూ, బాబ్రీ మసీదు తీర్పు ముస్లింలకు అనుకూలంగా లేకపోయినట్లయితే ముస్లింలు హుందాగా దానిని అంగీకరించాలని, బాబ్రీ మసీదు తీర్పు ముస్లింలకు అనుకూలంగా వస్తే వారు సంతోషంగా ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించాలని సూచించారు.

బీజేపీ చీఫ్ ఫోటోల తొలగింపు



ఛండీగఢ్: హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాలాకు ఈ చేదు అనుభవం ఎదురైంది. సుభాష్ బరాలా కుమారుడు వికాస్ బరాలా ఈనెల 4న హర్యానా అడిషనల్ చీఫ్ సెక్రటరీ వీఎస్ కుందు కుమార్తె వర్నిక కుందును ఛేజ్ చేసి వేధించిన కేసు రాష్ట్రంలో సంచలనమైంది. ఈ కేసులో వికాస్ బరాలా అరెస్టై ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. కాగా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల 14న గురుగావ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం ఆయనకు స్వాగత పలుకుతూ గురుగావ్ అంతటా పోస్టర్లు వెలిశాయి. ప్రధాని మోదీ, అమిత్‌షా, ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రాష్ట్ర క్యాబినెట్ మంత్రి నర్బీర్ సింగ్, ముగ్గురు ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడి ఫోటోలతో పోస్టర్లు వెలిశాయి. అయితే స్వయానా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన బరాలా ఫోటో మాత్రం అందులో చోటుచేసుకోలేదు. దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో రెండు గ్రూపులు చురుగ్గా ఉన్నాయని, వాటిలో ఒక గ్రూపు బరాలా పార్టీ చీఫ్‌గానే ఉంటారని చెబుతుండగా, నైతిక విలువలకు కట్టుబడి బరాలా రాజీనామా చేయాలని మరో గ్రూప్ చెబుతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. అయితే పోస్టర్లను పార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాటు చేస్తుంటారని, వారి వారి ఆలోచనలను బట్టి పోస్టర్లు ఉంటాయి కానీ అధికారికంగా పార్టీ ఎలాంటి ఆదేశాలు ఇవ్వదని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు తాజా పరిణామాలను విశ్లేషించారు.



కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చిన భద్రతా బలగాలు
- హిజ్బుల్ టెర్రరిస్ట్ యాసిన్ యాతూ హతం
- ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు మృతి

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లోని బందిపొరా జిల్లాలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ప్రస్తుతం భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. శనివారం షోపియాన్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు మృతి చెందారు. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. ఓ ఉగ్రవాది మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవనీరా గ్రామంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు భద్రతా బలగాలకు సమాచారం రావడంతో శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. గమనించిన ఉగ్రవాదులు భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. మొత్తం ముగ్గురు ఉగ్రవాదులు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కాల్పుల్లో ఐదుగురు జవాన్లు గాయపడినట్లు పోలీసులు చెబుతున్నారు. గాయపడిన వారిని 92 బేస్ ఆర్మీ హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని సోఫియాన్ జిల్లాలో గత 20 గంటలుగా కొనసాగుతున్న ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాదళాలు మట్టుపెట్టాయి. వీరిలో ఒకరిని హిజ్బుల్ ముజాహిద్దీన్ టాప్ టెర్రరిస్ట్ యాసిన్ యాతూగా గుర్తించారు. ఇటీవల భద్రతాదళాలు మట్టుపెట్టిన హిజ్బుల్ ముజాహిద్దీన్ టెర్రరిస్ట్ బుర్హాన్ వనీ అనుచరుడే యాసిన్ యాతూ. తక్కిన ఇద్దరు ఉగ్రవాదులను హిజ్బుల్‌కు చెందిన ఇర్ఫాన్-ఉల్-హక్ షేక్, ఉమర్ మజీద్ షేక్‌గా గుర్తించారు. యాతూ అలియాస్ మెహమూద్ గాజ్నవి కాశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదిగా చాలాకాలంగా ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు జమ్మూకాశ్మీర్ పోలీసులు తెలిపారు. కాగా, సోఫియాన్ ఎన్‌కౌంటర్‌లో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు జవాన్లు కూడా కన్నుమూశారు. సిపాయ్ ఇళయరాజా పి, సిపాయ్ గవాయ్ సుమేథ్ వమన్ గాయాలతో వీరమరణం పొందినట్టు అధికారులు తెలిపారు. తమిళనాడులోని కాందని గ్రామానికి చెందిన సిపాయ్ ఇళయరాజాకు తల్లిదండ్రులు, భార్య ఉన్నారు.

ఈసారి కర్నాటకలో బీజేపీ ప్రభుత్వమే



బెంగళూరు: పార్టీ ఐక్యంగా ఉందని, వచ్చే ఏడాది జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చేది భాజపా ప్రభుత్వమే (అబ్ కీ బార్.. బీజేపీ సర్కార్) అంటూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన కర్ణాటక చేరుకున్నారు. ఈ సందర్భంగా కెంపే గౌడా అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ ప్రస్తుతం ఐక్యంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో యడ్యూరప్ప నేతృత్వంలో పార్టీ ఎన్నికలకు వెళ్లబోతోందని అన్నారు. ఈ సారి వచ్చేది భాజపా ప్రభుత్వమే అంటూ కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. గత ఐదేళ్లుగా అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని, కాంగ్రెస్ పాలనపై విరక్తి చెందిన కర్ణాటక ఓటర్లు ఈ సారి భాజపాకే ఓటేస్తారని చెప్పారు. కర్ణాటకలో భాజపాకు అధికారం అప్పగించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి మధ్య విజయ రథం రాష్ట్రంలో పర్యటించనుందని తెలిపారు. వచ్చే ఏడాది కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి 150పైగా స్థానాలను సాధించాలని భాజపా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో పార్టీలోని వివిధ స్థాయి నేతలతో చర్చించడంతో పాటు, పార్టీలో అంతర్గత విభేదాలను తొలగించేందుకు అమిత్‌షా మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు.

'భారత్ సాయం తీసుకోవాలి'

వాషింగ్టన్: క్షిపణుల ప్రయోగంతో ప్రపంచ దేశాలకు తలనొప్పిగా మారిన ఉత్తరకొరియా విషయంలో చర్యలు తీసుకునేందుకు భారత్ సహాయం తీసుకోవాల్సిందిగా యూఎస్ పసిఫిక్ కమాండ్ అడ్మిరల్ హ్యారీ హ్యారిస్ సూచించారు. భారతదేశ స్వరం పెద్దది. ఉత్తర కొరియా సమస్యను అర్థం చేసుకుని అమెరికాకు భారత్ సహాయం చేస్తుంది అని హ్యారిస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉత్తరకొరియా అమెరికా సమీపంలో గువామ్ ద్వీపంపై క్షిపణి దాడి చేస్తామని హెచ్చరించింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగాలకు ఉ.కొరియా భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇలాగే బెదిరింపులకు పాల్పడితే ఎప్పుడూ చూడని విధ్వంసం చూడాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. జులై నెలలో ఉత్తం కొరియా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. ఆ క్షిపణుల ప్రయోగాన్ని భారత్ సహా ఇతర దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్ తీసుకున్న నిర్ణయాన్ని అప్పట్లో ట్రంప్ ప్రభుత్వం ప్రశంసించింది.

అమెరికాలోని వర్జీనియాలో తీవ్ర ఘర్షణలు



వాషింగ్టన్ : శ్వేత జాతీయవాదుల నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. 19 మంది గాయపడ్డారు. శ్వేతజాతీయవాదులతోపాటు వారిని వ్యతిరేకించే వారి మధ్య జరిగిన ఘర్షణలతో వర్జీనియా రాష్ట్రంలోని చార్లెట్స్ విల్ దద్దరిల్లింది. తీవ్ర దుమారానికి కారణమైన ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్‌తో పాటు ఆ దేశానికి చెందిన పలువురు ప్రముఖ నేతలు తీవ్రంగా ఖండించారు. అమెరికా అంతర్‌యుద్ధం సమయంలో సమాఖ్య సైన్యంలో కమాండర్‌గా పనిచేసిన వ్యక్తి విగ్రహాన్ని తొలగించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ వర్జీనియాలో చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. సమాఖ్య సైన్యానికి ఉత్తర వర్జీనియా కమాండర్‌గా పనిచేసిన రాబర్ట్ లీవ్ విగ్రహాన్ని చార్లెట్స్ వీల్ పార్కు నుంచి తొలగించాలని అక్కడి యంత్రాంగం ఇటీవల నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శ్వేత జాతీయవాదులు యునైటెద రైట్ పేరిట భారీ ప్రదర్శన చేపట్టారు. వేర్వేరు ప్రాంతాలకు చెందిన వేలాది మంది వర్జీనియాకు 256 కిలోమీటర్ల దూరంలో ఉన్న చార్లెట్స్ వీల్ పట్టణానికి చేరుకున్నారు. అదే సమయంలో శ్వేతజాతీయుల నిరసనను వ్యతిరేకిస్తూ మరో వర్గం ఆందోళనకు దిగింది. ఫలితంగా రెండు వర్గాలు పరస్పరం దాడులకు పాల్పడగా అనేక మంది గాయపడ్డారు. చార్లెట్స్ వీల్‌లో పెద్దఎత్తున పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించింది. ఘర్షణలు తగ్గుముఖం పట్టే సమయానికి మరో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పట్టణం నడిబొడ్డున శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న ఆందోళనకారులపై ఓ కారు వేగంగా దూసుకొచ్చింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే అంతే వేగంగా వెనక్కి వెళ్లిపోయింది. కారు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. 19 మం ది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. చార్లెట్స్ వీల్ ఘర్షణలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు.

సూర్యగ్రహణ సమయంలో 'బల్లి మనిషి' రాక

వాషింగ్టన్: ఈ నెల 21న సంభవించబోయే సంపూర్ణ సూర్యగ్రహణం సమయంలో కొన్ని అతీంద్రియ పరిణామాలు చోటుచేసుకోవచ్చని దక్షిణ కరోలైనా రాష్ట్ర అత్యవసర నిర్వహణ విభాగం (ఎస్‌సీఈఎండీ) తన కౌంటీల్లోని పౌరులకు హెచ్చరిక జారీ చేసింది. భారీ బల్లి మనిషి తారసపడవచ్చని ఆ సందేశం చెబుతోంది. అయితే ఇదేదో జనాల్ని ఆట పట్టించడానికి చేసిన ప్రకటన కాదని అధికారులు చెబుతున్నారు. దక్షిణ కరోలైనాలో ఇలాంటి బల్లి మనిషి దర్శనమిచ్చిన ఉదంతాలు లోగడ చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఒక మ్యాప్‌ను కూడా విడుదల చేశారు. అలాగే సూర్య గహణం కనిపించే ప్రాంతాలనూ అందులో చూపారు. అక్కడి వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ బల్లి మనిషిని తొలిసారి 1988లో క్రిస్టోఫర్ డేవిస్ అనే వ్యక్తి చూసినట్లు చెబుతారు. అప్పట్లో అతడి వయసు 17 ఏళ్లు. అతడి కథనం ప్రకారం.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతడు.. తన కారులో ప్రయాణిస్తున్నాడు. స్కేప్ ఓర్ స్వాంప్ అనే ప్రదేశం వద్దకు చేరుకోగానే టెరు పంక్చరైంది. తిరిగి కారులోకి ప్రవేశించే సమయంలో తనకు 30 గజాల దూరంలో చింతనిప్పుల్లాంటి ఎర్రటి కళ్లతో కూడిన భూతం ఒకటి కనిపించినట్లు అతడు తెలిపాడు. అంతలోనే తేరుకొని.. ఒక్క ఉదుటున కారులోకి ప్రవేశించి, కారును ముందుకు దూకించాడు.


ఈ జీవి.. అతడి కారు పైకప్పు మీదకు దూకింది. దాన్ని తోసివేసేందుకు అతడు ప్రయత్నించాడు. కానీ గంటకు 40 మైళ్ల వేగంతో కారు దూసుకెళుతున్నప్పటికీ అది కొద్దిదూరం పాటు నిలకడగానే ఉంది. డేవిస్ కథనం.. అప్పట్లో అంతర్జాతీయంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. నెల రోజుల తర్వాత ఇద్దరు పోలీసులు కూడా అలాంటిదేదో ఉన్నట్లు తాము నిర్ధారణగా చెప్పగలమని పేర్కొన్నారు.

నాలోనే అమ్మను చూసుకోండి: శశికళ



చెన్నై: దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి శశికళ పార్టీ శ్రేణులకు భావోద్వేగంతో కూడిన లేఖ రాశారు. తనలో అమ్మ(జయలలిత)ను చూసుకోవాలని ఆమె లేఖలో కార్యకర్తలకు సూచించారు. విపక్షం నుంచి పార్టీని, తమిళనాడును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీని బలహీనపరిచేందుకు ప్రత్యర్థులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ప్రతినబూనాలని పరప్పణ అగ్రహార సెంట్రల్ జైలు నుంచి ఆమె కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. పార్టీ పత్రికలో ఈ మేరకు ఆమె కార్యకర్తలను కోరుతూ రాసిన లేఖను ప్రచురించారు. సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం గ్రూపుల విలీన చర్చల నేపథ్యంలో శశికళ పార్టీ క్యాడర్‌కు రాసిన లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో మూడో అతిపెద్ద పార్టీ అయిన ఏఐఏడీఎంకేను కాపాడుకునేందుకు ప్రజాజీవితంలో కొనసాగాలని తాను నిర్ణయించుకున్నట్టు ఆమె పేర్కొన్నారు.

తీవ్ర ఒత్తిడిలో ఉగ్రవాదులు: జైట్లీ



న్యూఢిల్లీ: ఉగ్రవాదులు ఇప్పుడు తీవ్ర ఉత్తిడిలో ఉన్నారని, పెద్ద నోట్ల రద్దు, విదేశీ నిధులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పెద్దఎత్తున దాడులు జరుపుతుండటంతో తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్నారని కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఆదివారంనాడిక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో జైట్లీ మాట్లాడుతూ, ఇవాళ ఏ పెద్ద ఉగ్రవాది కూడా కశ్మీర్‌లో ఉగ్రకార్యకలాపాలకు, ప్రజలను భయభ్రాంతులను చేయడానికి సాహసించే పరిస్థితి లేదని, కొద్దిరోజులుగా వారి మనుగడే ప్రమాదంలో పడిందని చెప్పారు. ఉగ్రవాదులను ఏరివేసేందుకు జమ్మూకాశ్మీర్ ప్రజలు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని ప్రశంసించారు. మన దేశం రెండు విధాలైన ముప్పును ఎదుర్కొంటోందని, వీటిలో ఒకటి జమ్మూకాశ్మీర్ సరిహద్దు వెంబడి జరుగుతున్న ఘటనలు కాగా, వాపపక్ష తీవ్రవాదం మరొకటని అన్నారు. 'స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశంలో కశ్మీర్ భాగమని ఏనాడూ పాకిస్థాన్ ఒప్పుకోలేదు. అది పాక్ అసంపూర్తి ఎజెండా. దానికి దీటైన జవాబు ఇండియా ఇస్తూనే ఉంది. 1965, 1971, కార్గిల్ యుద్ధమే ఇందుకు నిదర్శనం' అని జైట్లీ అన్నారు. కాగా, డోక్లాం వ్యవహారంలో భారత్, చైనా మధ్య తలెత్తిన ప్రతిష్ఠంభనపై మాట్లాడేటప్పుడు జైట్లీ సంయమనం కనబరచారు. మన భద్రతా బలగాలపై పూర్తి విశ్వాసం ఉంచుదాం అని ముక్తసరిగా సమాధానమిచ్చారు.

చైనాలో భారతీయుడికి అవమానం

- షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో ఘటన
- భారతీయ వ్యక్తితో సిబ్బంది అనుచిత ప్రవర్తన
- కొట్టిపారేసిన చైనా విదేశాంగ శాఖ
- అమర్యాదపై స్పందించిన సుష్మా



బీజింగ్: చైనా విమానాశ్రయంలో ఓ భారతీయుడికి అవమానం ఎదురైంది. అక్కడి విమానాశ్రయ సిబ్బంది భారతీయ వ్యక్తితో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడినట్లు అతడు ఫిర్యాదు చేశాడు. షాంఘై పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారతీయుల వాదనను మాత్రం చైనా విదేశాంగశాఖ కొట్టిపారేస్తోంది. ఈ వివాదం భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ దృష్టికి వచ్చినట్లు పీటీఐ వెల్లడించింది. చైనా విమానాశ్రయ సిబ్బందిపై ప్రయాణికుడు దిల్లీలో ఫిర్యాదు చేశాడు. నార్త్ అమెరికన్ పంజాబీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డెరెక్టర్ సత్నం సింగ్ ఛహల్‌కు షాంఘై విమానాశ్రయంలో ఈ ఘటన ఎదురైంది. దీన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. ఎగ్జిట్ గేట్ దగ్గర విమాన సిబ్బంది తనను దుర్భాషలాడుతూ మాట్లాడినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఛహల్ ఆగస్టు 6న న్యూఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాల్సి ఉంది..చైనా విమానాశ్రయంలో దిగిన ఆయన మరో విమానం ఎక్కాల్సి ఉండగా ఈ ఘటన జరిగింది. అయితే.. ఈ ఘటనపై స్పందించిన చెనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ఛహల్ పట్ల చాలా మర్యాదపూర్వకంగా ప్రవర్తించామని చెప్పుకొచ్చింది.తన మంత్రిత్వ శాఖకు సంబంధించిన అంశాలపై వేగంగా స్పందించే సుష్మా స్వరాజ్ మరోసారి చొరవ తీసుకున్నారు.

షాంగై పుడోంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చైనా ఎయిర్‌లైన్ సంస్థ భారతీయుల పట్ల అమర్యాదరంగా వ్యవహరించిందని వచ్చిన ఆరోపణలపై చైనాకు భారత్ ఫిర్యాదు చేసింది. భారత ప్రయాణీకుడి ఆరోపణల నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ మేరకు స్పందించింది. చహల్ అనే భారత ప్రయాణీకుడు ఈనెల 6న న్యూఢిల్లీనుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళుతూ షాంగై పుడోంగ్ ఎయిర్‌పోర్టులో ఆగి తదుపరి విమానం కోసం వేచిచూశారు. ఇదే విషయమై సంబంధిత అధికారితో మాట్లాడగా ఆయన తనపై కేకలు వేస్తూ అమర్యాదకరంగా వ్యవహరించారని చహల్ ఆరోపించారు. చైనా అధికారి వ్యవహార శైలి చూస్తే భారత్-చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలతో ఆయన ప్రభావితమైనట్టుగా ఉందన్నారు. తనకు ఎదురైన అనుభవాలను వివరిస్తూ ఆయన విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్‌కు లేఖ రాశారు. మంత్రి చొరవతో ఈ అంశాన్ని చైనా విదేశాంగ శాఖ, పుడోంగ్ ఎయిర్‌పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు భారత అధికారులు తెలిపారు.అయితే ఈ ఆరోపణలను చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ తోసిపుచ్చింది. సంబంధింత మెటీరియల్స్, ఎయిర్‌పోర్ట్ సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన మీదట ఈ ఆరోపణలు నిరాధారమని తేలినట్టు ఆ సంస్థ పేర్కొంది.

ఇండోనేషియాలో భూకంపం



జకార్తా: ఇండోనేషియాలోని సుమత్రా దీవుల్లో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై 6.5 తీవ్రత నమోదైంది. ఎటువంటి సునామీ హెచ్చరికలు జారీచేయలేదని యూఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం రాలేదు. బెంగ్‌కులు ప్రాంతానికి 73 కిమీ దూరంలో 35కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. సుమత్రా దీవుల్లో సంభవించిన భూకంపం కారణంగా సింగపూర్‌లోనూ అక్కడకక్కడా ప్రకంపనలు వచ్చాయి. దాంతో ప్రజలందరూ ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు. ఈ విషయాన్ని పలువురు ట్విటర్ ద్వారా తెలియజేశారు. ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో నేను నా ఏడు నెలల మనవడిని తీసుకొని బయటకు పరిగెత్తాను. నాతో పాటు చుట్టుపక్కల ఇళ్లల్లోని ప్రజలు కూడా బయటకు పరుగులు పెట్టారు అని ప్రత్యక్ష సాక్షి హసన్వ్ తెలిపారు. గతేడాది డిసెంబరులో ఇండోనేషియాలోని ఏస్ ప్రావిన్స్‌లో సంభవించిన భూకంపం కారణంగా దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోగా.. వేల సంఖ్యలో ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు.

అథ్లెటిక్స్‌లో అదే వైఫల్యం

లండన్ : ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత క్రీడాకారుల వైఫల్యం కొనసాగుతోంది. తొలిసారి జావెలిన్ త్రో ఫైనల్ చేరిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన దావిందర్ సింగ్ కంగ్ ఫైనల్ పోరులో చతికిల పడ్డాడు. స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో విఫలమై పరాజయం పాలయ్యాడు. ఊహించని రీతిలో ఈ పోటీలో 12వ స్థానంలో నిలిచి కంగుతిన్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో అతడు జావెలిన్‌ను 80.02 మీటర్లు మాత్రమే విసిరాడు. అదీ మూడో దఫాలో. తొలి ప్రయత్నంలో 75.40 మీటర్లు విసిరిన అతడు రెండోసారి ఫౌల్ అయ్యాడు. కంగ్ సీజన్, వ్యక్తిగత అత్యుత్తమం 84.57 మీటర్లు కాగా ఈసారి అంతదూరం కూడా జావెలిన్‌ను విసరలేకపోయాడు. జర్మనీ అథ్లెట్ జొనెస్ వెటెర్ (89.89 మీ) స్వర్ణం సాధించాడు.





లంకలో మనోళ్లు అదుర్స్

మూడో టెస్టు విజయానికి చేరువలో టీమిండియా

- హార్దిక్ పాండ్యా వీరోచిత శతకం
- టీమిండియా తొలి ఇన్నింగ్స్ 487
- బంతితో చెలరేగిన కుల్‌దీప్ యాదవ్
- అశ్విన్, షమీలకు రెడేసి వికెట్లు
- పేకమేడలా కూలిన శ్రీలంక బ్యాటింగ్
- కేవలం 135 పరుగులకే లంకేయుల తొలి ఇన్నింగ్స్‌కు తెర
- ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన కోహ్లీ
- రెండోరోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో లంక స్కోరు 19/1
- మరో 333 పరుగుల ఆధిక్యంలో భారత్
- విజయానికి 9 వికెట్ల దూరంలో కోహ్లీ సేన

క్యాండీ : శ్రీలంక పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సీరీస్‌లో భాగంగా తొలి రెండు టెస్టుల్లో ఘన విజయాన్ని కైవసం చేసుకున్న టీమిండియా మూడో టెస్టును మరింత భారీ తేడాతో దక్కించుకునేందుకు బాటులు వేసుకుంది. మూడు రోజుల్లోనే మ్యాచ్‌ని ముగించే పనిలో నిమగ్న మైంది భారత్. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి టెస్టు సీరీస్‌ను వైట్‌వాష్ చేసేం దుకు ఉవ్విళ్లూరుతోంది. సీనియర్లందరూ... రిటైర్మెంట్ ప్రకటించడంతో పూర్తిగా బలహీన పడ్డ శ్రీలంక క్రికెట్ జట్టును పసికూనను చేసి ఆటాడుకుం టోంది. మూడో టెస్టు రెండో రోజు ఆతిథ్య శ్రీలంకపై పర్యాటక భారత జట్టు పూర్తి ఆదిపత్యాన్ని సాధించింది. బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించిన యంగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా శతకంతో వీరవిహారం చేయడంతో భారత్ తొలి ఇన్నిం గ్స్‌లో 487 పరుగుల భారీ స్కోర్‌కు చేరుకుంది. బ్యాట్స్‌మెన్ అందించిన భారీ టార్గెట్‌ను నిలబెట్టుకోవడంలో మన బౌలర్లు కూ డా అదే స్థాయిలో శ్రీలంకపై విరుచుకుపడ్డారు. కుల్‌దీప్, షమి, అశ్విన్ చెలరేగడంతో లంకేయులు నిలబడలేకపోయారు. 38 ఓవర్లకు 135కే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడ్డారు. బౌలర్లు ఇలాగే విజృంభిస్తే ఇన్నింగ్ తేడాతో టీమిండియా విజయం ఖాయమేనని చెప్ప డంలో సందేహం లేదు.

బ్యాటింగ్‌లో పాండ్యా మెరుపులు

రెండో రోజు, ఆదివారం హైలైట్ టీమిండి యా యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (108; 96 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్) ఇన్నింగ్సే. ఓవర్‌నైట్ స్కోరు 329/6 వద్ద క్రీజులోకి వచ్చిన పాండ్యా హార్డ్ హిట్టింగ్‌తో ఆకట్టుకున్నాడు. సహచరుడు వృద్ధిమాన్ సాహా (16) జట్టు స్కోరు 339 వద్ద ఔటైనా పాండ్యా ఏ మాత్రం వెరవలేదు. తన సహజ శైలిలో విజృంభించాడు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు ఒక పరుగుతో క్రీజులోకి వచ్చిన పాండ్యా కేవలం 86 బంతుల్లోనే శతకం బాదేశాడు. 116వ ఓవర్లో వరుసగా 4,4,6,6,6 బాది 26 పరుగులు రాబట్టాడు. టెస్టుల్లో ఒక ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన భారతీయుడిగా కూడా పాండ్యా చరిత్ర సృష్టించాడు. మరోవైపు కుల్‌దీప్ (26)తో తొమ్మిదో వికెట్‌కు 62 పరుగులు, షమి(8)తో కలిసి చివరి వికెట్‌కు 66 పరుగుల విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. 122.3వ బంతికి సండకన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అతడి వీరవిహారంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేసింది.



కుప్పకూలిన శ్రీలంక

బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో పరుగులు చేసేందుకు శ్రీలంక అష్ట కష్టాలు పడింది. భారత బౌలర్ల విజృంభనను తట్టుకోలేక విలవిల్లాడింది. భారత బౌలర్లు ఆతిథ్య బ్యాట్స్‌మెన్‌ను వణికించడంతో... ఓపెనర్లు కరుణరత్నె (4), ఉవుల్ తరంగ (5) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌కు చేరారు. వీరిద్దరి వికెట్లును తన ఖాతాలో వేసుకోవడంతో మహ్మద్ షమి భారత్‌కు శుభారంభం అందించాడు. అతడి బౌలింగ్‌లోనే కుశాల్ మెండిస్ (18) జట్టు స్కోరు 38 వద్ద రనౌట్ అయ్యాడు. పరుగులేమీ చేయకుండానే పాండ్యా వేసిన 9.3వ బంతికి మాథ్యూస్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఐతే లంక పతనాన్ని సారథి దినేశ్ చండిమాల్ (48; 87 బంతుల్లో 6 ఫోర్లు), నిరోషన్ డిక్వెలా (29; 31 బంతుల్లో 4 ఫోర్లు) కాసేవు అడ్డుకున్నారు. అర్ధశతకం ముందు చండిమాల్‌ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. అప్పుడు జట్టు స్కోరు 101. ఆ తర్వాత చెనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ చెలరేగి డిక్వెలా, పెరీరా (0), వుష్పకుమార (10), విశాల్ ఫెర్నాండో (0)ను పెవిలియన్‌కు వరుస కట్టించా డు. 37.4వ బంతికి సండకన్ (10)ని అశ్విన్ ఔట్ చేయడంతో శ్రీలంక 135 పరుగులకు కుప్పకూలింది. టీమిండియాకు 352 పరుగుల ఆధిక్యం లభించింది. ఫాలోఆన్ ఆడుతున్న లంక ఆట ముగిసే సమయానికి వికెట్ నష్ట పోయి 19 పరుగులతో నిలిచింది. కరుణరత్నె (12 బ్యాటింగ్), వుష్పకుమార (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

'స్పిన్నర్లే వల్లే భారత్‌కు అడ్డుకట్ట'

భారత్‌తో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టు తొలి రోజు శ్రీలంక ఫాస్ట్ బౌలర్లు విఫలమైనా, స్పిన్నర్లు ఆకట్టుకోవడం పట్ల ఆ జట్టు బౌలింగ్ కోచ్ చామిందా వాస్ ఆనందం వ్యక్తం చేశాడు. తమ స్పిన్నర్ల ప్రదర్శన మెరుగ్గా ఉండటం వల్లే భారత జట్టు బ్యాటింగ్‌ను ఆ మాత్రం కట్టడి చేయకలిగే అవకాశం దక్కిందన్నాడు. భారత ఓపెనర్లు శిఖర్ ధావన్–కేఎల్ రాహుల్ లు తొలి వికెట్ కు 188 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే ఆపై స్వల్ప విరామా ల్లో భారత జట్టు వికెట్లు కోల్పోయింది. శ్రీలంక స్పిన్నర్లు వుష్పకుమార, సండకన్ లు రాణించడంతో భారత జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 329 పరుగులు చేసింది. దీనిపై చామిందా వాస్ సంతోషం వ్యక్తం చేశాడు. తమ స్పిన్ బౌలర్ల ప్రదర్శ నతో చాలా సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్నాడు. అయితే ఇక్కడ ఫాస్ట్ బౌలర్లు ఆకట్టుకోలేకపోవడానికి వారికి అనుభవలేమే ప్రధాన కారణమన్నాడు. తమ జట్టులో ఉన్న పేసర్లకు పెద్దగా అంతర్జాతీయ మ్యాచ్‌లు అనుభవం లేదని, అందుచేత ఆరంభంలో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నాడు. క్రమేపీ వారు వుంజుకుని రాణించడం ఒక్కటే వారు ముందున్న లక్ష్యమన్నాడు.



స్కోరు వివరాలు – భారత్ తొలి ఇన్నింగ్స్ : శిఖర్‌ధావన్ సి ఛండీమల్ బి పుష్పకుమార 119, లోకేష్‌రాహుల్ సి కరుణ రత్నే బి పుష్పకుమార 85, ఛతేశ్వర్‌పుజారా సి మ్యాథ్యూస్ బి సందకన్ 8, విరాట్ కోహ్లీ సి కరుణరత్నే బి సందకన్ 42, అజయంక్యా రహనే బి పుష్పకుమార 17, రవిచంద్రన్ అశ్విన్ సి దిక్‌వెల్ బి విశ్వ ఫెర్నాండో 31, వృద్ధిమాన్ సాహా సి దిల్‌రువాన్ పెరెరా బి విశ్వ ఫెర్నాండో 16, హార్దిక్ పాండ్యా సి దిల్‌రువాన్ పెరెరా బి సండకన్ 108, కుల్‌దీప్ యాదవ్ సి డిక్‌వెల్ బి సండకన్ 26, మహ్మద్ షమీ సి అండ్ బి సండకన్ 8, ఉమేష్‌యాదవ్ నాటౌట్ 3. ***అదనం–24***. మొత్తం ***: (122.3 ఓవర్లలో ఆలౌట్) 487***.

వికెట్ల పతనం : 1–188 లోకేష్‌రాహుల్, 2–219 శిఖర్‌ధావన్, 3–229 ఛతేశ్వర్ పుజారా, 4–264 అజయెంక్యా రహనే, 5–296 విరాట్ కోహ్లీ, 6–322 రవిచంద్రన్ అశ్విన్, 7–339 వృద్ధిమాన్ సాహా, 8–401 కుల్‌దీప్ యాదవ్, 9–421 మహ్మద్ షీమీ, 10–487 హార్దిక్ పాండ్యా.

బౌలింగ్ : విశ్వ ఫెర్నాండో 26–3–87–2, లాహిరు కుమార 23–1–104–0, దిముత్ కరుణరత్నే 7–0–30–0, దిల్ రువాన్ పెరెరా 8–1–36–0, లక్షన్ సండకన్ 35..3–4–132–5, మిలిండా పుష్పకుమార 23–2–82–3.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : దిముత్ కరుణరత్నే సి సాహా బి షమీ 4, ఉపుల్ తరంగా సి సాహా బి షమీ 5, కుసాల్ మెండీస్ రనౌట్ 18, దినేష్ ఛండీమల్ సి రాహుల్ బి అశ్విన్ 48, ఏంజిలో మ్యాథ్యూస్ ఎల్బీడబ్ల్యు బి హార్దిక్ పాండ్యా 0, నిరో షన్ డిక్‌వెల్లా స్టంప్ సాహా బి కుల్‌దీప్ యాదవ్ 29, దిల్‌రుమాన్ పెరెరా సి హార్దిక్ పాండ్యా బి కుల్‌దీప్ యాదవ్ 0, మలిందా పుష్పకుమార బి కుల్‌దీప్ యాదవ్ 10, లక్షన్ సండన్ సి ధావన్ బి అశ్విన్ 10, విశ్వ ఫెర్నాండో బి కుల్‌దీప్ యాదవ్ 0, లాహిరు కుమార నాటౌట్ 0. ***అదనం–11***. మొత్తం ***: (37.4 ఓవర్లలో ఆలౌట్) 135***.

వికెట్ల పతనం : 1–14 ఉపుల్ తరంగా, 2–23 దిముత్ కరుణరత్నే, 3–38 కుశాల్ మెండీస్, 4–38 ఏంజిలో మ్యాథ్యూస్,5–101 నిరోషన్ డిక్‌విల్లా, 6–107 దిల్‌రువాన్ పెరెరా, 7–125 దినేష్ ఛండీమల్, 8–125 మిలిందా పుష్పకుమార, 9–135 విశ్వ ఫెర్నాండో, 10–135 లక్మల్ సండన్.

బౌలింగ్ : మహ్మద్ షమీ 6.5–1–17–2, ఉమేష్‌యాదవ్ 3.1–0–23–0, హార్దిక్ పాండ్యా 6–1–28–1, కుల్‌దీప్ యాదవ్ 13–2–40–4, రవిచంద్రన్ అశ్విన్ 8.4–2–22–2.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ : దిముత్ కరుణరత్నే నాటౌట్ 12, ఉపుల్ తరంగా బి ఉమేష్‌యాదవ్ 7, మలిండ పుష్పకు మార నాటౌట్ 0. ***అదనం–0***. మొత్తం ***: (13 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 19***.

వికెట్ల పతనం : 1–15 ఉపుల్ తరంగా.

బౌలింగ్ : మహ్మద్ షమీ 4–2–7–0, రవిచంద్రన్ అశ్విన్ 6–4–5–0, ఉమేష్‌యాదవ్ 2–0–3–1, కుల్‌దీప్ యాదవ్ 1–0–4–0.

శ్రీలంకతో వన్డే సీరీస్ కోసం టీమిండియా ఎంపిక

- యువీకి దక్కని చోటు
- వైస్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ

బెంగళూరు : శ్రీలంక పర్యటనలో భాగంగా జరగనున్న వన్డే, టీ20 సీరీస్‌లలో తలపడనున్న భారత జట్టును ఆది వారం నాడు బీసీసీఐ ఎంపిక చేసింది. కోహ్లీ సారథ్యంలో శ్రీలంకతో తలపడనున్న జట్టులో శిఖర్‌ధావన్, రోహిత్, కేఎల్ రాహుల్, మనీశ్ పాండే, రహానే, కేదార్ జాదవ్, మహేంద్ర సింగ్ ధోనీ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, కుల్‌దీప్, చాహల్, బుమ్రా, భువనేశ్వర్, శార్దుల్ ఠాకుర్‌లకు చోటుదక్కింది. ఈ సారి కెప్టెన్‌గా కోహ్లీకి సహా యకులుగా ఉండేందుకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలను రోహిత్ శర్మకు అప్పగించారు. అయితే ఈ సీరీస్‌లో ఆడే అవకాశం దక్కించుకుంటాడనుకున్న యువరాజ్‌సింగ్‌కు మాత్రం జట్టులో చోటు దక్కలేదు. అంతే కాకుండా... వన్డే సీరీస్‌కు తనకు పిలుపు వస్తుందనుకున్న పేసర్ మహ్మద్ షమీ, ఉమేష్ యాదవ్‌లను విశ్రాంతి పేరు పక్కన బెట్టారు. ఈ నెల 20 నుంచి భారత్ శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల వన్డే సీరీస్‌లో ఆడనుంది. ఆతిథ్య శ్రీలంకతో మూడు టెస్టుల సీరీస్‌ను ఇప్పటికే టీమిండియా 2–0తో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా తాజాగా పల్లెకెలెలో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టులో సైతం సత్తా చాటుతున్న భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేయడంతో పాటు శ్రీలంకను తొలి ఇన్నింగ్స్ లో 135 పరుగులకే ఆలౌట్ చేసి ఫాలోఆన్ ఆడిస్తుంది. ఆదివారం నాడే రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 19 పరుగులు చేసింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల టెస్టు మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదనే విధంగా మ్యాచ్ సాగుతోంది. ఇదిలా ఉంటే... భారత్ ఈ సీరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేందుకు కేవలం 9 వికెట్ల దూరంలో నిలిచింది.



ఎంపికైన వన్డే, టీ20 జట్టు వివరాలు

విరాట్ కోహ్లీ (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్‌శర్మ (వైస్ కెప్టెన్), లోకేష్ రాహుల్, మనీశ్ పాండే, అజింక్య రహనె, కేదార్ జాదవ్, మహేంద్రసింగ్ ధోని, హార్దిక్ పాండ్యా, అక్షర్‌పటేల్, కుల్‌దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమార్, శార్దూల్ ఠాకూర్

బోల్ట్ వీడ్కోలు విషాదం

న్యూయార్క్ : అనుకున్నట్లే పరు గు ప్రారంభమైంది. సహచరుడు బోల్ట్‌కు బ్యాటన్ అందించాడు. అందరూ బోల్ట్.. బోల్ట్ అంటూ కేకలు వేస్తూ ప్రోత్సహిస్తున్నారు. విజయ తీరాన్ని తాకడానికి ఇం కొన్ని క్షణాలు మాత్రమే ఉన్నా యి. కానీ.. బోల్ట్ పరుగులో వే గం సన్నగిల్లుతోంది. ఏం జరిగిం దో తెలుసుకునే లోపే బోల్ట్ ఒక్క సారిగా కుప్పకూలిపోయాడు. జమైకన్ అభిమానుల ఉత్సాహం ఆవిరైంది. వారి అరుపులు ఆగిపోయాయి. వారి కళ్లను వారే నమ్మలేకపోతున్నారు. విజయ గర్వంతో కెరీర్ ముగి స్తాడనుకుంటే.. పతకం లేకుండానే మానవ చిరుత తన కెరీర్‌ను ముగించటం షాక్‌కు గురి చేసింది. ఏ అభిమాని కలలో కూడా వూహించని పరిణామం చోటు చేసుకోవటం తో అందరూ షాక్‌లో ఉండిపోయారు.



కన్నీరు పెట్టించేలా..

గాయం కారణంగా పరుగు ఆపేసి కుప్పకూలిన బోల్ట్‌ను చూసి ఫిజియో వీల్‌చెర్‌పై కూర్చోబెట్టి పరుగు పూర్తి చే యించాలని భావించగా.. అతని సహచరులు మాత్రం అందుకు భిన్నంగా ఆలోచించారు. కాళ్ల కింద చక్రాలు ఉన్నాయేమోనని అనిపించే పరుగుల వీరుడుకి వీడ్కోలు పలకాల్సిన తీరు ఇలా కాదనుకున్నట్లున్నారు అతని సహచ రులు. తమ భుజాలపై బోల్ట్ చేతులు వేసుకొన్న మెక్‌లాడ్, జూలియన్, బ్లేక్, రోజ్ అతనికి ఐతమిస్తూ పరుగు పూర్తి చేయించారు. ఈ సన్నివేశంతో స్టేడియంలోని అభిమాను లంతా భావోద్వేగంతో కదిలిపోయారు. బోల్ట్ చివరి పరు గు వూహలకు అందరి రీతిలో ముగిసి.. ఎప్పటికి మర్చిపో లేనిదిగా మిగిలిపోయింది. ట్రాక్‌పై పడిపోయిన పరుగుల వీరుడు తన సహచరులతో సాయంతో పైకి లేచి ఫినిషిం గ్‌లైన్‌ను ముగించాడు. ఇదంతా గమనిస్తున్న అభిమానుల హృఎదయం ద్రవించిపోయింది. పరుగు ముగించిన తర్వాత బోల్ట్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. కళ్ల నిం డా నీళ్లతో బోల్ట్ అభిమానులకు వీడ్కోలు చెబుతున్న దృ ఎశ్యం చూపరులను కంటతడి పెట్టించింది. ఆ మాటకు వస్తే ప్రతి క్రీడాభిమాని కళ్లు కన్నీటితో నిండిపోతే.. చివర కు స్టేడియం సైతం చిన్నబోయింది.

ఎప్పుడూ బంగారు పతకం సాధించి అభిమానులను ఉర్రూతలూగించే బోల్ట్ 2008లో కెరీర్ ప్రారంభించిన నా టి నుంచి కేవలం నాలుగు సార్లు మాత్రమే విజయాన్ని అందుకోలేకపోయాడు.. అయితే గాయంతో వెనుదిరగ డం మాత్రం ఇదే మొదటి.. చివరిసారి కూడా. ఫాల్స్ స్టార్ట్ వల్ల ఓసారి.. తన సహచరులు డోపింగ్ పరీక్షలో విఫలం కావటంతో మరోసారి.. ఇటీవల జరిగిన వంద మీటర్ల పరుగులో మూడోస్థానంతో ముగించిన బోల్ట్.. తన చివరి పరుగును కాలి కండరాలు పట్టేసి అందరిలోనూ కన్నీళ్లను తెప్పించేలా చేశాయి. బరిలోకి దిగితే బంగారమే అనుకునే బోల్ట్ కాస్తా బాధతో కెరీర్ ముగించాల్సి వచ్చింది.

పాండ్యా అదుర్స్ : సెహ్వాగ్



క్యాండీ : అరంగేట్రం టెస్టు సిరీస్‌లోనే అద్భుత శతకం చేసి అదరగొట్టాడు టీమిండియా యువ ఆటగాడు హార్దిక్ పాండ్యా. రెండో టెస్టులో అర్ధశతకం చేసిన అతడు మూడో మ్యాచ్‌లో భారీ సిక్సర్లు, బౌండరీలు బాదుతూ శ్రీలంక బౌలర్లను ఒక ఆట ఆడుకున్నాడు. 96 బంతుల్లోనే 8 బౌండరీలు, 7 సిక్సర్లు బాది 108 పరుగులు చేశాడు. కఠినంగా మారిన పిచ్‌పై అలవోకగా తొలి శతకం సాధించిన పాండ్యాపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

★ వావ్! హార్దిక్ పాండ్యా అద్భుత శతకం. నా కుంగ్‌ఫూ పాండ్యా వెల్‌డన్. మజా వచ్చింది. – వీరేంద్ర సెహ్వాగ్

★ పాండ్యా నుంచి నమ్మశక్యం కాని శతకం. అద్భుత కౌంటర్ ఎటాక్. తొలి 50 పరుగులు 61 బంతుల్లో మిగతావి 25 బంతుల్లోనే సాధించాడు. – మహ్మద్ కైఫ్

★ హార్దిక్ ఒక సెషన్‌లో వంద పరుగులు చేశాడు. అద్భుత సామర్థ్యంతో గేరు మార్చాడు. అతడి తొలి 50 పరుగులే నన్ను బాగా ఆకర్షించాయి. –హర్ష భోగ్లే

★ పాండ్యా హార్డ్ హిట్టింగ్. ఏమి ఇన్నింగ్స్ అది. – ఆకాశ్ చోప్రా

★ భారత్‌కు 483వ టెస్టు శతకం అందించిన 81వ బ్యాట్స్‌మన్ హార్దిక్ పాండ్యా. – మోహన్ దాస్ మేనన్, క్రికెట్ విశ్లేషకుడు

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 487 పరుగులు చేయగా శ్రీలంక 135 పరుగులకే కూలి ఫాలోఆన్‌లో పడింది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·